తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

RNI NO.TELTEL / 2013 /50370

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శనివారం 04.07.2026 | సంపుటి : 12 సంచిక : 345 | పేజీలు : 12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్










# కాలం గెలిచిన స్నేహం

సంపాదకీయం

ఇరాన్ మాజీ సర్వోన్నత నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు భారత ప్రభుత్వం ఉన్నతస్థాయి ప్రతినిధి బృందాన్ని టెహ్రాన్‌కు పంపడం ఒక ముఖ్యమైన దౌత్య నిర్ణయంగా చెప్పుకోవాలి. విదేశాంగ శాఖ సహాయ మంత్రి, బిహార్ గవర్నర్‌తో పాటు పలువురు మత పెద్దలతో కూడిన ఈ బృందం అంత్యక్రియల్లో పాల్గొనడం, భారత్–ఇరాన్ మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న సంబంధాలకు కొనసాగింపుగానే చూడాలి. ఇరాన్‌తో భారత్‌కు ఉన్న అనుబంధం కేవలం చమురు వాణిజ్యానికో, చాబహార్ నౌకాశ్రయ ప్రాజెక్టుకో పరిమితమైనది కాదు; అది సాంస్కృతిక, చారిత్రక పునాదులపై నిర్మితమైనది. లక్నో వంటి నగరాల్లో పర్షియన్ భాష, షియా సంస్కృతి ఇప్పటికీ సజీవంగా ఉండటం ఇందుకు నిదర్శనం.

కశ్మీర్ అంశంపై పాకిస్తాన్ పదేపదే అంతర్జాతీయ వేదికలపై భారత్‌ను ఇరుకున పెట్టేందుకు ప్రయత్నించిన సందర్భాల్లో ఇరాన్ పోషించిన పాత్రను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవడం సముచితం. 1994లో జెనీవాలో జరిగిన ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కమిషన్ సమావేశంలో, పాకిస్తాన్ నేతృత్వంలోని ఇస్లామిక్ దేశాల సంస్థ (ఓఐసీ) కశ్మీర్‌లో మానవ హక్కుల ఉల్లంఘనల పేరుతో భారత్‌పై తీర్మానం ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. అప్పటి విదేశాంగ మంత్రి దినేష్ సింగ్ ప్రధాని పీవీ నరసింహారావు సందేశంతో టెహ్రాన్ వెళ్లి, ఇరాన్ అధ్యక్షుడు రఫ్సంజానీని కలిశారు. ఫలితంగా జెనీవాలో ఓఐసీ ఏకాభిప్రాయాన్ని ఇరాన్ ప్రతినిధి అడ్డుకోవడంతో ఆ తీర్మానం తెరమరుగైంది. భారత్–పాకిస్తాన్ మధ్య విభేదాలు ద్వైపాక్షికంగానే పరిష్కారం కావాలని, వాటిని అంతర్జాతీయ వేదికపైకి తేవడం సరికాదని ఇరాన్ అప్పట్లో స్పష్టం చేసింది. ఈ ఘటన భారత దౌత్యనీతిలో ఒక కీలక మలుపుగా చరిత్రకారులు పేర్కొంటారు.

ఈ నేపథ్యంలో, భారత్–ఇరాన్ మైత్రిని కేవలం వ్యూహాత్మక అవసరంగా కాకుండా, పరస్పర విశ్వాసంపై ఆధారపడిన దీర్ఘకాలిక బంధంగా చూడాల్సిన అవసరం ఉంది. మధ్యప్రాచ్యంలో భారత్‌కు ఉన్న భాగస్వామ్యాలు అనేకం ఉన్నప్పటికీ, ప్రతి భాగస్వామ్యాన్ని ఒకే గాటన కట్టి చూడలేం. కొన్ని సంబంధాలు వాణిజ్య, రక్షణ అవసరాల ఆధారంగా ఏర్పడినవి కాగా, ఇరాన్‌తో ఉన్న బంధం చరిత్ర, భౌగోళిక సామీప్యత, సాంస్కృతిక పరస్పర ప్రభావాలపై నిలబడినది. అందుకే, "ఫాదర్‌ల్యాండ్" అనే భావనను తక్కువ చరిత్ర, భిన్న నేపథ్యం ఉన్న భాగస్వామ్యాలకు ఆపాదించడం సరికాదన్న వాదన బలంగా వినిపిస్తుంటుంది. ఇరాన్‌తో భారత్‌కు ఉన్నది కేవలం ఒప్పందాల బంధం కాదు, అది శతాబ్దాల నాటి సాంస్కృతిక వారసత్వం, పరస్పర సంక్షోభ సమయాల్లో నిలబడిన అనుభవాల మిశ్రమం.


ఖమేనీ అంత్యక్రియల్లో భారత్ పాలుపంచుకోవడాన్ని కేవలం లాంఛనప్రాయ దౌత్య మర్యాదగా కాకుండా, ఈ దీర్ఘకాలిక మైత్రికి కొనసాగింపుగా చూడటమే సబబు.

## నా దేశం!

అందరూవాళ్ళే
వాళ్ళేకవులు
వాళ్ళేరచయితలు
వాళ్ళేపండితులు
శాలువాలు
కప్పేదీ వాళ్ళే
కప్పించుకొనేదివాళ్ళే!
సూద్రుల్ని
ఎదగనిచ్చారా?
సూద్రులజ్ఞానం
పాపహేతువు!
రాముడితోచెప్పి
తపస్సు చేస్తున్న
శంభూకుడి తల
నరికించారు !
వాళ్ల ఇంటిపేర్లు
ఎంతగొప్ప!
'వేదం' నుండి
'పురాణం' దాకా!
పుణ్యమూర్తులు
పండితారాధ్యులు
దేవలోకాలు
అన్నీ వాళ్ళవే!
ఇక మాసంగతి!
ఎంత దరిద్రులం!
మేం పాదాలనుండి
పుట్టినవాళ్ళం!
చదువుల్లేవు
వినటం పాపం!
అలా ఫ్రేం చేసారు!
మా ఇంటిపేర్లు
ఒకడు 'దొంగ'
కుక్క!నక్క! పిల్లి!
పంది కూడా!
ఇక మా పేర్లు!
పెంటయ్య!
మసియ్య..!
పుట్టినవాళ్లు
చచ్చిపోతుంటే
బతకాలని
పెట్టిన పేర్లు!
ఈ మూఢత్వమంతా
జాతకాలుచూసి
పెట్టింది వాళ్ళే!
వాళ్లపేర్లుమాత్రం
ఎంతోఅందం!
వాళ్లు చావరు!
దిక్కుమాలిన
చావులు మాకే!
ఈ దేశంలో
ఎంత వివక్ష!
అడిగితే
కర్మ అంటారు!
పూర్వ జన్మ పాపం!
పెద్దల ఇళ్లల్లో
చాకిరీలు చేస్తే
వచ్చేజన్మ
'ఓ.కే' చేస్తారు!
ఇవన్నీ
వాళ్ళు చెప్పినవే
నా మొహం
నాకేంతెలుసు
సూద్రపోణ్ణి!
స్మృతుల్లోరాసారు!
వాళ్ల చేతివాటమే !
వివక్షల భారతం
కులాల భారతం
మతాల భారతం
మూఢత్వభారతం
చీలికల భారతం
అస్పృశ్య భారతం
1947స్వతంత్రం
'లౌకిక' భారతం!
ఇంతలోనే
అంధకారం!
2047కి'సనాతనం'
మళ్ళీఅదే వివక్ష!
ఇదీ ఈదేశం!
ఇదే నాదేశం!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

## తెలంగాణ సాయుధ పోరాట జ్వాల
# దొడ్డి కొమురయ్య



*నిజాం నిరంకుశత్వానికి, దొరల దాష్టీకాలకు మరియు భూస్వాముల ఆగడాలను వ్యతిరేకంగా భారత కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం సాగిన 'తెలంగాణ సాయుధ పోరాటం' ప్రపంచ చరిత్రలోనే ప్రముఖ స్థానాన్ని సము పార్జించుకుని నిత్యనూతన చైతన్య ప్రవంతిగా వెలుగొందుతూ నే ఉంది. తెలంగాణ సాయుధ పోరాటంలో 'దున్నేవాడిదే భూమి' అనే నినాదం మార్మోగిపోయింది. వేలాది గ్రామాలు వెట్టి చాకిరి నుండి విముక్తి పొందాయి. పది లక్షల ఎకరాల భూములు పేద ప్రజలకు పంపిణీ చేయబడ్డాయి. 'బాంచెన్ దొరా ... నీ కాళ్లు మొక్కుతా' అన్న పీడిత ప్రజానీకం ఆయుధాలు చేబూని దొరల, భూస్వాముల, పెత్తందారుల అరాచకాలను అంతమొందించారు.*

తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర అనగానే మొట్టమొదటగా స్ఫురించే విప్లవ జ్వాల దొడ్డి కొమురయ్య. 'భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం' అనే నినాదాలుగా మారుమోగిన ఉద్యమం క్రమంగా 'తెలంగాణ సాయుధ పోరాటం'గా మారడానికి దొడ్డి కొమురయ్య అమరత్వం ప్రధాన భూమికగా నిలిచింది. జనగామ జిల్లా లోని కడివెండి గ్రామంలో కురుమ కులానికి చెందిన గొర్రెల కాపరుల కుటుంబములో దొడ్డి కొమురయ్య 1927 ఏప్రిల్ 3 నాడు జన్మించాడు. తెలంగాణలో భూస్వాముల, దొరల దోపిడి–దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు దొడ్డి కొమురయ్య. విస్నూరు గ్రామంలోని నిజాం తొత్తు అయిన దేశ్ముఖ్ రామచంద్రారెడ్డి 60 గ్రామాలను తన అధీనంలో ఉంచుకుని అక్కడి ప్రజానీకం పట్ల అతి క్రూరంగా వ్యవహరించారు. ఆయన తల్లి జానకమ్మ దొరసాని కడివెండి గ్రామంలో ఉండి ప్రజల చేత 'దొరసాని' అని పిలిపించుకోవడంలో అత్యుత్సాహాన్ని ప్రదర్శించేవారు. ఆమె కడివెండి గ్రామాన్ని తన చెప్పుచేతల్లో పెట్టుకొని ప్రజానీకం పట్ల నిర్దాక్షిణ్యంగా వ్యవహరించారు. అలాగే నిజాంకు తొత్తులుగా ఉన్న దొరలు, భూస్వాములు ప్రజలపై జులుం చెలాయించేవారు.

ఈ క్రమంలోనే ఆంధ్ర జనసంఘం 1930 నాటికి 'ఆంధ్ర మహాసభ'గా రూపుదిద్దుకుంది. తెలంగాణ ప్రాంతం అంతా ఆంధ్ర మహాసభ నాయకత్వంలో సంఘాన్ని ఏర్పరుచుకుంది. ప్రజలు వెట్టిచాకిరి రద్దు కోసం 'పన్నులు చెల్లించేది లేదు' అంటూ తిరుగుబావుటా ఎగురవేసి ఉద్యమబాట పట్టారు. దీనిని సహించని దొరలు ఉద్యమాన్ని అణచడం కోసం అనేక పన్నాగాలు పన్నారు. 1944 నాటి భువనగిరి ఆంధ్ర మహాసభ భూస్వాములపై పోరాటాలకు ఆశాకిరణంగా నిలిచింది. దొరలు – భూస్వాములు కొనసాగిస్తున్న దోపిడి – దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఆరుట్ల రాంచంద్రారెడ్డి కడివెండి గ్రామ ప్రజలకి చైతన్యాన్ని రగిలించారు. గొల్ల, కురుమల నాయకుడు గాను, ఆంధ్ర మహాసభలో సభ్యుడిగాను ఉన్న తన అన్న దొడ్డి మల్లయ్య ప్రభావంతో దొడ్డి కొమురయ్య ఆ సంఘంలో చేరి దొరలకు వ్యతిరేకంగా పోరాడారు. సంఘం పిలుపు మేరకు వందలాది మంది ప్రజానీకం 1946 జూలై 4 సాయంత్రం కడివెండి గ్రామంలో దొడ్డి మల్లయ్య నేతృత్వంలో ప్రదర్శనగా బయలుదేరారు. అంతకుముందే దొరసానికి అండగా వచ్చిన విస్నూరు రామచంద్రారెడ్డి గుండాలు కాల్పులు జరిపారు. ఫలితంగా కొమురయ్య అన్న మల్లయ్య కాలులోకి తూటా దూసుకుపోయింది. అలాగే దొడ్డి కొమురయ్య కడుపులోకి తూటా దూసుకెళ్ళినసూ ఆయన ఏమాత్రం అధైర్యపడకుండా ప్రతిఘటిస్తూనే ఒకదశలో ఒక్కసారిగా అక్కడికక్కడే నేలపై కుప్పకూలి 'ఆంధ్రమహాసభకు జై', 'కమ్యూనిస్టు పార్టీకి జై' అని నినదిస్తూ వీర మరణం పొందాడు. దొడ్డి కొమురయ్య మరణ వార్తతో చుట్టు పక్కల గ్రామాల ప్రజల్లో ఆగ్రహావేశాలు రగిల్చింది. వేలాది మంది ప్రజలు ఎక్కడికక్కడ సంఘం అండతో ప్రతీకార చర్యలలో భాగంగా దొర గూండాలను తరిమికొట్టారు.

దొడ్డి కొమురయ్య వీర మరణం తెలంగాణ సాయుధ పోరాటానికి విప్లవ జ్వాలలను రగిలించింది. క్రమంగా సంఘం పిలుపుతో ప్రజలు సాయుధ మార్గం దిశగా ఉద్యుక్తులు అయ్యారు. ఆ రకంగా దొడ్డి కొమురయ్య హత్యతో శాంతియుతంగా సాగుతున్న రైతాంగ ఉద్యమం ఎగిసిపడిన కెరటంలా ఒక్కసారిగా సాయుధ విప్లవోద్యమంగా మారింది. ఈ సాయుధ పోరాటంలో నాలుగు వేల మంది ఉద్యమకారులు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించడాన్ని తెలంగాణా సమాజం ఏనాటికి మరచిపోదు. 'తెలంగాణ సాయుధ పోరాటంలో అమరుడైన తొలి వ్యక్తి'గా దొడ్డి కొమురయ్య తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడు. అంతిమంగా అశేష ప్రజా హృదయాలలో చిరస్మరణీయమైన స్థానాన్ని పదిలపరచుకున్న దొడ్డి కొమురయ్య తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో 'వేగుచుక్క'గా వెలుగొందుతూనే ఉంటారు.



జె.జె.సి.పి.బాబూరావు
రీసెర్చ్ స్కాలర్
సెల్: 94933 19690

## అధికారంతో కాదు... ప్రజలతో చేయి కలిపిన కలం

(ఒక పాత్రికేయుడి అనుభవం చెబుతున్న నిజం)

"ప్రజాస్వామ్యంలో పాత్రికేయుడు అధికారంతో చేయి కలపడం నైతిక నేరం."

ఈ వాక్యం చదివిన ప్రతిసారి నాకు నా పాతికేళ్ల పాత్రికేయ జీవితమే గుర్తుకొస్తుంది. నేను ఈ మాటను పుస్తకాలలో చదివి చెప్పడం లేదు. దాదాపు ఇరవై ఐదు సంవత్సరాలుగా ఉద్యమ జీవితం పాటు పత్రికా రంగంలో పనిచేస్తూ నేర్చుకున్న జీవిత పాఠంగా చెబుతున్నాను. మండల రిపోర్టర్‌గా గ్రామాల్లో నడిచాను. డివిజన్ స్టాఫర్‌గా ప్రజల సమస్యలను నమోదు చేశాను. సబ్ ఎడిటర్‌గా వార్తలకు బాధ్యత వహించాను. డెస్క్ జర్నలిస్టుగా వేలాది వార్తలను పరిశీలించాను. ఫీచర్ డెస్క్‌లో సమాజాన్ని లోతుగా అర్థం చేసుకునే కథనాలను రూపొందించాను. ఈ ప్రయాణమంతా ఒక ప్రజాశక్తి, నవతెలంగాణ వామపక్ష దృక్పథం కలిగిన పత్రికలో సాగింది. అందుకే నాకు జర్నలిజం ఒక ఉద్యోగం కాదు, అది సమాజం పట్ల ఉన్న నైతిక బాధ్యతగా చూశాను.

గ్రామాల్లో రిపోర్టర్‌గా పనిచేసిన రోజుల్లో ఒక విషయం స్పష్టంగా అర్థమైంది. ప్రభుత్వ కార్యాలయాల్లో కనిపించే అభివృద్ధి నివేదికలు ఒకటి, ప్రజల జీవితాల్లో కనిపించే వాస్తవం మరోటి. ఫైళ్లలో పథకాలు విజయవంతం అవుతాయి, కానీ పొలాల్లో రైతు అప్పులతో చనిపోతాడు. కాగితాలపై పాఠశాలలు నడుస్తాయి, కానీ పిల్లలకు ఉపాధ్యాయులు ఉండరు. గణాంకాల్లో పేదరికం తగ్గుతుంది, కానీ కూలీ కుటుంబం ఆకలితోనే నిద్రపోతుంది. ఈ వైరుధ్యాన్ని చూడగలిగితేనే పాత్రికేయుడు నిజమైన వార్తను రాయగలడు. నా జీవితానుభవం అదే! డెస్క్‌లో పనిచేసిన తర్వాత మరో విషయం అర్థమైంది. ఒక వార్త ఎలా రాయబడుతుందన్నది ఎంత ముఖ్యమో, ఎలా రాయకూడదన్నది కూడా అంతే ముఖ్యం. ఒక్క శీర్షిక ప్రజల ఆలోచనలను ప్రభావితం చేస్తుంది. ఒక్క పదం అధికారాన్ని ప్రశ్నించవచ్చు, లేక అధికారానికి ప్రచారం చేయవచ్చు. అందుకే సంపాదకీయ బాధ్యత కేవలం భాష పట్ల కాదు, ప్రజల పట్ల కూడా ఉంటుంది. వామపక్ష పత్రికలో పనిచేయడం నాకు మరో గొప్ప పాఠాన్ని నేర్పింది. పత్రిక అంటే అధికార ప్రకటనలను ముద్రించే యంత్రం కాదు. సమాజంలోని అట్టడుగు మనిషి జీవితాన్ని చరిత్రలో నమోదు చేసే ప్రజా పత్రం. ఆ పత్రికలో వార్తకు విలువ దాని సంచలనంలో కాదు, దాని సామాజిక ప్రయోజనంలో ఉంటుంది. రైతు పోరాటం, కార్మికుల సమ్మె, గిరిజనుల భూ హక్కులు, మహిళలపై హింస, విద్యార్థుల ఉద్యమాలు అన్నీ వార్తల కేంద్రంగా ఉండేవి. అక్కడే నేను జర్నలిజం అసలు అర్థాన్ని నేర్చుకున్నాను. ఈ కాలంలో మీడియా ప్రపంచం మారిపోయింది. వార్త ఒక వస్తువుగా మారింది. నిజం కంటే వేగం ముఖ్యం అయింది. ప్రజల కంటే అధికారుల సమావేశాలు ఎక్కువ ప్రాధాన్యం పొందుతున్నాయి. ప్రశ్నించే మీడియా క్రమంగా ప్రచారం చేసే మీడియాగా మారుతోంది. ఇది సాంకేతిక మార్పు కాదు, నైతిక పతనం.

నా అనుభవం చెబుతున్న ఒక సత్యం.. పాత్రికేయుడు అధికారానికి ఎంత దగ్గరవుతాడో, ప్రజలకు అంత దూరమవుతాడు. అధికారుల విందుల్లో కూర్చున్న కలం, ఆకలితో ఉన్న కూలీ బాధను రాయలేదు. అధికారపు ప్రశంసలతో నిండిన మనసు, అణచివేతను ప్రశ్నించే ధైర్యాన్ని కోల్పోతుంది. పాత్రికేయుడి తటస్థత గురించి కూడా చాలా మాట్లాడతారు. కానీ నా అనుభవంలో తటస్థత అనేది చాలా సందర్భాల్లో ఒక ముసుగు మాత్రమే. ఒకవైపు అన్యాయం, మరోవైపు బాధితుడు ఉన్నప్పుడు తటస్థంగా ఉండటం అంటే బలవంతుడి పక్షాన నిలబడటమే. అందుకే నేను ప్రజాపక్షాన్ని ఎంచుకున్నాను. అది బాధితుడి పక్షం. శ్రమజీవి పక్షం. అణగారిన మనిషి పక్షం.

పాతికేళ్ల పాత్రికేయ జీవితం నాకు నేర్పిన గొప్ప పాఠం ఇది. వార్తకు అసలు యజమాని ప్రభుత్వం కాదు, ప్రజలు. కలానికి అసలు జవాబుదారీతనం అధికారానికి కాదు, సమాజానికి. ప్రజాస్వామ్యంలో పాత్రికేయుడు అధికారంతో చేయి కలపడం కేవలం వృత్తి పరమైన తప్పు కాదు, అది ప్రజల విశ్వాసానికి ద్రోహం. ఎందుకంటే జర్నలిస్టు చేతిలోని కలం అధికారానికి ఆయుధం కాదు, ప్రజలకు అండగా నిలిచే ఆయుధం కావాలి. చరిత్రలో నిలిచిపోయిన గొప్ప పాత్రికేయులు అధికారానికి దగ్గరగా ఉన్నందుకు గుర్తుండలేదు. ప్రజల పక్షాన నిలిచినందుకు గుర్తుండిపోయారు. నేను నడిచిన పాత్రికేయ ప్రయాణం అదే చెబుతోంది. పత్రికా స్వేచ్ఛ అంటే అధికారాన్ని సంతోషపెట్టడం కాదు, అధికారాన్ని ప్రశ్నిస్తూ ప్రజల పక్షాన నిలబడటం. అదే జర్నలిజం. అదే జర్నలిస్టు వృత్తి జీవితానికి సారాంశం.

- మామిండ్ల రమేష్ రాజా, 7893230218

## రాజ్యాంగం, ప్రభుత్వ విద్యాలయాలు
# లౌకిక విద్య




భారతదేశం తనను తాను సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా గర్వంగా నిర్వచించుకుంటుంది. ఇది కేవలం రాజ్యాంగ పీఠికలోని ఒక ప్రకటన మాత్రమే కాదు. ప్రభుత్వ వ్యవస్థలోని ప్రతి సంస్థ, ముఖ్యంగా ప్రభుత్వ విద్యా వ్యవస్థ, అనుసరించాల్సిన ప్రాథమిక మార్గదర్శక సూత్రం. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను హిందూ ప్రార్థనలు చేయాలని బలవంతం చేయలేమని ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు ఒక పాఠశాలకు సంబంధించిన నిర్ణయం మాత్రమే కాదు. అది మన రాజ్యాంగం హామీ ఇచ్చిన మనస్సాక్షి స్వేచ్ఛ, మత స్వేచ్ఛ, లౌకిక విద్య అనే విలువలను మరోసారి స్పష్టంగా గుర్తు చేసిన ముఖ్యమైన తీర్పు.

ఈ తీర్పు ఒక ప్రాథమిక ప్రశ్నను మన ముందుంచుతుంది. ప్రభుత్వ పాఠశాల లక్ష్యం ఏమిటి? ఒక నిర్దిష్ట మతాన్ని లేదా విశ్వాసాన్ని విద్యార్థుల్లో పెంపొందించడమా? లేక శాస్త్రీయ దృక్పథం, విమర్శనాత్మక ఆలోచన, రాజ్యాంగ విలువలు, సామాజిక సమానత్వాన్ని పెంపొందించడమా? దీనికి రాజ్యాంగం స్పష్టమైన సమాధానం ఇస్తుంది. ప్రభుత్వ విద్య ఉద్దేశం ఏ మతాన్నీ ప్రోత్సహించడం కాదు; అవగాహన కలిగిన, బాధ్యతాయుతమైన, సమాన హక్కులు కలిగిన పౌరులను తీర్చిదిద్దడం.

రాజ్యాంగంలోని అధికరణ 25 ప్రతి వ్యక్తికి మనస్సాక్షి స్వేచ్ఛతో పాటు తనకు నచ్చిన మతాన్ని స్వీకరించే, ఆచరించే, ప్రచారం చేసే హక్కును కల్పిస్తుంది. అదే సమయంలో అధికరణ 28(1) పూర్తిగా ప్రభుత్వ నిధులతో నిర్వహించే విద్యాసంస్థల్లో మతబోధను నిషేధిస్తుంది. ఈ రెండు అధికరణాలను కలిపి పరిశీలిస్తే, ప్రభుత్వం ఏ ఒక్క మతానికీ ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వకూడదని, విద్యార్థులను ఏ మతపరమైన ఆచరణలోనూ బలవంతంగా పాల్గొనమని చెప్పకూడదని స్పష్టమవుతుంది.

భారతదేశం యొక్క గొప్ప బలం దాని అపార వైవిధ్యం. ఒక ప్రభుత్వ పాఠశాల తరగతి గదిలో హిందూ, ముస్లిం, క్రైస్తవ, సిక్కు, బౌద్ధ, జైన, ఆదివాసీ, అలాగే ఏ మతాన్నీ అనుసరించని విద్యార్థులు కలిసి చదువుతుంటారు. అలాంటి పరిస్థితిలో ఒకే మతానికి చెందిన ప్రార్థనను తప్పనిసరి చేయడం ఇతర విద్యార్థుల్లో పరాయితన భావాన్ని కలిగించే ప్రమాదం ఉంది. కొందరి గుర్తింపుకే ఎక్కువ ప్రాధాన్యం ఉన్నట్లు సందేశం వెళ్లే అవకాశం ఉంటుంది. పిల్లల విద్యా ప్రయాణం ప్రారంభంలోనే సమానత్వానికి భంగం కలిగితే, తర్వాత పాఠ్యపుస్తకాల ద్వారా బోధించే రాజ్యాంగ విలువలు కేవలం పుస్తకాలకే పరిమితమయ్యే ప్రమాదం ఉంది.

భారత న్యాయవ్యవస్థ మతాల గురించి బోధించడం, మతబోధ చేయడం అనే రెండింటి మధ్య స్పష్టమైన తేడాను ఎప్పటి నుంచో గుర్తిస్తోంది. అరుణా రాయ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (2002) కేసులో సుప్రీంకోర్టు వివిధ మతాల గురించి నిష్పాక్షికంగా, తులనాత్మకంగా బోధించడం విద్యను మరింత సమృద్ధిగా చేస్తుందని పేర్కొంది. అయితే ఒకే మతానికి సంబంధించిన ఆచారాలను ప్రోత్సహించడం లేదా బలవంతంగా అమలు చేయించడం పూర్తిగా భిన్నమైన విషయం. అది రాజ్యాంగం ప్రతిపాదించిన లౌకికవాద స్ఫూర్తికి విరుద్ధమని స్పష్టం చేసింది. ప్రభుత్వ విద్యా వ్యవస్థ తటస్థతను కాపాడేందుకు ఈ తేడా అత్యంత అవసరమని న్యాయస్థానాలు పలుమార్లు స్పష్టం చేశాయి.

ప్రభుత్వ పాఠశాలలే దేశ భవిష్యత్తును నిర్మిస్తాయి. యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్(యూడీఐఎస్ఈ) 2023-24 గణాంకాల ప్రకారం భారతదేశంలో దాదాపు 14.8 లక్షల ప్రభుత్వ పాఠశాలల్లో 16 కోట్లకు పైగా విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలల్లో విద్యార్థులు నేర్చుకునే విలువలు వారి వ్యక్తిగత జీవితాలను మాత్రమే కాకుండా భారత ప్రజాస్వామ్య స్వరూపాన్నీ ప్రభావితం చేస్తాయి. అందుకే ప్రభుత్వ విద్యలో రాజ్యాంగపరమైన తటస్థత అనేది కేవలం అవసరం మాత్రమే కాదు, అత్యంత కీలకమైనది కూడా.

విద్యార్థులను మతపరమైన కార్యక్రమాల్లో పాల్గొనాలని బలవంతం చేయడం కేవలం మత స్వేచ్ఛకు సంబంధించిన అంశం మాత్రమే కాదు; అది మేధో స్వేచ్ఛను కూడా ప్రభావితం చేస్తుంది. ఆధునిక విద్య ఉద్దేశం ప్రశ్నించే స్వభావం, శాస్త్రీయ దృక్పథం, తార్కిక ఆలోచన, మానవ గౌరవం, రాజ్యాంగ నైతికతను పెంపొందించడం. కానీ ఒక నిర్దిష్ట మతాచారాన్ని తప్పనిసరి చేస్తే, స్వతంత్ర ఆలోచన కంటే విధేయతకే ఎక్కువ ప్రాధాన్యం లభించే ప్రమాదం ఉంటుంది.

అయితే లౌకిక విద్య అంటే మతాల పట్ల వ్యతిరేకత కాదని కూడా గుర్తించాలి. భారతదేశపు గొప్ప సాంస్కృతిక వారసత్వం, తాత్విక సంప్రదాయాలు, వివిధ మతాల చరిత్ర గురించి విద్యార్థులకు బోధించడం పూర్తిగా రాజ్యాంగ సూత్రాలకు అనుగుణమే. ప్రపంచంలోని అనేక ప్రజాస్వామ్య దేశాల్లో కూడా విద్యా వ్యవస్థలో వివిధ మతాల గురించి తులనాత్మక అధ్యయనం ఉంటుంది. అయితే అది భక్తిని పెంపొందించే విధంగా కాకుండా, అవగాహన పెంచే విధంగా ఉండాలి. మతాల గురించి తెలుసుకోవడం విద్యలో భాగం; మతాచరణను బలవంతం చేయడం మాత్రం కాదు.

ఇటీవలి సంవత్సరాల్లో దేశంలోని వివిధ ప్రాంతాల్లో పాఠశాల ప్రార్థనలు, మతపరమైన ఆచారాలు, పాఠ్యపుస్తకాల అంశాలపై తరచూ చర్చలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో న్యాయస్థానాల జోక్యం రాజ్యాంగాన్ని రక్షించే ఒక ముఖ్యమైన భరోసాగా నిలుస్తోంది. అయితే రాజ్యాంగాన్ని పాటించడం కేవలం కోర్టుల ఆదేశాల వల్ల మాత్రమే జరగకూడదు. ప్రభుత్వాలు, విద్యాశాఖలు, పాఠశాలల యాజమాన్యాలు స్వయంగా లౌకిక పాలన సూత్రాలను అర్థం చేసుకుని, వాటిని నిజాయితీగా అమలు చేయాలి. బలమైన ప్రజాస్వామ్యం అంటే పిల్లలు పరస్పరం పోటీ పడే మత గుర్తింపులతో కాకుండా, ఉమ్మడి రాజ్యాంగ విలువలతో అనుసంధానమైన సమాన పౌరులుగా ఎదగడం. ప్రభుత్వ పాఠశాలలో ఉదయం అసెంబ్లీలో ఏ దేవుడి ప్రార్థన జరుగుతుందన్నది ప్రజాస్వామ్యానికి అసలు కొలమానం కాదు. ప్రతి విద్యార్థికి తరగతి గదిలో సమాన గౌరవం, సమాన మర్యాద, సమాన స్థానం లభిస్తున్నాయా అనేదే నిజమైన కొలమానం. ప్రభుత్వ విద్యలో అందరినీ కలిపి ఉంచే సాధారణ ఆధారం రాజ్యాంగమే కావాలి; ఏ మతమూ ఎప్పటికీ తప్పనిసరి కాకూడదు.

అందువల్ల ఛత్తీస్‌గఢ్ హైకోర్టు తీర్పు కేవలం ఒక న్యాయ నిర్ణయం మాత్రమే కాదు. ప్రతి విద్యార్థికి మతపరమైన బలవంతం లేకుండా స్వేచ్ఛగా ఆలోచించే, నేర్చుకునే హక్కు ఉందనే రాజ్యాంగ హామీని మరోసారి గుర్తు చేసిన తీర్పు. లౌకికవాదం అంటే మత వ్యతిరేకత కాదు. అన్ని మతాలను, అలాగే ఏ మతాన్నీ అనుసరించని వారిని కూడా సమాన గౌరవంతో చూడాలనే ప్రభుత్వ నిబద్ధతే లౌకికవాదం. అదే భారత రాజ్యాంగం యొక్క గొప్ప బలం, భారత ప్రజాస్వామ్యానికి పునాది, నిజమైన సమ్మిళిత విద్యా వ్యవస్థకు మార్గదర్శక సూత్రం.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# వ్యక్తిత్వాన్ని విడనాడుతున్న సమాజం -ఎందుకు!



వ్యక్తిత్వం అనేది ఒక వ్యక్తి ఆలోచనలు, నైతిక విలువలు, ప్రవర్తన, బాధ్యత, నిజాయితీ, క్రమశిక్షణ, మానవత్వం వంటి లక్షణాల సమాహారం. సమాజ అభివృద్ధికి ఆర్థిక ప్రగతి ఎంత అవసరమో, వ్యక్తిత్వ వికాసం కూడా అంతే అవసరం. అయితే ఆధునిక కాలంలో వ్యక్తిత్వం కంటే ధనం, హోదా, ప్రాచుర్యం, సామాజిక మాధ్యమాల్లో గుర్తింపు వంటి అంశాలకు అధిక ప్రాధాన్యం లభించడం వల్ల విలువల ఆధారిత జీవన విధానం క్రమంగా బలహీనపడుతోంది.

వ్యక్తిత్వ క్షీణత ఒకే సంవత్సరం నుంచి ప్రారంభమైందని చెప్పడం శాస్త్రీయంగా సరైనది కాదు. అయితే సామాజిక శాస్త్రవేత్తల విశ్లేషణ ప్రకారం 1980లలో ప్రపంచీకరణ వేగం పెరగడం, 1990లలో ఆర్థిక సరళీకరణ విధానాలు అమల్లోకి రావడం, 2005 తర్వాత సామాజిక మాధ్యమాల విస్తరణ, 2020 తర్వాత డిజిటల్ జీవనశైలి వేగంగా వ్యాపించడం వల్ల వ్యక్తుల ఆలోచనా విధానం, జీవన విలువలు, సంబంధాల్లో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ మార్పుల నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా వ్యక్తిత్వం, సామాజిక విలువలు, నైతిక ప్రవర్తనపై అనేక పరిశోధనలు జరిగాయి. అవి ప్రత్యక్షంగా "ఎంత శాతం మంది వ్యక్తిత్వాన్ని కోల్పోయారు" అని చెప్పకపోయినా, వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేసే అనేక అంశాలపై స్పష్టమైన గణాంకాలను వెల్లడించాయి.

**పరిశోధనల్లో పేర్కొన్న ముఖ్యమైన అంశాలు:**

- ప్రపంచ జనాభాలో సుమారు 68% మంది ఇంటర్నెట్‌ను వినియోగిస్తున్నారు.
- ప్రపంచవ్యాప్తంగా సుమారు 64% మంది సామాజిక మాధ్యమాలను ఉపయోగిస్తున్నారు.
- సగటున ఒక వ్యక్తి రోజుకు 2 గంటల 20 నిమిషాల నుంచి 2 గంటల 40 నిమిషాల వరకు సామాజిక మాధ్యమాల్లో గడుపుతున్నట్లు అంతర్జాతీయ అధ్యయనాలు సూచిస్తున్నాయి.
- యువతలో 55%–70% మంది సామాజిక మాధ్యమాల్లో ఇతరులతో తమ జీవితాన్ని పోల్చుకుంటున్నట్లు వివిధ సర్వేలు పేర్కొన్నాయి.
- సుమారు 60% మంది యువత ఆన్‌లైన్ విమర్శలు లేదా పోలికల వల్ల మానసిక ఒత్తిడిని అనుభవిస్తున్నట్లు అనేక అధ్యయనాలు వెల్లడించాయి.
- కార్యాలయాల్లో ఉద్యోగులలో 50% కంటే ఎక్కువ మంది అధిక పనిఒత్తిడి కారణంగా వ్యక్తిగత జీవితానికి తగిన సమయం కేటాయించలేకపోతున్నట్లు అంతర్జాతీయ కార్మిక అధ్యయనాలు తెలియజేస్తున్నాయి.

ఈ గణాంకాలు సమాజంలో ప్రతి ఒక్కరూ వ్యక్తిత్వాన్ని విడనాడుతున్నారని నిరూపించవు. కానీ వ్యక్తిత్వాన్ని బలహీనపరిచే పరిస్థితులు గణనీయంగా పెరుగుతున్నాయని సూచిస్తున్నాయి. అందువల్ల "సమాజంలో 70% మంది వ్యక్తిత్వాన్ని కోల్పోయారు" వంటి వాక్యాలు పరిశోధనపరంగా సరైనవి కావు. వ్యక్తిత్వ క్షీణతకు ప్రధాన కారణాలు కుటుంబ వ్యవస్థలో మార్పులు, నైతిక విద్య తగ్గిపోవడం, వినియోగ సంస్కృతి విస్తరణ, అధిక పోటీ, సామాజిక మాధ్యమాల ప్రభావం, రాజకీయ విలువల క్షీణత, అవినీతి, స్వార్థపూరిత జీవన విధానం, సమయాభావం, మానవ సంబంధాల బలహీనత వంటి అనేక అంశాల సమ్మిళిత ప్రభావంగా గుర్తించబడ్డాయి.

అందువల్ల వ్యక్తిత్వాన్ని విడనాడుతున్న సమాజం అనేది ఒక వ్యక్తి సమస్య కాదు. అది కుటుంబం, విద్యా వ్యవస్థ, పాలనా విధానం, ఆర్థిక వ్యవస్థ, సాంకేతిక పరిణామాలు, సాంస్కృతిక మార్పుల ప్రభావంతో రూపుదిద్దుకుంటున్న సామాజిక పరిణామంగా పరిశోధకులు విశ్లేషిస్తున్నారు.

2.వ్యక్తిత్వం క్షీణించడం ఒక్కరోజులో జరిగిన పరిణామం కాదు. సామాజిక శాస్త్రవేత్తలు, మనోవిజ్ఞాన నిపుణులు, విద్యావేత్తలు, ఆర్థిక విశ్లేషకులు వెల్లడించిన అంశాలను పరిశీలిస్తే గత 40-45 సంవత్సరాలుగా ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకున్న ఆర్థిక, సాంకేతిక, సాంస్కృతిక మార్పులు మానవ వ్యక్తిత్వంపై గణనీయమైన ప్రభావం చూపినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా 1980 తర్వాత ప్రపంచీకరణ వేగం పెరగడం, 1991 తర్వాత భారతదేశంలో ఆర్థిక సరళీకరణ అమలు కావడం, 2004--2010 మధ్య సామాజిక మాధ్యమాల విస్తరణ, 2020 తర్వాత డిజిటల్ జీవన విధానం మరింత బలపడటం వల్ల వ్యక్తుల జీవనశైలి పూర్తిగా మారిపోయింది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఐక్యరాజ్యసమితి, ఐక్యరాజ్యసమితి విద్యా శాస్త్ర సాంస్కృతిక సంస్థ, ఆర్థిక సహకార అభివృద్ధి సంస్థ, ప్యూ పరిశోధనా కేంద్రం, ప్రపంచ విలువల సర్వే, ఎడెల్‌మన్ విశ్వాస సూచిక వంటి సంస్థలు వివిధ సందర్భాల్లో నిర్వహించిన అధ్యయనాల ప్రకారం సామాజిక నమ్మకం, కుటుంబ బంధాలు, ప్రజా జీవితంలో విలువలు, మానసిక ఆరోగ్యం వంటి అంశాల్లో మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇవి ప్రత్యక్షంగా "వ్యక్తిత్వం కోల్పోవడం"ను కొలవకపోయినా, వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేసే పరిస్థితులను స్పష్టంగా సూచిస్తున్నాయి.

సామాజిక మాధ్యమాల ప్రభావం అత్యంత కీలకంగా మారింది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 64% మంది సామాజిక మాధ్యమాలను ఉపయోగిస్తున్నారు. భారతదేశంలో కూడా కోట్లాది మంది ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్, యూట్యూబ్, వాట్సాప్ వంటి సామాజిక వేదికలను వినియోగిస్తున్నారు. 2025 డిజిటల్ నివేదికల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా సగటున ఒక వ్యక్తి రోజుకు 2 గంటల 21 నిమిషాల పాటు సామాజిక మాధ్యమాల్లో గడుపుతున్నాడు. ఈ సమయం ప్రత్యక్ష కుటుంబ సంబంధాలు, పుస్తక పఠనం, సామాజిక సేవ, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాల నుంచి దూరం చేస్తున్నదని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి. ప్యూ పరిశోధనా కేంద్రం నిర్వహించిన పలు అధ్యయనాల ప్రకారం యువతలో 59% కంటే ఎక్కువ మంది సామాజిక మాధ్యమాల్లో ఇతరులతో తమ జీవితాన్ని పోల్చుకునే అలవాటు ఉన్నట్లు తెలిపారు. ఈ పోలికల సంస్కృతి ఆత్మవిశ్వాసాన్ని తగ్గించడం, అసంతృప్తిని పెంచడం, కృత్రిమ జీవనశైలిని ప్రోత్సహించడం వంటి ప్రభావాలకు దారితీస్తుందని మనోవిజ్ఞాన నిపుణులు పేర్కొంటున్నారు.

కుటుంబ వ్యవస్థలో వచ్చిన మార్పులు కూడా వ్యక్తిత్వ వికాసంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో పిల్లలు పెద్దల అనుభవాలను తెలుసుకునే అవకాశం ఉండేది. నేడు చిన్న కుటుంబాలు, ఉద్యోగాల కోసం వలసలు, సమయాభావం, డిజిటల్ పరికరాల వినియోగం వల్ల కుటుంబ సభ్యుల మధ్య సంభాషణ సమయం తగ్గిపోతోంది. ఐక్యరాజ్యసమితి చిన్నారుల నిధి విడుదల చేసిన పలు నివేదికల్లో పిల్లలతో తల్లిదండ్రులు గడిపే నాణ్యమైన సమయం తగ్గిపోవడం వారి భావోద్వేగ వికాసంపై ప్రభావం చూపుతుందని పేర్కొంది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
04.07.2026




## బీఆర్ఎస్ చేసిన అప్పులు అక్షరాలా..

# రూ. 8,21,651 కోట్లు



హాస్టల్ పిల్లలకు క్వాలిటీ వస్తువులు ఇవ్వాలనే టెండర్లు పిలిచాం. రూ.1,142 కోట్లకు టెండర్లు పిలిస్తే రూ.2 వేల కోట్ల అవినీతి అంటున్నారు. మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావు ఏం మాట్లాడుతున్నారో తెలుస్తుందా.. పదేళ్లపాటు దోపిడీ చేసింది ఎవరు కేసీఆర్ కాదా? రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై కేసీఆరే బయటకు వచ్చి మాట్లాడాలి. బాధ్యతగా పనిచేస్తున్న మంత్రులపై అభాండాలు సరికాదు. ఎవరి స్థాయి ఏమిటో వారు పోషించే పాత్రతో తెలుస్తుంది. మీరు చేసిన అప్పులు తీర్చేది కాళేశ్వరం కార్పొరేషనా, ప్రభుత్వమా. కీలక విషయాలపై కేసీఆర్ మాట్లాడాలి.. కేటీఆర్, హరీశ్‌రావు కాదు. మీరు చేసిన అప్పులు రాష్ట్రానికి పెనుభారంగా మారాయి - ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

## చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు కేటీఆర్, హరీశ్‌లు డ్రామాలాడుతున్నారు

- అప్పులు,తప్పులపై కేసీఆర్ వెంటనే స్పందించాలి
- హరీశ్ అబద్ధాలను కట్టిపెడితే మంచిది
- వాస్తవాలు ప్రజలకు తెలియాలి
- బుకాయింపులు, అసత్యాలతో ఎన్నాళ్లీ మోసం?
- మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి మంత్రులు పొన్నం, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

**హైదరాబాద్,జూలై3(జనంసాక్షి):** గత కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో చేసిన భారీ అప్పులు, వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రస్తుతం లేనిపోని అబద్దాలను ప్రచారం చేస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన తప్పులను తక్కువ చేసి

మిగతా 4లో..

## అయోధ్య విరాళాల స్కాంపై నోరు విప్పిన ఆర్ఎస్ఎస్

- బాధ్యులపై కఠినచర్యలకు డిమాండ్
- ఆలయ విరాళాలను దొంగిలించడం తమను తీవ్రంగా బాధిస్తోందని ఆవేదన



**న్యూఢిల్లీ,జూలై3(జనంసాక్షి):**అయోధ్య రామ మందిర విరాళాల చోరీ ఘటనపై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆర్ఎసెస్ ఆందోళన వ్యక్తం చేసింది. రాముడి విరాళాలను దొంగిలించడం తమను తీవ్రంగా బాధిస్తోందని ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే విచారం వ్యక్తం చేశారు. తరతరాలుగా భక్తుల త్యాగాలు, అంకితభావం కారణంగా శ్రీరామ జన్మభూమిలోని ఈ భారీ ఆలయం రూపుదిద్దు కుందన్నారు. ఆలయ నిర్వహణలో మరింత పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనను ఒక ప్రత్యేకమైన అంశంగా పరిగణించి, ఆలయ నిర్వహణలో ఏవైనా లోపాలు ఉంటే వాటిని సరిదిద్దాలని హోసబలే శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌ను కోరారు. ఈ కేసులో దర్యాప్తు జరుగుతున్నందున నిందితులకు శిక్షపడే వరకు సంయమనం పాటించాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనను అవకాశంగా తీసుకొని కొందరు వ్యక్తులు హిందూ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. రామమందిర విరాళాల దుర్వినియోగం కేసు నేపథ్యంలో రాజీనామా చేసిన అయోధ్య ఆలయ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రాలకు శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ షో-కాజ్ నోటీసులు జారీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆలయ అధికారుల మధ్య జులై 6న జరగనున్న కీలక సమావేశంలో ఈ చర్యలు తీసుకునే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. విరాళాల అవకతవకలకు సంబంధించి లిఖితపూర్వకంగా వివరణ

మిగతా 4లో..

## బీఆర్ఎస్ అప్పులపై తప్పుడు ప్రచారం



- తొమ్మిదిన్నరేళ్లలో తీసుకున్నది రూ.4.17 లక్షల కోట్లే..
- మంత్రి జూపల్లి కృష్ణారావుకు హరీశ్ లేఖ

**హైదరాబాద్,జూలై3(జనంసాక్షి):** బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులపై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు పేర్కొన్నారు... ఈ మేరకు మంత్రి జూపల్లి కృష్ణారావుకు బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా అసెంబ్లీలో చేసిన ప్రసంగాల వీడియోలు, ఆర్థిక గణాంకాలు సహా పలు ఆధారాలను మంత్రి జూపల్లి వాట్సాప్‌కు

మిగతా 4లో..

## మాటపై నిలబడే మనిషిని..



- ఇచ్చిమాటకు కట్టుబడి ప్రెస్‌క్లబ్‌కు వచ్చా..
- వెనుకడుగు వేసి పారిపోయే వ్యక్తిని కాదు
- రండి అప్పుల సంగతి తేలుద్దాం..
- కేసీఆర్, కేటీఆర్, హరీశ్ కోసం 3 కుర్చీలు వేశాం
- అబద్ధాలతో ప్రజలను మభ్య పెట్టలేరు
- బీఆర్ఎస్ నేతలు అబద్ధాల లేఖలతో దుష్ప్రచారం చేస్తున్నారని మండిపాటు

**హైదరాబాద్,జూలై3(జనంసాక్షి):** తెలంగాణ అప్పులపై సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో చర్చకు సిద్ధమని ప్రకటించిన మంత్రి జూపల్లి కృష్ణారావు సాయంత్రం ప్రెస్‌క్లబ్‌కు వచ్చారు. శుక్రవారం ఉదయం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌కు ఆయన సవాల్ విసిరారు. సాయంత్రం 5 గంటలకు సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌కు వస్తానని చెప్పారు. ఈ మేరకు మంత్రి జూపల్లి శుక్రవారం సాయంత్రం

మిగతా 4లో..

## 3 రోజుల పాటు వర్షాలు



**హైదరాబాద్(జనంసాక్షి):** ఉత్తర, పశ్చిమ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మూడు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం

## ఉగ్రవాదాన్ని ఎగదోయడం మానుకోండి

- అప్పటివరకు సింధు జలాల నిలిపివేత కొనసాగుతుంది
- పాక్‌పై భారత్ మండిపాటు



**న్యూఢిల్లీ,జూలై3(జనంసాక్షి):** సింధు జలాల్లో తమ వాటా తీసుకొంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందంటూ పాక్ మంత్రి ముసాదిక్ మాలిక్ చేసిన వ్యాఖ్యలపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్రంగా స్పందించింది. దాయాది దేశం ఉగ్రవాదాన్ని ఎగదోయడం, ఉగ్ర కార్యకలాపాలను ప్రోత్సహించడం మానుకొనే వరకు సింధు జలాల నిలిపివేత కొసాగుతుందని స్పష్టం చేసింది. ఉగ్రవాదం విషయంలో తమ వైఖరిలో ఎటువంటి మార్పు లేదని తేల్చి చెప్పింది. 1960లో ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో కుదిరిన ఈ ఒప్పందం చట్టబద్ధమైన నిబంధనలు కట్టుబడి ఉంటుందని తెలిపింది. దానిని ఏకపక్షంగా నిలిపివేయడం గానీ.. సవరించడం గానీ సాధ్యం కాదని పాక్‌కు చురకలు అంటించింది. సరిహద్దు ఉగ్రవాదాన్ని

మిగతా 4లో..

కాంగ్రెస్, భారాస నేతల నటన

## బిగ్‌బాస్ షోను తలపిస్తోంది

### కేంద్రమంత్రి బండి సంజయ్ ఎద్దేవా

**హైదరాబాద్,జూలై3(జనంసాక్షి):**కాంగ్రెస్, భారాస నేతల నటన అద్భుతంగా ఉందని, బిగ్‌బాస్ షోను తలపిస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ గురువారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. ప్రజలు మీ నాటకాలు చూసి నవ్వుకుంటున్నారు. అబద్దాలకు ఆస్కార్ అవార్డు ఇస్తే రెండు పార్టీలూ అర్హత సాధిస్తాయని అన్నారు.

మిగతా 4లో..



# అద్దాల్లా తెలంగాణ రోడ్లు

## వర్షాకాలం తర్వాత మూడు షిఫ్టుల్లో నిర్మాణ పనులు
## ఈ జూలై నెలలో 10 ప్యాకేజీల పనులు ప్రారంభం

- నల్లగొండ-మహబూబ్ నగర్ రోడ్డు పనుల్లో వేగం పెంచాలి
- 6న కరీంనగర్ జిల్లా హ్యామ్ రోడ్ల పనులకు శంకుస్థాపన
- హైకోర్టు భవనం,ఉస్మానియా ఆసుపత్రి డిసెంబర్ కల్లా పూర్తి కావాలి
- టిమ్స్,నిమ్స్,వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ పూర్తి చేయండి
- ప్రాజెక్టుల్లో టెక్నికల్ నాలెడ్జ్ ,కమిట్మెంట్ ఉన్న ఇంజనీర్లను నియమించాలి
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు
- ఆర్ అండ్ బి అధికారులతో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి



**హైదరాబాద్,జూలై3(జనంసాక్షి):**సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో 'న భూతో న భవిష్యతి' రీతిలో రాష్ట్రంలో అద్దం లాంటి రోడ్ల నిర్మాణానికి సంకల్పించామని,అందులో భాగంగా జూన్ 28న నల్లగొండ జిల్లా కనగల్ వేదికగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా రాష్ట్ర హ్యామ్ రోడ్ల పనుల పైలాన్ ఆవిష్కరణ చేసుకుని,పనులు ప్రారంభించామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. రానున్న రెండేళ్లలో రాష్ట్రంలో ఏ మూలన చూసిన నాణ్యమైన ఆర్ అండ్ బి డబుల్ రోడ్లు వినియోగంలోకి వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. 'మంచి రోడ్డు - ప్రగతికి సూచిక' అని తాను బలంగా విశ్వసిస్తానని, దీంతో పల్లె పట్టణాలకు కనెక్టివిటీ పెరిగి, గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు వస్తే స్థానికంగానే ఉద్యోగ,ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పలు పనుల పురోగతిపై డా.బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సెక్రటేరియట్ లో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆ శాఖ ఉన్నతాధికారులతో సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్ అండ్ బి లోని విభాగాల వారీగా పనుల పురోగతిపై కూలంకషంగా చర్చించిన మంత్రి,చేపట్టిన కీలక పనులు ఏ దశల్లో ఉన్నాయో అధికారులను ఆరా తీశారు. మొదటి ఫేజ్ లో సుమారు 13వేల కోట్లతో 6092 కి.మీ రోడ్ల పనులు 34 ప్యాకేజీల్లో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనుండగా..ఈ జూలై నెలలోనే 10 ప్యాకేజీల పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ప్యాకేజ్-2లో సుమారు 155 కోట్ల అంచనా వ్యయంతో 42కి.మీ పొడవుగల నల్లగొండ-మహబూబ్ నగర్ డబుల్ రోడ్డు పనులు ఇప్పటికే ప్రారంభమైన

మిగతా 4లో..





## ఖమేనీ అంత్యక్రియలకు జనప్రవాహం

- కొన్ని రోజుల పాటు సాగనున్న అంతిమయాత్ర
- హత్యజరిగిన ప్రదేశానికి.. ఖమేనీ భౌతికకాయం
- భారీ సంఖ్యలో చేరుకుంటున్న ఇరాన్ ప్రజలు

**టెహ్రాన్(జనంసాక్షి):** అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో మరణించిన సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమం కొన్ని రోజుల పాటు జరగనుంది. ఇందులో భాగంగా ఖమేనీ భౌతికకాయాన్ని ఇరాన్ రాజధాని టెహ్రాన్‌కు తరలించారు. అక్కడి నుంచి ఫిబ్రవరి 28న ఆయన హత్యకు గురైన ప్రదేశానికి చేర్చారు. "ఎలాంటి ముందస్తు ప్రకటన లేకుండా ఖమేనీ భౌతికకాయాన్ని ఆయన అమరత్వం పొందిన ప్రదేశానికి తరలించారు" అని ఇరాన్ మీడియా వెల్లడించింది. టెహ్రాన్‌లో జులై 4,5 తేదీల్లో జరగనున్న అంతిమయాత్రకు రికార్డు స్థాయిలో రెండుకోట్ల మంది వస్తారని ఐఆర్‌జీసీ అంచనా వేస్తోంది. ఈ అప్రకటిత యాత్రకే భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చిన దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. ఆయన మద్దతుదారులు నలుపురంగు దుస్తుల్లో వచ్చి నివాళులు అర్పించారు. ఆ సందర్భంగా పలువురు తీవ్ర ఉద్వేగానికి గురయ్యారు. ఇక తొమ్మిదో తేదీ వరకు వివిధ ప్రాంతాల్లో ఈ యాత్ర జరగనుంది. ఆ రోజున ఖమేనీ

మిగతా 4లో..





## పాకిస్థాన్‌లో లోయలో పడ్డ బస్సు

### 40మంది ప్రయాణికుల దుర్మరణం

**ఇస్లామాబాద్,జూలై 3(జనంసాక్షి):** పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న ఓ బస్సు.. లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో 40 మంది ప్రయాణికులు మరణించారు. మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. పాకిస్థాన్ బలూచిస్థాన్ రాష్ట్రంలో షేరానీ జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న షేరానీ జిల్లా ఉన్నతాధికారులు, వైద్యులు, పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను అత్యవసర చికిత్స కోసం ఝోబ్‌లోని

మిగతా 4లో..

## ఇరాన్ నేతలను మట్టుపెట్టాలని

# ఇజ్రాయిల్ కుట్ర

- అమెరికా రంగంలోకి దిగడంతో పారని పాచిక
- పశ్చిమాసియా సంక్షోభంలో రహస్యాలు
- 'న్యూయార్క్‌టైమ్' సంచలన కథనం



**వాషింగ్టన్,జూలై3(జనంసాక్షి):** పశ్చిమాసియా సంక్షోభంలో సరికొత్త అంతర్జాతీయ రహస్యాలు వెలుగులోకి వచ్చాయి. ఇవి.. అమెరికా, ఇజ్రాయెల్ మైత్రి బీటలు వారిందని చెప్పేందుకు మరింత ఊతమిచ్చేలా ఉన్నాయి. ఇరాన్ అగ్రనేతలు, శాంతి చర్చల ప్రతినిధులైన విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ, పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ బాఘెర్ గాలిబాఫ్ లపై ఇజ్రాయెల్ వేసిన 'హత్య ప్రణాళిక' ను అమెరికా ముందే పసిగట్టి, ఇరాన్‌ను అప్రమత్తం చేయడం ద్వారా వారి ప్రాణాలను కాపాడినట్లు ఓ నివేదిక వెల్లడించింది. ప్రముఖ అంతర్జాతీయ పత్రిక 'ది న్యూయార్క్ టైమ్స్'ఈ రక్షణ రహస్యాలను బహిర్గతం చేసింది. ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతోల్లా అలీ ఖమేనీని ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో హతమార్చిన తర్వాత, ఇరాన్ ఉన్నత స్థాయి నాయకత్వాన్ని పూర్తిగా తుడిచిపెట్టాలని ఇజ్రాయెల్ వ్యూహం రచించింది. అయితే, ఏప్రిల్ 8న జరిగిన మొదటి తాత్కాలిక కాల్పుల విరమణ తర్వాత అమెరికాతో అణు, శాంతి చర్చలు జరపడానికి ఇరాన్ తరపున

మిగతా 4లో..

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
04.07.2026

## అయోధ్య విరాళాల స్కాంపై నోరు విప్పిన ఆర్ఎస్ఎస్

ఇవ్వాలని వారిని కోరనున్నట్లు తెలిపాయి. దర్యాప్తు అనంతరం వారిపై తగిన చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. ఈ క్రమంలో రామ్ మందిర్ విరాళాల వివాదంపై ఆర్ఎస్ఎస్ శుక్రవారం స్పందించింది. అయోధ్య హుండీల నుంచి డబ్బులు దొంగతనం చేయటంపై ఆర్ఎస్ఎస్ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ఈ సంఘటన ఎంతో బాధ కలిగించిందని పేర్కొంది. ఈ మేరకు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ జనరల్ సెక్రటరీ దత్తాత్రేయ హొసబలే న్యూఢిల్లీ నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటనలో.. దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన అన్నారు. ఆలయ నిర్వహణలో లోపాలను సరిదిద్దాలని కోరారు. దేశ వ్యతిరేక శక్తుల కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ ఘటన కోట్లాది మంది రామభక్తుల నమ్మకాన్ని, హిందూ సమాజం సెంటిమెంట్లను తీవ్రంగా గాయపరిచింది. ఈ ఘటన కారణంగా మేము తీవ్ర ఆవేదనకు, ఆగ్రహానికి గురయ్యాం. ఈ దురదృష్టకర సంఘటనను హిందూ వ్యతిరేక, దేశ వ్యతిరేక శక్తులు తమ స్వార్థం కోసం వాడుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. హిందూ సమాజంపై, సనాతన ధర్మంపై బురద జల్లడానికి ఈ వివాదాన్ని ఒక అస్త్రంగా మలచుకునే కుట్రలు జరుగుతున్నాయని హెచ్చరించారు. ఈ కష్టసమయంలో హిందూ సమాజమంతా ఎంతో ఓపికను, నిగ్రహాన్ని ప్రదర్శించాలి. ఎలాంటి తప్పుడు ప్రచారాలకు లోనుకాకుండా.. శత్రువుల కుట్రలను తిప్పికొట్టడానికి అందరూ ఐక్యమత్యంగా ఉండాలి. రామమందిరం ఎన్నో తరాల పోరాటాలు, కోట్లాది మంది త్యాగాల ఫలితంగా నిర్మితమైంది. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు జరగకుండా ఆలయ ట్రస్ట్ పటిష్ఠమైన చర్యలు తీసుకుంటుందన్న నమ్మకం నాకు ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**పాక్ శత్రువులు సరిహద్దు దేశాలు కాదు..**

## వారి సొంత నేతలు, అక్కడి సైన్యమే..

**విమానం హైజాక్ అయ్యిందని చెబితే మేడం నిద్రపోతోందని చెప్పారు**
**పాక్ తీరుపై సింగపూర్ మాజీ రాయబారి బిలహరి కౌశికన్ తీవ్ర విమర్శలు**

సింగపూర్(జనంసాక్షి):పాకిస్థాన్‌పై సింగపూర్ మాజీ రాయబారి బిలహరి కౌశికన్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఓ ప్రపంచ సదస్సులో తమ దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు భారత్, అఫ్గాన్‌లతో ఉన్న సరిహద్దులే కారణమని పాక్ విలేకరి చేసిన ఆరోపణలను కౌశికన్ ఖండించారు. ఆ దేశ సమస్య భారత్, అఫ్గాన్ కాదని.. సొంత నేతలు, అక్కడి సైన్యమేనంటూ ఘాటుగా బదులిచ్చారు. ఈ మాటలు తాను ఊరికే చెప్పట్లేదని.. వీటి వెనుక బలమైన కారణముందని తెలిపారు. 1991 మార్చి 26న మలేషియాలోని కౌలాలంపూర్ విమానాశ్రయం నుంచి బయలుదేరిన కొద్దిసేపటికే సింగపూర్ ఎయిర్‌లైన్స్ విమానాన్ని నలుగురు పాకిస్థానీ ఉగ్రవాదులు హైజాక్ చేశారని బిలహరి తెలిపారు. ఆ విమానంలో 114 మంది ప్రయాణికులు, 11 మంది సిబ్బంది ఉన్నారన్నా రు. అది సింగపూర్‌లోని చాంగీ విమానాశ్రయంలో ల్యాండ్ అయిన సమయంలో వారందరినీ ఉగ్రవాదులు బందీగా చేసుకున్నారని పేర్కొన్నారు. అప్పట్లో తాను సింగపూర్ విదేశాంగ శాఖలో పని చేస్తున్నట్లు తెలిపారు. హైజాకర్లు తాము పాక్ మాజీ ప్రధాని బెనజీర్ భుట్టోతో మాట్లాడాలనుకుంటున్నట్లు పేర్కొన్నారన్నారు. ఆ సమయంలో బెనజీర్ సింధ్‌లోని తమ కుటుంబ ఎస్టేట్‌లో ఉన్నారని తెలియడంతో.. పాకిస్థాన్ హై కమిషనర్ సాయంతో ఆమెను సంప్రదిం చేందుకు ప్రయత్నించినట్లు బిలహరి వెల్లడించారు. అత్యవసరం కావడంతో అర్ధరాత్రి 3గంటల సమయంలో తాను బెనజీర్‌కు ఫోన్ చేశానన్నారు. అక్కడి అధికారులు ఆమెకు ఫోన్ ఇవ్వడానికి నిరాకరించినట్లు తెలిపారు. 'మేడమ్ నిద్రపోతున్నారని.. ఇప్పుడు ఆమెను డిస్టర్బ్ చేయలేమని' చెప్పి ఫోన్ పెట్టేశారని.. విమానం హైజాక్ అయ్యిందని చెప్పినా వారు పట్టించుకోలేదని వెల్లడించారు.దీంతో, ఏమీ చేయలేని పరిస్థితుల్లో సింగపూర్ కమాండోలు విమానం తలుపులను పేల్చివేసి.. లోపలికి ప్రవేశించారని తెలిపారు. వారు హైజాకర్లను హతమార్చి.. ప్రయాణికులను సురక్షితంగా విడిపించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారని అన్నారు. అయితే, ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టగా హైజాకర్లు భుట్టో సొంత పార్టీ అయిన పాకిస్థాన్ పీపుల్స్ పార్టీకి చెందినవారని తేలినట్లు వెల్లడించారు. పాక్ జైళ్లలో ఉన్న కొందరు ఉగ్రవాదులను విడిపించడానికి వారు విమానాన్ని హైజాక్ చేసినట్లు తెలిసిందన్నారు. దేశంలోని సమస్యలకు సరిహద్దు దేశాలను సాకుగా చూపించడం ఇప్పటికైనా మానుకోవాలని బిలహరి పాక్ విలేకరికి చురకలంటించారు.

## ఇన్‌స్టాగ్రామ్‌కు కేంద్రం నోటీసులు!

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఇన్‌స్టాగ్రామ్‌కు కేంద్ర ప్రభుత్వం నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. చిన్నారులపై లైంగిక వేధింపులను ప్రోత్సహించేలా ఉన్న ప్రకటనలు, సైబర్ మోసాల ముప్పు దృష్ట్యా కేంద్రం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. వివాదాస్పద ప్రకటనలపై వివరణ ఇవ్వాలని మెటా (ఓవబిజీ)ను కేంద్ర ఐటీ శాఖ ఆదేశించినట్లు వార్తలు వస్తున్నాయి. ఒకే వారంలో మెటాకు వరుసగా రెండుసార్లు కేంద్రం హెచ్చరికలు జారీ చేయడం గమనార్హం. వాట్సప్‌లోని యూజర్‌నేమ్ ఫీచర్ విషయంలో మెటాకు కేంద్ర ప్రభుత్వం బుధవారం నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ ఫీచర్ వల్ల ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు, నకిలీ గుర్తింపులతో ప్రజలను మోసం చేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై మూడు రోజుల్లో సమాధానం ఇవ్వాలని సూచించింది. అప్పటివరకు భారత పౌరులకు యూజర్‌నేమ్ ఫీచర్ రోల్‌అవుట్‌ను ఆపాలని సూచించింది. ఈ వ్యవహారంలో సంప్రదింపులు పూర్తయ్యాకనే ఈ అంశంపై ముందుకెళ్లాలని నోటీసుల్లో పేర్కొంది. కాగా, చిన్నారులపై లైంగిక వేధింపులను ప్రోత్సహించేలా ఉన్న ఇన్‌స్టాగ్రామ్ ప్రకటనల విషయంలో మెటాకు నోటీసులు జారీ చేయాలని కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ తాజాగా అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈ ప్లాట్‌ఫామ్‌పై అటువంటి ప్రకటనలు ఎందుకు చేయాల్సి వచ్చిందో అధికారులు మెటాను వివరణ కోరే అవకాశం ఉంది. ఇదీ చదవండి: ఆధార్ యాప్‌లో ఉచితంగా ఇ-మెయిల్ అప్‌డేట్.. ఇలా చేసుకోండి..

## బంగారానికి మళ్లీ భగభగలు

**- 10 గ్రాముల రూ.1.50 లక్షల పైకి**

న్యూఢిల్లీ(జనంసాక్షి):

బంగారం ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. తగ్గినట్లే తగ్గిన పసిడి ధర అమాంతం పెరిగిపోయింది. అంతర్జాతీయ ధరలను అనుసరించి మళ్లీ రూ.1.50 లక్షల స్థాయికి చేరుకుంది. 10 గ్రాముల మేలిమి పసిడి ధర ఒక్కరోజులోనే రూ.3300 మేర పెరిగింది. అటు వెండి సైతం కిలో రూ.5వేలు పెరిగి రూ.2.45 లక్షలకు చేరుకుంది. దేశ రాజధాని దిల్లీ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల పసిడి ధర గురువారం రూ.1,47,500గా ఉండగా.. నేడు రూ.1,50,800కి చేరింది. వెండి రూ.2.40 లక్షల నుంచి రూ.2.45 లక్షలకు పెరిగింది. అంతర్జాతీయంగా పసిడి ధర ఔన్సు ఒక్కరోజులో 57 డాలర్లు పెరిగి 4,181 డాలర్లకు చేరుకోగా.. వెండి ఔన్సు 2.44 శాతం పెరిగి 62.45 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.బంగారం, వెండి ధరలు ఇటీవల దిద్దుబాటుకు గురయ్యాయి. గరిష్ఠాల నుంచి దాదాపు 10 శాతం మేర పతనమయ్యాయి. దీంతో వీటి ధరలు మరింత పడతాయన్న అంచనాలతో చాలా మంది తమ వద్ద ఉన్న బంగారాన్ని సైతం విక్రయించారు. అయితే, అంతర్జాతీయంగా చోటుచేసుకున్న పరిణామాలు పసిడికి మళ్లీ డిమాండ్ కల్పించాయి. అమెరికాలో వడ్డీ రేట్లు పెంపుపై ఉన్న భయాలు పోవడం, డాలరు విలువ తగ్గుముఖం పట్టడం ఇందుకు కారణమని నిపుణులు పేర్కొంటున్నారు. అమెరికాలో తాజాగా వెలువడిన నాన్ ఫామ్ పేరోల్ డేటా అంచనాల కంటే తక్కువగా నమోదు కాగా... ద్రవ్యోల్బణం తగ్గుముఖం పడుతోందంటూ ఫెడ్ ఛైర్మన్ కెవిన్ వార్ష్ ఇచ్చిన సంకేతాలు వడ్డీ రేట్ల పెంపు భయాలను పోగొట్టాయి. దీంతో బంగారం ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. అయితే, జులై 8న రాబోయే ఫెడ్ మినిట్స్ బంగారం ధరలను దిశా నిర్దేశం చేసే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## బీఆర్ఎస్ అప్పులు అక్షరాలా

# రూ. 8,21,651 కోట్లు

చూపించేందుకు మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ప్రయత్నిస్తున్నారని భట్టి విక్రమార్క అన్నారు. మంత్రిగా పనిచేసిన విషయాన్ని మరిచిపోయి హరీశ్ మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర సచివాలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై స్పష్టమైన లెక్కలను బయటపెట్టిన ఆయన.. గత పాలకులు రాష్ట్రంపై సుమారు రూ. 8,21,651 కోట్ల అప్పులు , బకాయిల భారాన్ని మిగిల్చారని, వాటిని ప్రస్తుత ప్రభుత్వం ఎంతో శ్రమతో క్రమబద్ధీకరిస్తోందని వెల్లడించారు. అలాగే రెసిడెన్షియల్ పాఠశాలల్లోని పిల్లలకు నాణ్యమైన భోజనం, బట్టలు , కనీస సౌకర్యాలను కల్పించడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, తమ ప్రభుత్వం వచ్చాకే విద్యా సంస్థల్లోని వసతులను మెరుగుపరిచి సంక్షేమానికి పెద్దపీట వేసిందని స్పష్టం చేశారు. సింగరేణి సంస్థపై ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను డిప్యూటీ సీఎం తీవ్రంగా ఖండించారు. బొగ్గు గనుల కేటాయింపులు, ఉత్పత్తికి సంబంధించి గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించి సంస్థను నష్టాల్లోకి నెట్టిందని, ప్రస్తుత ప్రభుత్వం సింగరేణిని కాపాడుకోవడానికి అన్ని రకాలుగా ప్రయత్నిస్తోందని వివరించారు. సింగరేణిలో జరిగిన గత ప్రభుత్వ కాలపు అక్రమ వ్యవహారాలపై తాము విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తున్నట్లు ఈ సందర్భంగా భట్టి విక్రమార్క ప్రకటించారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలు సోషల్ మీడియాలో, బయటా అబద్ధపు ప్రచారాలు చేయడం మానుకోవాలని హెచ్చరించిన ఆయన, దమ్ముంటే తమతో నేరుగా బహిరంగ చర్చకు రావాలంటూ మాజీ సీఎం కేసీఆర్‌కు సవాల్ విసిరారు.బీఆర్ఎస్ పాలనలో చేసిన అప్పులపై కేసీఆర్ స్పందించాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో మొత్తం అప్పు రూ.8.21 లక్షల కోట్లు అని.. మొత్తం అప్పుల్లో గత ప్రభుత్వ బకాయిలు ఉన్నాయని తెలిపారు. అప్పులు అన్నీ వాస్తవాలు కాదా.. వీటిని ఎవరు చెల్లిస్తారని ప్రశ్నించారు. అప్పులపై కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అప్పులను తక్కువ చేసి చూపేందుకే కేటీఆర్, హరీశ్ ప్రయత్నిస్తున్నారని ఉపముఖ్యమంత్రి మండిపడ్డారు. మంత్రిగా పనిచేశానని మర్చిపోయి మరీ హరీశ్ మాట్లాడుతున్నారని.. అనేక అంశాలపై అబద్దాలు చెబుతున్నారని వ్యాఖ్యానించారు. వాస్తవాలను ప్రజల దృష్టికి తేవాలన్నారు. బీఆర్ఎస్ నేతల అబద్దాలు ప్రజల్లోకి వెళ్లకూడదన్నారు. సోషల్ మీడియా ద్వారా అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అబద్దాల పునాదులపై పదేళ్లు పరిపాలించారని.. బీఆర్ఎస్ చేసిన అప్పులతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని విరుచుకుపడ్డారు. అప్పుల భారం రాష్ట్రంపై వేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. బుకాయింపులు, అసత్యాలతో ఎన్నాళ్లు మోసం చేస్తారంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్‌రావు అనేక విషయాలపై అబద్దాలు చెబుతున్నారు. వాస్తవాలను ప్రజల దృష్టికి తీసుకురావాలి. బీఆర్ఎస్ నేతలు చెప్పే అవాస్తవాలు ప్రజల్లోకి వెళ్లకూడదు. సోషల్ మీడియా వ్యవస్థల ద్వారా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. అబద్దాల పునాదులపై పదేళ్లపాటు పరిపాలన చేశారు. బీఆర్ఎస్ నేతలు కావాలనే ప్రభుత్వంపై పదేపదే దుష్ప్రచారం చేస్తున్నారు. ఆ పార్టీ హయాంలో చేసిన అప్పులతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. పదేళ్లు సీఎంగా పనిచేసిన కేసీఆర్‌కు సవాల్ విసురుతున్నాం. 2014 నుంచి 2023 వరకు అప్పులు చేసి రాష్ట్రంపై పెనుభారం వేసింది నిజం కాదా? వివిధ మార్గాల ద్వారా మీరు చేసిన అప్పు రూ.8.21లక్షల కోట్లు. బుకాయింపులు, అసత్యాలతో ఎన్నాళ్లు మోసం చేస్తారు?అప్పుల అంశంపై నిత్యం మాట్లాడితే రాష్ట్రం పరువు పోతుందని తగ్గాం. మేం వచ్చాక రూ.2.08లక్షల కోట్లు చెల్లించాం. 10 శాతం వడ్డీకి కూడా మీరు అప్పులు తెచ్చారు. కట్టాల్సిన వడ్డీని రూ.34 వేల కోట్ల నుంచి రూ.11వేల కోట్లకు తగ్గించాం. బీఆర్ఎస్ నేతలు అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. సింగరేణిపై ప్రతిరోజూ అబద్దాలు చెబుతున్నారు' అని భట్టి విక్రమార్క

## బీఆర్ఎస్ అప్పులపై తప్పుడు ప్రచారం

పంపినట్లు వెల్లడించారు. హరీశ్‌రావు లేఖలో పేర్కొన్న వివరాల ప్రకారం.. బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేళ్ల పాలనలో తీసుకున్న రుణాలు, ప్రభుత్వ హామీతో తీసుకున్న రుణాలు కలిపి మొత్తం రూ.4.17 లక్షల కోట్లేనని అసెంబ్లీలో వివరించినట్లు తెలిపారు. ఆ లెక్కలపై ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు సిద్ధమని అప్పుడే ప్రకటించానని గుర్తు చేశారు. అలాగే, కాంగ్రెస్ ప్రభుత్వం 2023 డిసెంబర్ నుంచి 2026 జూన్ వరకు రూ.1,77,058 కోట్ల అప్పు చేసినట్లు మంత్రి జూపల్లి తన లేఖలో పేర్కొన్నారని తెలిపారు. అయితే, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గణాంకాల ప్రకారం 2026 జూన్ 30 నాటికి రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పు రూ.1,86,067 కోట్లుగా ఉందని హరీశ్‌రావు పేర్కొన్నారు. మరోవైపు, 2026 మార్చి 18న అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రభుత్వం చేసిన ఎఫ్ఆర్‌బీఎం, ఇతర అన్ని రకాల రుణాలు కలిపి రూ.3,47,294 కోట్లుగా ప్రకటించారని ఆయన గుర్తు చేశారు. బీఆర్ఎస్ తమ లెక్కలను మార్చడం లేదని, కాంగ్రెస్ మాత్రం సందర్భాను సారంగా అప్పుల అంకెలను మారుస్తోందని విమర్శించారు. తమ అంచనాల ప్రకారం వివిధ మార్గాల ద్వారా ప్రస్తుత ప్రభుత్వం సుమారు రూ.4.5 లక్షల కోట్ల అప్పులు చేసిందని హరీశ్‌రావు ఆరోపించారు. ఈ అంశానికి సంబంధించిన అసెంబ్లీ వీడియో లు, ముఖ్యమంత్రి చేసిన ప్రకటనలు, ఆర్బీఐ అధికారిక గణాంకా లను మంత్రి జూపల్లి వాట్సాప్‌కు పంపినట్లు తెలిపారు. వాటిని పరిశీలించి వాస్తవాలను తెలుసుకోవాలని కోరిన హరీశ్‌రావు, ఇకనైనా అప్పుల అంశంలో తప్పుడు ప్రచారం మానుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు.

## కాంగ్రెస్, భారాస నేతల నటన బిగ్‌బాస్ షోను తలపిస్తోంది

గురుకులాల టెండర్లు, తెలంగాణ అప్పులతోపాటు అవినీతి, అక్రమాలపైనా చర్చిద్దాం రండి. మా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఆధ్వర్యంలో తేదీ, సమయం, వేదిక నిర్ణయిస్తాం. కాంగ్రెస్, భారాస పాలనా వైఫల్యాలను ప్రజల ముందుంచేందుకు మేం సిద్ధమని అన్నారు.

## అద్ధాల్లా తెలంగాణ రోడ్లు

నేపథ్యంలో పనుల్లో వేగం పెంచాలన్నారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు ఆశించిన స్థాయిలో లేవని,అయినా..వర్షాకాలం పూర్తి అయిన తర్వాత మూడు షిఫ్టుల్లో రోడ్ల నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. రోడ్ల నిర్మాణం కోసం నిష్ణాతులై, నిరంతరం ఫీల్డ్ లో ఉండే ఇంజనీర్లను ఎంపిక చేసి,ప్యాకేజీల వారిగా పనుల బాధ్యతలు అప్పజెప్పాలని,పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయించడం చీఫ్ ఇంజనీర్ల బాధ్యతేనని మంత్రి స్పష్టం చేశారు. ఈనెల 6న కరీంనగర్ జిల్లాలో చేపట్టే హ్యామ్, రోడ్ల పనులకు ఆ జిల్లా మంత్రులు,స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. అందుకు సంబంధిత ఏర్పాట్లు చూడాలని సి.ఈ లు బి.వి రావు,వసంత్ నాయక్ లను మంత్రి ప్రత్యేకంగా ఆదేశించారు. ఘాజేంద్ర నగర్ లో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న నూతన హై కోర్టు భవనం,జడ్జిల నివాస సముదాయ భవనాల నిర్మాణాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని,నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన జరగాలని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు 16 శాతం పనులు పూర్తయ్యాయని సి.ఈ లు రాజేశ్వర్ రెడ్డి, నర్సింగ్ రావు వివరించగా....మూడు షిఫ్టుల్లో నిర్మాణ పనులు జరగాలని,అందుకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచి, నిర్మాణ సంస్థతో సమన్వయం చేసుకుంటూ పనుల్లో వేగం పెంచాలని మంత్రి వారిని ఆదేశించారు. అక్కడ ఆర్ అండ్ బి తరుపున నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతలు చూస్తున్న ఇంజనీర్ల సంఖ్యను పెంచాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ 2027 డిసెంబర్ నాటికి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. అట్లాగే ఉస్మానియా జనరల్ ఆసుపత్రి పనుల్లో ఇంకా వేగం పెరగాలని,ఇది కూడా డిసెంబర్ 2027 వరకు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. సనత్ నగర్ టిమ్స్ ప్రారంభానికి సిద్ధం అయిందని,అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్, నిమ్స్ విస్తరణ,వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ నిర్మాణ పనులు వేగవంతం చేసి అతి త్వరలో ప్రజలకు అందుబాటులోకి వచ్చే విధంగా పని చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ ప్రాజెక్టుల్లో టెక్నికల్ నాలెడ్జ్ ఉండి,మనసుపెట్టి పనిచేసే కమిట్మెంట్ ఉన్న ఇంజనీర్లను నియమించాలనీ మంత్రి సూచించారు. ఈ వారం నుండే నిర్మాణం జరుగుతున్న ప్రాంతాల్లో ఆకస్మిక సైట్ విజిట్స్ చేస్తానని..పనుల పురోగతిలో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తన దృష్టికి వస్తే, ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోనని,కఠిన చర్యలు తప్పవని సున్నితంగా హెచ్చరించారు. బాసర,భద్రాచలం ఆలయ నిర్మాణ పనుల పురోగతి,గోదావరి పుష్కరాల కోసం ఆర్ అండ్ బి ఏర్పాట్లపై మంత్రి ఆరా తీశారు..సంబంధిత ఆయా శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఆర్ అండ్ బి తరుపున నిర్మాణ పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించుకొని పని చేయాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, ఈఎన్సి జయ భారతి,అన్ని విభాగాల సి.ఈ లు.. బి.వి రావు,రాజేశ్వర్ రెడ్డి,ధర్మారెడ్డి, వసంత్ నాయక్,వనజ,రాజేందర్,నర్సింగ్ రావు పలువురు ఆర్ అండ్ బి ఇంజనీర్లు పాల్గొన్నారు.

## పాకిస్థాన్‌లో లోయలో పడ్డ బస్సు

ట్రామా సెంటర్‌కు తరలించారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇటీవల జరిగిన అత్యంత ఘోర రోడ్డు ప్రమాదాల్లో ఇదీ కూడా ఒకటని అధికారులు తెలిపారు. సాంకేతిక లోపంతో ఓ బస్సు ఆగిపోయిందని, దీంతో అందులోని ప్రయాణికులను కూడా ఈ బస్సులోకి ఎక్కించారని అధికారులు చెప్పారు. దీంతో బస్సు ప్రయాణికులతో నిండిపోయిందన్నారు. ఈ ప్రమాదం జరిగిన బస్సు.. 36 మంది ప్రయాణికులతో క్వెట్టా నుంచి బయలుదేరిందని పేర్కొన్నారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభమైందని పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు.

## 3 రోజుల పాటు వర్షాలు

జిల్లాల్లో భారీ వర్ష కురిసే అవకాశం ఉందని, దక్షిణ, మధ్య తెలంగాణ జిల్లాల్లో తేలిక నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొన్నారు.వాయవ్య బంగాళాఖాతాన్ని ఆనుకొని ఉన్న ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడిందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఇది రాబోయే రెండు, మూడు రోజుల్లో మరింత బలపడే అవకాశం ఉందన్నారు. గంటకు 40-50 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శుక్రవారం మేఘావృతమైన వాతావరణంతో శ్రీకాకుళం, పోలవరం, కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు, మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించారు.

## ఖమేనీ అంత్యక్రియలకు జనప్రవాహం

స్వస్థలం మషాద్‌లో ఖననం చేయనున్నారు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో హోర్డింగ్‌లు, బ్యానర్లు వెలిశాయి. ఈ అంత్యక్రియల కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఇరాన్ నుంచి భారత ప్రధాని మోదీకి ఆహ్వానం వచ్చింది. మనదేశం తరపున కేంద్ర విదేశాంగశాఖ సహాయ మంత్రి పవిత్ర మార్గరిటా, బిహార్ గవర్నర్ సయ్యద్ అతా హస్నైన్ హాజరుకానున్నట్లు తెలుస్తోంది.



## మాటపై నిలబడే మనిషిని..

సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌కు చేరుకున్నారు. ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. సవాల్‌పై కట్టుబడి ఉన్నందునే ప్రెస్‌క్లబ్‌కు వచ్చానన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు కోసం ఎదురుచూస్తున్నానని తెలిపారు. తాను వెనుకడుగు వేసి పారిపోయే వ్యక్తిని కానన్నారు.. 'కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుకు 4 పేజీల చొప్పున లేఖలు రాశా. ముగ్గురికీ వాట్సాప్‌లోనూ ఆధారాలతో లేఖలు పంపించా. రూ.4.17 లక్షల కోట్ల అప్పు అంటూ హరీశ్ రిటర్న్ లేఖ పంపారు. రూ.8.21 లక్షల కోట్ల అప్పు అని లేఖలో చెప్పా. పారిపోవడం మా ఇంటావంటా లేదు. ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. లేఖలో తాను ప్రస్తావించినవి అబద్దాలని నిరూపించ గలరా అని మంత్రి ప్రశ్నించారు. తాను చెప్పినవి అబద్దాలైతే రాజీనామాకు సిద్ధం అంటూ పునరుద్ఘాటించారు. హరీశ్‌రావు సొల్లు పురాణం చెబుతున్నారు. నా ప్రశ్నలకు సమాధానం దాటవేస్తున్నారు. నేను అడిగింది ఏంటి? హరీశ్ చెప్పిందేంటి అని నిలదీసారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ కోసం 3 కుర్చీలు వేశాం. హరీశ్‌రావు రాసిన లేఖలో ఏమీ లేదు. ఇప్పటికైనా విలువలతో బతకండి' అని అన్నారు. కాగా, చర్చకు రావాలని పిలిచి పోలీసులతో అడ్డుకుంటున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అంతకుముందు తెలంగాణ అప్పులపై మంత్రి జూపల్లి కృష్ణారావు చర్చకు సిద్ధమని సాయంత్రం 5 గంటలకు వస్తానని బీఆర్ఎస్ నేతలకు మరోసారి సవాల్ విసిరారు. 'మీరు సిద్ధమైతే ముందే చెప్పండి. నా లెక్కలు తప్పు అయితే రాజీనామా చేస్తా. మీ లెక్కలు తప్పు అయితే రాజీనామా చేస్తారా? బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా? కేసీఆర్ రాకపోతే జూపల్లి చెప్తున్న లెక్కలు తప్పని మీడియాతో చెప్పమనండి. ఖబడ్దార్.. కేసీఆర్, కేటీఆర్, హరీశ్.. పాలమూరు పౌరుషమా? కల్వకుంట్ల పౌరుషమా చూసుకుందాం' అంటూ ఛాలెంజ్ చేశారు. 'నేనెక్కడికీ పారిపోలేదు. పారిపోయే లక్షణం నాకు లేదు. నా మాటకు కట్టుబడి ఉన్నాను. ఆపరేషన్ సక్సెస్, పేషెంట్ డెడ్‌లాగా కేటీఆర్, హరీశ్ వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర అప్పు రూ.3,17,015 కోట్ల అని ఒకసారి, రూ.3,85,045 కోట్లు అని మరోసారి అసెంబ్లీలో కేటీఆర్ అన్నారు. రాష్ట్ర అప్పు రూ.4, 26,499 కోట్లు అని ఒకసారి.. రూ.4,17, 496 కోట్లు అని మరోసారి హరీశ్ అసెంబ్లీలో అన్నారు. కేసీఆర్ దిగిపోయే సరికి రూ.8,21, 651 కోట్ల అప్పు ఉంది. నేను చెప్తున్న లెక్కలు తప్పు అయితే మంత్రి పదవికి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని తాజాగా సవాల్ చేశారు. కార్పొరేషన్ ద్వారా తెచ్చిన అప్పులను కేటీఆర్, హరీశ్ ఎందుకు చెప్పడం లేదు. మిషన్ భగీరథ కోసం తెచ్చిన అప్పులు ప్రజలు కడతారా?' అంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అబద్దాలు చెప్పే వాడిని కాదని మంత్రి తెలిపారు. ఆత్మ గౌరవం కోసం ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేశానని గుర్తుచేశారు. ఉద్యోగానికి రాజీనామా చేసి వ్యవసాయం చేసుకునే వాడినని తెలిపారు. రాజకీయాల నుంచి వ్యాపారంలోకి రాలేదని.. వ్యాపారం చేసి రాజకీయాల్లోకి వచ్చినట్లు జూపల్లి కృష్ణారావు వెల్లడించారు.

**జూపల్లి, హరీశ్‌రావు మధ్య మాటల యుద్ధం**

అంతకుముందు శుక్రవారం ఉదయం జూపల్లి చేసిన ఆరోపణలపై హరీశ్‌రావు లేఖ రాశారు. ఆ లేఖపై మరోసారి జూపల్లి స్పందించారు.అప్పుల విషయంలో జూపల్లి కృష్ణారావు వాస్తవాలు తెలుసుకోవాలని హరీశ్‌రావు అన్నారు. ఈ మేరకు ఆయనకు లేఖ రాశారు. "కాంగ్రెస్ ప్రభుత్వం రూ.4.50 లక్షల కోట్ల అప్పు చేసింది. రూ.3,47,294 కోట్ల అప్పు అని అసెంబ్లీలో సీఎం ప్రకటించారు. ఆధారాలతో నిరూపించినా.. సీఎం, మంత్రుల తీరు మారలేదు. బీఆర్ఎస్ తీసుకున్న రుణాలు రూ.4.17 లక్షల కోట్లు మాత్రమే. నేను చెప్పిన లెక్కలకు కట్టుబడి ఉంటానని.. చర్చకు సిద్ధమని చెప్పాను" అని హరీశ్‌రావు అన్నారు.

## ఇరాన్ నేతలను మట్టుపెట్టాలని ఇజ్రాయిల్ కుట్ర

అరాగ్చీ, గాలిబాఫ్ బాధ్యతలు చేపట్టారు. ఇది ఇజ్రాయెల్‌కు ససేమిరా ఇష్టం లేదు.న్యూయార్క్ టైమ్స్ నివేదిక ప్రకారం.. ఏప్రిల్ 12న ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ గాలిబాఫ్ పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్‌తో చర్చలు ముగించుకుని తిరిగి ఇరాన్‌కు విమానంలో ప్రయాణమయ్యారు. గాలిబాఫ్ ప్రయాణిస్తున్న విమానాన్ని కూల్చివేయడానికి ఇజ్రాయెల్‌కు చెందిన రెండు ఫైటర్ జెట్స్ ఇరాక్ మీదుగా ఇరాన్ వైమానిక పరిధిలోకి ప్రవేశించాయి. ఈ నిఘా సమాచారాన్ని అమెరికా ఇంటెలిజెన్స్ ముందే గుర్తించి, ప్రాంతీయ దేశాల (పాకిస్థాన్, ఖతార్) మధ్యవర్తుల ద్వారా ఇరాన్ ప్రభుత్వానికి అత్యవసర హెచ్చరికలు పంపింది. సమాచారం అందిన వెంటనే ఇరాన్ రక్షణ దళాలు గాలిబాఫ్ విమానాన్ని టెహ్రాన్‌కు వెళ్లకుండా దారి మళ్లించి, ఈశాన్య ప్రాంతంలోని 'మషద్' నగరంలో అత్యవసరంగా ల్యాండింగ్ చేయించాయి. ఆ తర్వాత గాలిబాఫ్ రోడ్డు మార్గంలో సురక్షితంగా టెహ్రాన్ చేరుకున్నారు. ఇరాన్‌తో శాంతి చర్చలు జరుపుతున్న సమయంలో ఆ దేశ ప్రధాన దౌత్యవేత్తలను ఇజ్రాయెల్ హతమరిస్తే, చర్చలు పూర్తిగా దారి తప్పి, అమెరికా కూడా నేరుగా ఇరాన్‌తో పెద్ద ఎత్తున యుద్ధంలోకి దిగాల్సి వస్తుందని వాషింగ్టన్ భయపడింది. 'వారినీ



చంపేస్తే ఇక మనం శాంతి చర్చలు జరపటానికి ఇరాన్‌లో ఒక్క నేత కూడా మిగలడు' అని పాకిస్థాన్ దౌత్యవేత్తలు కూడా అమెరికాకు స్పష్టం చేశారు. దీంతో అమెరికా స్వయంగా రంగంలోకి దిగి ఇజ్రాయెల్‌ను వెనక్కి తగ్గాలని ఆదేశించిందని కూడా సదరు నివేదిక వెల్లడించింది. ఇదిలా ఉంటే, ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ గాలిబాఫ్ ప్రాణాపాయం నుంచి తప్పించుకోవడం ఇదే మొదటిసారి కాదు. జూన్ 2025లో జరిగిన 12 రోజుల యుద్ధంలో, అలాగే ఈ ఏడాది జరిగిన ఘర్షణల్లో ఇరాన్ భూగర్భ బంకర్లపై ఇజ్రాయెల్ జరిపిన దాడుల శిథిలాల నుంచి గాలిబాఫ్ రెండుసార్లు ప్రాణాలతో బయటపడ్డారు.ఇక, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు మధ్య ఇటీవల కాలంలో తీవ్రమైన విభేదాలు రావడానికి ఈ ఘటనే పునాది అని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అంతేకాదు, ఇజ్రాయెల్‌కు ఇష్టం లేకపోయినప్పటికీ, అమెరికా.. ఇరాన్‌తో విడిగా చర్చలు జరిపి 14 అంశాల అవగాహనా ఒప్పందం కుదుర్చుకోవడం అంతర్జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

## ఉగ్రవాదాన్ని ఎగదోయడం మానుకోండి

ప్రోత్సహించడాన్ని పాక్ విడనాడాలని విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణధీర్ జయస్వాల్ సూచించారు.సింధు జలాల నియంత్రణకు భారత్ యత్నిస్తోందని.. పాక్‌లోకి చుక్క నీరు కూడా ప్రవహించకుండా పొరుగు దేశ ప్రధాని అడ్డుకుంటున్నారని ఇటీవల పాక్ మంత్రి ముసాదిక్ ఆరోపించారు. తమ నీటి హక్కులకు ముప్పు వాటిల్లితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. మరో మంత్రి అట్టావుల్లా తరార్ మాట్లాడుతూ.. నీటి అంశం తమ దేశ జాతీయ భద్రతలో కీలక భాగమని పేర్కొన్నారు. సింధూ జలాల ఒప్పందం చట్టబద్ధంగా అమల్లోనే ఉందని, దాన్నెవరూ రద్దు చేయలేరంటూ భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. ఈ క్రమంలోనే విదేశాంగ శాఖ దీటుగా స్పందించింది. అఫ్గానిస్థాన్ పై పాకిస్థాన్ సైనిక దాడులను భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఖండించింది. అఫ్గాన్ సార్వభౌమత్వానికి భారత్ మద్దతు కొనసాగిస్తుందని రణధీర్ జయస్వాల్ పునరుద్ఘాటించారు. మానవతా సాయం, అభివృద్ధి ప్రాజెక్టుల ద్వారా ఆ దేశంతో సంబంధాలు కొనసాగుతున్నాయన్నారు. ఇటీవల వెనెజువెలాలో అనుమానాస్పద స్థితిలో భారత నావికుడు రాకేశ్ చౌహాన్ మృతిచెందిన ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది. మృతదేహంలో అవయవాలు మాయం కావడం గురించి అక్కడి అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపింది.

# ఉపాధ్యాయుల పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలి

**• పిఆర్‌టియు డిమాండ్**



**నారాయణపేట, జూలై 3 (జనం సాక్షి) :** ఉపాధ్యాయులు పి ఆర్ సి నీ వెంటనే ప్రకటించాలని పి ఆర్ టి యు నాయకులు డిమాండ్ ప్రభుత్వానికి చేశారు. పి ఆర్ టి యు టి ఎస్ జిల్లా అధ్యక్షులు వై జనార్ధన్ రెడ్డి ప్రధాన కార్యదర్శి పి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నారాయణపేట జిల్లాలోనీ కొత్తపల్లి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భూనేడులో పి అర్ టి యు టీఎస్ 2026 –2027 విద్యా సంవత్సరము పి ఆర్ టి యు సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల గెజిటెడ్ప్రధానోపాధ్యాయురాలు నీలిమ మాట్లాడుతూ పి ఆర్ టియు సంఘం మాత్రమే ఉపాధ్యాయుల సంఘం అని దీని ద్వారానే సమస్యల పరిష్కారం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ సంఘ సభ్యులకు ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ఇప్పటివరకు సాధించబడ్డ సమస్యలన్నీ కేవలం పి అర్ టి యు సంఘ ము ద్వారానే సాధించబ డ్డాయని, భవిష్యత్తులోనూ అపరిస్కృత సమస్యలు సంఘము ద్వారానే సాధ్యమవుతుందని అన్నారు. అందువల్ల ఉపాధ్యాయులు బేషజాలకు పోకుండా స్వచ్ఛందంగా సంఘంలో సభ్యత్వం చేసి సంఘమును ఇంకా బలోపేతం చేయాలని కోరారు ఇప్పటివరకు ప్రభుత్వమునకు ఉపాధ్యాయ లోకం అన్ని విషయాలలో సహకరిస్తుందని అది గుర్తించి ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాలు ఇంకా ఆలస్యం చేయకుండా వెంటనే పిఆర్సి పెండింగ్,డి ఎ లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యోగ ఉపాధ్యాయులు సహనం కోల్పోయి రోడ్డెక్కి ప్రమాదం ఉందని అన్నారు. గౌరవ ముఖ్యమంత్రి గారు వారి మేనిఫెస్టోలో సూచించిన విధంగా వెంటనే కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి ఓపిఎస్ ను పునరుద్ధరించాలని కోరారు. హెల్త్ కార్డుల విషయంలో ఉపాధ్యాయులు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని త్వరలోనే అమలు అవుతాయనిమార్గదర్శకాలు మనము కోరుకున్నట్లే ఉంటాయనిఉపాధ్యాయులకు మార్గదర్శనం చేశారు. ఉపాధ్యాయులు కూడా ఆలోచించి సభ్యత్వం చేసి ఉపాధ్యాయుల ఉనికిని కాపాడుకోవాలని సూచించారు. కొంతమంది మాటలతో మభ్యపెడుతూ సంఘాలకు కొత్త బాష్యం చెప్పుతూ ఉపాధ్యాయుల ఉనికిని కాలరాస్తున్నారని అలాంటి వారి మాయలో పడి ఇప్పటికే చాలా నష్టాన్ని మనం పొందామని అది గుర్తుఎరిగి సభ్యత్వం చేయాలనీ సూచించారు. పి అర్ టి యు సంఘం పెన్షన్ తెస్తే పెన్షన్ తీసివేసిన పార్టీల వెంబడి ఉండే సంఘాలు ఇవాళ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం కృషి చేస్తా మని చెప్పడం దివాలు కోరుతనానికి నిదర్శనమని వారు దుయ్యబట్టారు. ఆలస్యమైనప్పటికీ త్వరలోనే సమస్యల పరిష్కారానికి రాష్ట్ర నాయకత్వం కృషి చేస్తుందని లేనిపక్షంలో ఉద్యమ బాట పడుతుందని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ఉపాధ్యాయ బృందం స్వచ్ఛందంగా పి ఆర్టీయూలో సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఆర్ ఆంజనేయులు కొత్తపల్లి మండల అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ ప్రధాన కార్యదర్శి భీమేష్,నారాయణ పేట మండలం అధ్యక్షులు ఎం.రఘువీర్,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు శేఖర్ రెడ్డి సీనియర్ సభ్యులు చెన్నకేశవరెడ్డి,సనత్ రెడ్డి,భాను ప్రకాష్ రెడ్డి, తిమ్మారెడ్డి, నర్సింలు, శివాజీ, హైమద్ అలీ,రాణి బాయి, శ్రీలత, కవిత, వెంకటేష్, కిషోర్,అనిత,సి ఆర్పి రాజు తదితరులు పాల్గొన్నారు.

## చంపాపేట్‌లో ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పించిన బీఆర్ఎస్ నాయకులు



**హయత్‌నగర్, జూలై 3 (జనం సాక్షి) :** చంపాపేట్ డివిజన్‌లోని మాధవ్‌నగర్ కాలనీలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొని ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటరు జాబితాలో ప్రతి అర్హుడి పేరు సక్రమంగా నమోదు కావడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఇందుకోసం అవసరమైన పత్రాలను సమర్పించి ఓటరు వివరాలను ధృవీకరించుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో పేర్లు లేకపోవడం, వివరాల్లో పొరపాట్లు ఉన్నట్లయితే వెంటనే సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించి సరిచేసుకోవాలని కోరారు. ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కు అని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ తమ ఓటరు వివరాలను తప్పనిసరిగా పరిశీలించి అవసరమైన మార్పులు, చేర్పులు చేయించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉమ మహేశ్వర్, గోగిరెడ్డి అంజిరెడ్డి, శేఖర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, కృష్ణసాగర్, వెంకటేష్, బీఎల్ఓ అనిల్‌తో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఆదాయ వృద్ధే లక్ష్యంగా కృషి చేయాలి



**బోడుప్పల్, జూలై 3 (జనంసాక్షి) :** ఆర్టీసీ సంస్థను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా పనిచేసి అధిక ఆదాయం సమకూర్చాలని సికింద్రాబాద్ రీజియన్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ మహేష్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం చెంగిచెర్ల ఆర్టీసీ డిపోను ఆకస్మికంగా సందర్శించిన ఆయన డిపో కార్యకలాపాలను క్షుణ్ణంగా పరిశీలించి, కార్యాలయ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో సమావేశమైన మహేష్ కుమార్ వారి సమస్యలను తెలుసుకుని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉద్యోగులు ఆరోగ్యంగా ఉంటేనే సంస్థ అభివృద్ధితో పాటు కుటుంబ సంక్షేమాన్ని కూడా కాపాడుకోగలరని సూచించారు. అనంతరం డిపో ఆవరణలో మొక్క నాటి పర్యావరణ పరిరక్షణకు తన వంతు సందేశాన్ని అందించారు. డిపోలో నిర్వహించిన ఆదర్శ ఉద్యోగుల అభినందన సభలో అధిక ఆదాయం తీసుకువచ్చిన కండక్టర్లు, ఇంధనాన్ని ఆదా చేసిన డ్రైవర్లను శాలువాలతో ఘనంగా సన్మానించి నగదు బహుమతులు అందజేశారు. ఉద్యోగుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం సంస్థ పురోగతికి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.సమిష్టి కృషి, టీమ్‌వర్క్‌తో చెంగిచెర్ల డిపోను రాష్ట్రంలోని అన్ని డిపోల కంటే అత్యధిక ఆదాయం సాధించే ఆదర్శ డిపోగా తీర్చిదిద్దాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎస్ స్వాతి, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) ఆనందరావు, అసిస్టెంట్ మేనేజర్ (మెకానిక్) సత్తయ్య, ఆఫీస్ సూపరింటెండెంట్ లక్ష్మీ కళ్యాణి డిప్యూటీ సూపరింటెండెంట్ లక్ష్మి, డిపో ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

**• చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య**

**మొయినాబాద్, జూలై 3 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూధన్రెడ్డిలు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామంలో అర్హులైన ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకున్న గృహాలను ఎమ్మెల్యే కాలె యాదయ్య పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుపేదలకు గుడిసెలను పరిశీలించి కిరాయి ఇంట్లో ఉంటున్న కుటుంబ సభ్యులను గుర్తించి ఇందిరమ్మగృహ పథకం ద్వారా పక్కా ఇళ్లు నిర్మించుకునేందుకు అర్హులుగా ప్రకటించి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించడం జరుగుతుందన్నారు. గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్లు పేదలకు ఎంతో వరం లాంటివని తెలిపారు. పేదరికంగా పూరిగుడిసెలు, కిరాయిలు కట్టలేక ఇబ్బందులు పడుతున్న వారికి నాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇళ్లు నిర్మించడం ఎంతో సంతోషమని సూచించారు. గ్రామాల అభివృద్దే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ప్రభుత్వం ద్వారా అర్హులైన వారందరికి అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్ల సంఘం ప్రధాన కార్యదర్శి మాడి రాజేందర్రెడ్డి అమ్డాపూర్ సర్పంచ్ మద్యసాగ కృష్ణ, మండల అభివృద్ధి అధికారి హిమబింధు, పంచాయతీ కార్యదర్శి కవితరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు ముర్తుజాగూడ విక్రమ్రెడ్డి, అశోక్యాదవ్, నాయకులు మన్నె ప్రభాకర్రెడ్డి, జితేందర్రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఎలిగెపల్లి శ్రీనివాస్యాదవ్, హనుమంతుయాదవ్, సర్దార్నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, అబియ్ రెడ్డి, గోపాలాచారి తదితరులు పాల్గొన్నారు.

**ఇంటి నెంబర్లు ఇప్పించాలని ఎమ్మెల్యేకు వినతి**



మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామంలో సర్వే నెంబర్ 289 ప్రభుత్వ భూమిలో ఇంటి నెంబర్లు ఇప్పించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యకు అమ్లాపూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మద్యసాగ కృష్ణ, పాలకవర్గం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా 289 సర్వే నెంబర్ లో దాదాపు 200 ఇళ్లు 30 సంవత్సరాల నుంచి నిర్మించుకోని నివసిస్తున్నారని ఆ ఇళ్లకు ఇంటి నెంబర్లు లేవని ఎమ్మెల్యేకు వివరించారు. ఆయన స్పందిస్తు పక్కనే ఉన్న మండల అభివృద్ధి అధికారి హిమబిందుతో మాట్లాడుతూ ఇంటి నెంబర్లు కేటాయించి గ్రామ పంచాయతీకి ఆర్థికంగా ట్యాక్సు వచ్చే విధంగా అభివృద్ధి చేసుకోవాలన్నాలన్నారు. వెంటనే ఇంటి నెంబర్లు కేటాయించాలని సూచించారు.

## గురుకుల విద్యాసంస్థలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కేంద్రాలుగా నిలవాలి

**• జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు**

**గద్వాల నడిగడ్డ, జూలై 3 (జనం సాక్షి) :** జిల్లాలోని ప్రభుత్వ గురుకుల విద్యాసంస్థలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కేంద్రాలుగా నిలవాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు అన్నారు. శుక్రవారం కేటీదొడ్డి మండలంలో మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, జూనియర్ కళాశాలను అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యా, వసతి, భోజన సౌకర్యాలు, పారిశుధ్యం తదితర ఏర్పాట్లను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ గురుకుల విద్యాసంస్థలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కేంద్రాలుగా నిలవాలని, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన, పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పోషకాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందించడంతో పాటు హాస్టళ్లలో పరిశుభ్రతను ఎల్లప్పుడూ పాటించాలన్నారు. తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, వంటశాల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థుల విద్యా ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రతి విద్యార్థి ప్రతిభను వెలికితీసేలా బోధన కొనసాగించాలని,హాజరు శాతం పెంపు, క్రమశిక్షణ,వ్యక్తిత్వ వికాసం, క్రీడలు, సహపాఠ్య కార్యక్రమాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని మౌలిక వసతులను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచి, ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు పూర్తిస్థాయిలో వారికి చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ తనిఖీలో పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, హాస్టల్ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అధికారుల సమన్వయంతో సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



**తూప్రాన్, జూలై 3 (జనం సాక్షి) :** గ్రామస్థాయి బూత్ స్థాయి అందరి అధికారుల సమన్వయంతో సర్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని స్పెషల్ అధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. తూప్రాన్ లోని లింగ రెడ్డి గార్డెన్ లో జరిగిన బిఎల్ఓ ల అవగాహన కార్యక్రమానికి పాల్గొని ప్రసంగించారు. ఓటర్ జాబితా సమర్థవంతంగా జరగాలని ఎలాంటి అనుమానాలు అభ్యంతరాలు ఉన్న తనను సంప్రదించవచ్చని చెప్పారు. లింగారెడ్డి గార్డెన్ లో సర్ పై అవగాహన సదస్సును మండల అధికారి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏ మాత్రం అజాగ్రత్తగా వహించిన ఓటరుగా గుర్తింపు రాదని నిర్లక్ష్యం వహించవద్దని కోరారు. గ్రామస్థాయిలో ఇంటింటికి తిరుగుతూ సర్పంచ్ వార్డు మెంబర్లు కలిసి సమన్వయంతో పూర్తి చేయాలని కోరారు . దేశవ్యాప్తంగా ఇది తొమ్మిదో సమగ్ర సర్వే అని ఎలాంటి తప్పులు లేకుండా చేయాలని కోరారు ఎన్యుమరేషన్ ఫామ్ తెలుగు తెలియని వారికి మీరే పూర్తి చేయాలని ఈనెల 24 తేదీలోగా ఇచ్చిన ఎనిమరేషన్ ఫాములను తీసుకోవాలని వాటిని కంప్యూటర్ ఐస్ చేయాలని చెప్పారు .ఈ కార్యక్రమానికి బిఎల్ఓ లు, సెక్రటరీలు, సీఏలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఎన్నికల అధికారులు, ఎమ్మార్వో చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామస్థాయిలో ముఖ్య కూడల వద్ద స్పెషల్ కౌంటర్లను ఏర్పాటు చేస్తామని ప్రచారం నిర్వహిస్తామని అన్నారు .సర్ కార్యక్రమాన్ని ఎలాంటి లోపం లేకుండా పారదర్శకంగా బీఎల్ఓ లు వారికి అను సంధానంగా ఉన్న అధికారులు నిర్వహించాలని అన్నారు. ఎన్యుమరేషన్ ఫామ్ కు కొత్త కలర్ ఫోటో జత చేయాలని ఇంటింటికి తిరిగి చెప్పాలని కోరారు. సర్ కు సంబంధించిన దరఖాస్తు ఫారాని బి ఎల్ ఓ లు పూర్తి చేసి ప్రజలకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు కలవకుండా చూసుకోవలసిందిగా హెచ్చరించారు. ఎలక్షన్ సంబంధిత అధికారులు, ఇందులో డిప్యూటీ ఎమ్మార్వో శ్రీకాంత్, ఆర్ ఐ ప్రేమ్ కుమార్, సెక్రటరీలు గ్రామ సర్పంచులు ఉప సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ళను సకాలంలో పూర్తి చేసుకోవాలి

**• ఎంపీడీఓ వి.ప్రవీణ్ కుమార్**



శంకర్‌పల్లి, జూలై 3 (జనం సాక్షి) : మండల పరిధిలోని గోపులారం, మహారాజ్‌పేట గ్రామాలను ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ శుక్రవారం సందర్శించారు. గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించడంతో పాటు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా చేపడుతున్న వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ,ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు తెలిపారు. నర్సరీల్లో మొక్కల పెంపకం, సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు మరుగుదొడ్లను నాణ్యతతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి గిరిరాజు, ఏపీఓ నాగభూషణం, సంబంధిత పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

## రాజ్యాంగ స్ఫూర్తితో బాధితులకు న్యాయం చేస్తాం



**చేవెళ్ల, జూలై 3 (జనంసాక్షి) :** ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన ప్రతి సమస్యను చట్టబద్ధంగా, వేగంగా పరిష్కరించేందుకు కృషి చేస్తాం అని చేవెళ్ల ఆర్డీఓ కె. పార్థసింహారెడ్డి అన్నారు. శుక్రవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ రంగారెడ్డి జిల్లా సభ్యుడు బేగరి రాజు ఆర్డీఓను కలిసి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగ పీఠికను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ... వివక్ష, భూముల సమస్యలు సహా తమ పరిధిలోని ప్రతి అంశంపై తక్షణ చర్యలు తీసుకుంటామని, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. బేగరి రాజుకు శుభాకాంక్షలు తెలియజేస్తూ సమాజ సేవలో నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. అనంతరం బేగరి రాజు మాట్లాడుతూ.. రాజ్యాంగ విలువలను కాపాడుతూ ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసైన్ భూముల సమితి రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శ్రీనివాస్, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం చేవెళ్ల మండల అధ్యక్షులు మల్లెపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నీటిపారుదల ప్రాజెక్టులపై ఎమ్మెల్యే ప్రత్యేక సమీక్ష



**వనపర్తి బ్యూరో, జూలై 3 (జనంసాక్షి) :** వనపర్తి నియోజకవర్గంలో కొనసాగుతున్న నీటిపారుదల ప్రాజెక్టుల పురోగతి, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ఆయకట్టు విస్తరణ తదితర అంశాలపై వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి శుక్రవారం జిల్లా నీటిపారుదల శాఖ కార్యాలయంలో అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని రిజర్వాయర్లు, ప్రధాన కాలువలు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు, సాగునీటి కాలువల విస్తరణ పనుల ప్రస్తుత స్థితిగతులను ఎమ్మెల్యే సమీక్షించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో సాగునీరు అందేలా అన్ని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డి–5, డి–8 కాలువల విస్తరణ పనులపై ప్రత్యేకంగా సమీక్షించిన ఎమ్మెల్యే, ఈ పనులు పూర్తయితే అనేక గ్రామాల రైతులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. గొల్లపల్లి రిజర్వాయర్‌కు సంబంధించిన వివరణాత్మక ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేయాలని సూచించగా, గోపాల్పేట రిజర్వాయర్ ప్రతిపాదనల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. బుద్ధారం స్టేజ్–2 ఆన్‌లైన్ రిజర్వాయర్‌కు సంబంధించిన అంశాలపై చర్చిస్తూ, భవిష్యత్ సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. ఖిల్లా ఘణపురం మండలంలోని గణపసముద్రం రిజర్వాయర్ పనులను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. పెద్దమందడి మండలం గట్ల ఖానాపూర్ గ్రామంలో నిర్మించనున్న రిజర్వాయర్‌కు సంబంధించిన నివేదికలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించిన ఎమ్మెల్యే, ఖాన్ చెరువు అభివృద్ధి పనుల పురోగతిపై కూడా సమీక్ష నిర్వహించారు. రేవల్లి మండలం తలుపునూరు, తలుపునూరు తండాలలో సుమారు 2,000 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలపై చర్చించారు. అలాగే ఏదుల, అనంతపూర్ గ్రామాల ఆయకట్టు విస్తరణను ప్రాధాన్యతగా తీసుకుని తగిన ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. భీమా కెనాల్ విస్తరణ పనులపై సమీక్షించిన ఎమ్మెల్యే, రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని కాలువల సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మహబూపాల సముద్రం రిజర్వాయర్ సుందరీకరణ పనులను పర్యాటకాభివృద్ధికి అనుసంధానించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కర్నే తండా లిఫ్ట్ ఇరిగేషన్ పథకంలో మిగిలిన పనులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు పూర్తి స్థాయిలో ప్రయోజనం కల్పించాలని ఆదేశించిన ఎమ్మెల్యే, బుద్ధారం రైట్ కెనాల్ ఆయకట్టును స్థిరీకరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి సాగునీరు అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న ప్రతి నీటిపారుదల పనిని దశలవారీగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ సీఈ, డీసీ, ఎస్ఈ, ఈఈ, డీఈ, ఏఈలు తదితర అధికారులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
04 జూలై 2026

# భూ రీసర్వే ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేయాలి

- భవిష్యత్తులో ఇలాంటి గెట్టు పంచాయతీ రావద్దు
- భూ పరిపాలన ప్రధాన కమిషనర్ డీఎస్ లోకేష్ కుమార్



**మెదక్ బ్యూరో చీఫ్, జూలై 3 (జనం సాక్షి) :** భూ రీ సర్వే ప్రక్రియను నిర్దేశిత గడువులోగా, ఎలాంటి జాప్యం లేకుండా పారదర్శకంగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ కార్యదర్శి భూ పరిపాలన ప్రధాన కమిషనర్ డీ.ఎస్ లోకేష్ కుమార్ స్పష్టం చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా కలెక్టరేట్ కార్యాలయంలో వీడియో సమావేశ మందిరంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్, భూభారతి ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు , జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ నగేష్, ఏడి ల్యాండ్ సర్వే కిషన్ సంబంధిత ఆర్డీవోలు, తాహాసిల్దార్లు, లైసెన్స్ సర్వేయర్లతో జిల్లాలో భూ సర్వే అమలు తీరు, భూభారతి, సాదా బైనామా , రెవిన్యూ సదస్సులు నిర్వహణ సంబంధిత అంశాలపై భూ పరిపాలన ప్రధాన కమిషనర్ డీఎస్ లోకేష్ కుమార్ సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా భూ పరిపాలన ప్రధాన కమిషనర్ డీఎస్ లోకేష్ కుమార్ మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలో 24 గ్రామాలు రీ సర్వే ఎంపికకగా 7 గ్రామాల్లో పూర్తి రీ సర్వే పూర్తి అయిందని,18 గ్రామ సభలు నిర్వహించారని తెలిపారు. మిగతా జిల్లాలతో పోలిస్తే మెదక్ జిల్లా సమర్థవంతంగా భూ సర్వే నిర్వహించడంపై హర్షం వ్యక్తం చేశారు. భూముల రీ సర్వే ప్రక్రియలో తాసిల్దార్లు ఆర్డీవోలు చిత్తశుద్ధితో వ్యవహరించాలని క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న అంశాలను భూ పరిపాలన నిబ నిబంధనలకు లోబడి సర్వే ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ భూ సర్వేలో ప్రభుత్వ భూముల పరిరక్షణలో పటిష్ట చర్యలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించేటప్పుడు దారిద్య రేఖకు దిగువన ఉన్న నిజమైన భూ లబ్ధిదారులకు న్యాయం చేసే దిశగా ఈ రీ సర్వే జరగాలని స్పష్టం చేశారు. భూముల రీసర్వే ప్రక్రియకు సంబంధించి ఎక్విప్మెంట్స్ సరిపడా అందుబాటులో ఉంచుతామన్నారు. లైసెన్స్ సర్వేయర్లకు ల్యాండ్ పార్సిల్ మ్యాప్స్ భూముల సరిహద్దులు స్పష్టంగా ఉండేందుకు వీలుగా కొత్తగా ల్యాండ్ పార్శిల్ మ్యాప్ నంబర్లను కేటాయిస్తున్నట్లు తెలిపారు. వివాదాల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటూ గతంలో రికార్డుల్లో ఉన్న వ్యత్యాసాలను సరిచేస్తూ, సరిహద్దు వివాదాలను త్వరితగతిన పరిష్కరించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలతో పటిష్ట ప్రణాళికతో ఈ సర్వే ప్రక్రియ పూర్తి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 134 గ్రామాలు సర్వే ప్రక్రియ పూర్తి అయినవని తెలిపారు. భూ సర్వే నిర్వహించేటప్పుడు గ్రామ సభలు ఏర్పాటు చేసేటప్పుడు డెడ్ లైన్ తప్పనిసరిగా పాటించాలన్నారు. గ్రామసభల తేదీలు వాయిదా వేయకూడదని స్పష్టం చేశారు. భూ సర్వేలో బౌండరీ ఫిక్సింగ్, ప్రభుత్వ భూములు గ్రామకంఠం సంబంధిత విషయాలలో పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. గతంలో 1946 సంవత్సరంలో సర్వే నిర్వహించడం జరిగిందని అప్పటినుండి ఎలాంటి సర్వే జరగలేదని భూముల రి సర్వే ప్రక్రియ చేపట్టి నిజమైన భూలబ్ధిదారులకు న్యాయం చేసే దిశగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. లైసెన్స్ సర్వేయర్స్ కు గౌరవ వేతనం అందించే విషయంలో సుముఖత వ్యక్తం చేస్తూ వారం వారం చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకోవాలని ల్యాండ్ సర్వేయర్ ఏ, డి కిషన్ ను ఆదేశించారు. అనంతరం సాదాబైనామ, భూభారతి పెండింగ్ దరఖాస్తులపై మండలాల వారీగా రివ్యూ నిర్వహించారు. పెండింగ్ దరఖాస్తులు కట్ ఆఫ్ డేట్ పెట్టుకుని పరిష్కరించాలన్నారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ మరియు భూభారతి ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ ..ఎంజాయ్ మెంట్ సర్వే నిర్వహణ అత్యంత పారదర్శకంగా జరగాలని గతంలో నిర్వహించే సర్వే సాధారణ ఎక్విప్మెంట్తో జరిగిందని ఇది పూర్తిగా డిజిటల్ సర్వేనని సమర్థతతో పూర్తిచేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ, రీ-సర్వే కార్యక్రమం నిర్దేశిత గడువులోగా, అత్యంత ఖచ్చితత్వంతో పూర్తి కావడానికి జిల్లా యంత్రాంగం పటిష్టమైన ప్రణాళికతో ముందుకు వెళు ుందని, కమిషనర్ గారి ఆదేశాల మేరకు పనుల వేగాన్ని మరింత పెంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జోన్-7 జోగులాంబ డీఐజీ ఎల్.ఎస్.చౌహాన్



**మిడ్జిల్, జూలై 3 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శనివారం మిడ్జిల్ గ్రామ పర్యటన నేపథ్యంలో భాగంగా భద్రతా మరియు ఇతర ఏర్పాట్లను జోన్-7 జోగులాంబ డీఐజీ శఎల్.ఎస్. చౌహాన్, ఐపీఎస్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ తో కలిసి సభా ప్రాంగణం, హెలిప్యాడ్ ప్రాంగణం, పార్కింగ్ స్థలాలు, ప్రజల రాకపోకల మార్గాలు, ట్రాఫిక్ నియంత్రణ మరియు ఇతర బందోబస్తు ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు. అనంతరం డీఐజీ ఎల్.ఎస్.చౌహాన్, మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ తరపున పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. సీఎం పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అన్ని విభాగాలతో సమన్వయం చేసుకుంటూ కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి ఉర్కొండపేట పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



**కల్వకుర్తి, జూలై 3 (జనంసాక్షి) :** రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి శనివారం ఉర్కొండపేట శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకోవడంతో పాటు ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లా కలెక్టర్ హేమంత కేశవ పాటిల్, జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్,భద్రతా విభాగం అధికారులు,ఇంటెలిజెన్స్ సిబ్బందితో కలిసి హెలిప్యాడ్,ఆలయ ప్రాంగణం,సభా వేదిక,కాన్వాయ్ మార్గాలు,పార్కింగ్ ప్రాంతాలు,భద్రతా పాయింట్లను పరిశీలించారు.అనంతరం నిర్వహించిన ఏఎస్ఎల్ సమావేశంలో ట్రాఫిక్ నియంత్రణ,భద్రత, ప్రజల ప్రవేశ--నిష్క్రమణ మార్గాలు,వైద్య సేవలు, అగ్నిమాపక సన్నద్ధత,విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం,కమ్యూనికేషన్ వ్యవస్థలపై సమీక్షించారు. ప్రతి శాఖకు బాధ్యతలు అప్పగించామని,భద్రత విషయంలో నిర్లక్ష్యానికి తావులేదని కలెక్టర్ పేర్కొన్నారు.కాన్వాయ్ మార్గమంతా పటిష్ట బందోబస్తు,ప్రత్యేక ట్రాఫిక్ మళ్లింపు ప్రణాళిక అమలు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చి.వాసుదేవ రెడ్డి,డీఎస్పీలు ఎ. శ్రీధర్ రెడ్డి,డి. కృష్ణ,అదనపు కలెక్టర్లు అరుణా రెడ్డి, దేవ సహాయం,కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, అగ్నిమాపక, వైద్య ఆరోగ్య,విద్యుత్, పంచాయతీరాజ్,ఆర్అండ్బీ,మున్సిపల్,రెవెన్యూ శాఖల అధికారులు, ఆలయ ఈవో పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యత

- దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి



**వనపర్తి బ్యూరో, జూలై 3 (జనంసాక్షి) :** శుక్రవారం కొత్తకోట మండలం రాయినిపేట గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికొన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన కిచెన్ షెడ్ ప్రారంభోత్సవ కార్యక్రమం, అలాగే అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, దేవరకద్ర శాసనసభ్యులు జి. మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై కిచెన్ షెడ్ ప్రారంభించి, నూతన తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, తద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలకు ప్రస్తుతం అధిక డిమాండ్ ఉందన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల కోసం ప్రవేశ పరీక్ష నిర్వహించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. త్వరలో ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని కూడా అమలు చేయనున్నట్లు చెప్పారు. విద్యార్థులకు పోషకాహారం అందించి వారి ఆరోగ్యంతో పాటు విద్యాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.రాయిని పేట పాఠశాలకు జిల్లా కలెక్టర్ తన నిధుల నుంచి రూ.23.80 లక్షలు మంజూరు చేసి పాఠశాల అభివృద్ధికి సహకరించడం అభినందనీయమని, ఇందుకు ప్రత్యేకంగా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. పాఠశాల స్థాయి నుంచే కృత్రిమ మేధస్సు ఏఐ విద్యను కూడా ప్రవేశపెట్టే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాయిని పేట ప్రభుత్వ పాఠశాలలో సమర్థవంతమైన ఉపాధ్యాయ బృందం పనిచేస్తోందని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతులను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను మరింత సమర్థవంతంగా వినియోగించి విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంపొందించాలని తెలిపారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులు కూడా ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ యాదయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్, రాయినిపేట సర్పంచ్ భాగ్యలక్ష్మి, డి ఎస్ ఓ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సంగుపేట - పోచారం రహదారికి కొత్త రూపు

- రూ.40 కోట్లతో విస్తరణ పనులకు శ్రీకారం
- మంత్రి దామోదర రాజనర్సింహ మంజూరు చేసిన నిధులతో ప్రారంభం



**పుల్కల్, జూలై 3 (జనం సాక్షి) :** ఏళ్లుగా అధ్వాన్నంగా మారిన అందోల్ మండలం సంగుపేట చౌరస్తా--పుల్కల్ మండలం పోచారం రహదారికి త్వరలో కొత్త రూపు రానుంది. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఇటీవల మంజూరు చేసిన రూ.40 కోట్ల నిధులతో రహదారి విస్తరణ, బలోపేతం పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మంత్రి ఆదేశాల మేరకు పుల్కల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దుర్గారెడ్డి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. సంగుపేట చౌరస్తా నుంచి పోచారం వరకు సుమారు పలు గ్రామాలను అనుసంధానించే ఈ ప్రధాన రహదారిపై ప్రతిరోజూ వేలాది మంది ప్రజలు, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు రాకపోకలు సాగిస్తుంటారు. రహదారి దెబ్బతినడంతో గుంతలు ఏర్పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ప్రమాదాలు సంభవించే పరిస్థితులు నెలకొనడంతో ఈ రహదారి అభివృద్ధిపై ప్రజలు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు.మంత్రి దామోదర రాజనర్సింహ చొరవతో రూ.40 కోట్ల నిధులు మంజూరుకావడంతో రహదారి విస్తరణ, బలోపేతం పనులు ప్రారంభమయ్యాయి. పనులు పూర్తయితే రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు రెండు మండలాల మధ్య రవాణా సౌకర్యాలు గణనీయంగా మెరుగుపడనున్నాయి. వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, అత్యవసర సేవలు, విద్యా, వైద్య అవసరాలకు కూడా ఈ రహదారి ఎంతో ఉపయోగపడనుంది. పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.ఈ రహదారి అభివృద్ధితో అందోల్, పుల్కల్ మండలాల అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, నాయకులు సుభాష్ రెడ్డి, సురేందర్ గౌడ్,బోయిని శ్రీనివాస్, అంజయ్య,బచ్చమల్ల ఉదయ్ కుమార్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ కార్మికుల నిరసన



**కృష్ణ, జూలై 3 (జనం సాక్షి) :** మిషన్ భగీరథ కార్మికులకు కాంట్రాక్ట్ వర్కర్స్ గా గుర్తించాలని ప్రతి నెల మొదటి తారీకే వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నారాయణపేట జిల్లా,కృష్ణా మండలం గుడేబల్లూరు, పంప్ హౌస్ దగ్గర కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. కృష్ణా మండలం గుడెబల్లూరు పంపోల్ దగ్గర మిషన్ భగీరథలో పనిచేస్తున్న కార్మికులు నిరసన వ్యక్తం చేస్తూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి పెంచిన వేతనాలు ఒకటో తారీకు రాకపోవడం అట్లాగే మిషన్ భగీరథ కార్మికులకు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులుగా గుర్తించకపోవడం చాలా సిగ్గుచేటు అని పేర్కొన్నారు. కార్మికులు నిత్యం ప్రతిరోజు గ్రామాలలో నీటి సరఫరా చేస్తున్నారు ముఖ్యమంత్రి జీవో 6 ప్రకారం పెంచిన జీతాలను మాకు వర్తింపజేసి ప్రతినెల 1 తేదీన వేతనాలు ఇవ్వాలని కోరారు. అట్లాగే మిషన్ భగీరథ అధికారులు కూడా కార్మికులను నిమ్మక్కు నేరెత్తినట్ల వ్యవహరిస్తు న్నారనీవిమర్శించారు. ,కార్మికుల సమస్యలను పరిష్కరించకపోవడం పిఎఫ్ ఈఎస్ఐ కట్టకపోవడం సకాలంలో వేతనాలు రాక చాలా ఇబ్బంది గురవుతున్నామన్నారు. ముఖ్యమంత్రి ప్రకటన కార్మికులకు ఆశ లేపిన కానీ మిషన్ భగీరథ కార్మికులకు నిరాశ గానే మిగిలిపోయిందన్నారు. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో మక్తల్ సత్యసాయి స్కీం 26 సంవత్సరాల కెళ్ళి కొనసాగుతున్నదనీ ఈ స్కీం లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నా రనీ ఆవేదన వ్యక్తం చేశారు.కానీ తెలంగాణ ముఖ్యమంత్రి విడుదల చేసిన వేతనాలు సత్యసాయి కార్మికులకు వర్తింపజేయాలని రాష్ట్రంలో మిషన్ భగీరథ కార్మికులకు అందరికీ 6 నెంబర్ జీవో ప్రకారం వేతనాలు ఇవ్వాలని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏ జీ,ఛట్టో,టియుసిఐ జిల్లా ఉపాధ్యక్షులు .శ్రీనివాస్ మిషన్ భగీరథ కార్మిక సంఘం కార్యదర్శి , ఉపాధ్యక్షులు తిప్రేస్పల్లి శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు రవి ,రవిప్రసాద్, సాబేర్ మియా, నారాయణ ,మహేష్ ,కుమార్ శివరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం



**బెజ్జంకి, జూలై 3 (జనం సాక్షి) :** మండలంలోని కళ్లేపల్లి గ్రామంలో నూతన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం ద్వారా పేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరుతుండటంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిదులుగా కళ్లేపల్లి సర్పంచ్ బిగుల్లా మోహన్,ఉపసర్పంచ్ వినీత్,కాంగ్రెస్ నాయకులు పర్శ సంతోష్,బుర్ర రవి,రకం రాజు,రొడ్డ ఐలయ్యతో పాటు గ్రామ పెద్దలు పాల్గొని వేదమంత్రాల నడుమ భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు పర్శ సంతోష్ మాట్లాడుతూ పేద ప్రజలకు గౌరవప్రదమైన జీవనం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని అనీ అన్నారు.అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అనంతరం సర్పంచ్ బిగుల మోహన్,ఉప సర్పంచ్ వినీత్ గౌడ్,గ్రామ పెద్దలు లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఇంటి నిర్మాణం విజయవంతంగా పూర్తవాలని ఆకాంక్షించారు.

# నేరాల ఛేదనలో జాగిలాల పాత్ర అత్యంత కీలకం

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూలై 3 (జనం సాక్షి) :** నేరాల చేదనలో పోలీస్ జాగిలాల పాత్ర కీలకమని జిల్లా ఎస్పీ వినీత్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పత్తి బజార్‌లో ఉన్న జిల్లా పోలీస్ డాగ్ కెన్నెల్‌ను జిల్లా ఎస్పీ వినీత శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.పోలీసు శాఖలో నేరాల ఛేదన, పేలుడు పదార్థాల గుర్తింపు, మాదక ద్రవ్యాల నియంత్రణ, అదృశ్యమైన వ్యక్తుల ఆచూకీ వంటి కీలక విధుల్లో సేవలందిస్తున్న పోలీస్ జాగిలాల నిర్వహణ, సంరక్షణ, శిక్షణ విధానాలను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా కెన్నెల్‌లో ఉన్న నాలుగు ప్రత్యేక శిక్షణ పొందిన పోలీస్ జాగిలాలు రూప (ఎక్స్‌ప్లోజివ్), రుద్ర (ట్రాకర్), విక్కీ (నార్కోటిక్స్), లక్కీ (ఎక్స్‌ప్లోజివ్) జాగిలాల ఆరోగ్య పరిస్థితి, ఆహార నిర్వహణ, వసతి, పరిశుభ్రత, శిక్షణ కార్యక్రమాలపై సమగ్రంగా సమీక్షించారు. జాగిలాల కోసం ఏర్పాటు చేసిన ప్రతి గది వద్ద ఆయా జాగిలాల పేరు, ప్రత్యేక నైపుణ్యం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో సాధించిన విజయాలు, అవార్డులు, సేవల వివరాలను స్పష్టంగా ప్రదర్శించేలా సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. దీనివల్ల జాగిలాల సేవలపై అవగాహన పెరగడంతో పాటు వాటి పనితీరును సమర్థవంతంగా పర్యవేక్షించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ జాగిలాలు పోలీసు శాఖకు అమూల్యమైన ఆస్తి అని అన్నారు. హత్యలు, దొంగతనాలు, పేలుడు పదార్థాల గుర్తింపు, నార్కోటిక్స్ కేసులు, అదృశ్యమైన వ్యక్తుల ఆచూకీ వంటి క్లిష్టమైన కేసుల్లో జాగిలాలు కీలక పాత్ర పోషిస్తూ నేరాల ఛేదనను వేగవంతం చేస్తున్నాయని తెలిపారు. జాగిలాలకు ప్రతిరోజూ నిర్దేశించిన డైట్ చార్ట్ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని, శుభ్రమైన తాగునీరు, విశ్రాంతి, సమయానికి వైద్య పరీక్షలు, అవసరమైన టీకాలు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం, ప్రత్యేక శిక్షణ నిర్వహించడం ద్వారా వాటి సామర్థ్యం మరింత పెరుగుతుందని చెప్పారు.డాగ్ కెన్నెల్‌లో పరిశుభ్రమైన వాతావరణం ఎల్లప్పుడూకొనసాగించాలని, జాగిలాల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా అత్యంత బాధ్యతతో వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనకు నార్కోటిక్స్ స్నిఫర్ డాగ్‌లను మరింత సమర్థవంతంగా వినియోగించాలని, గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాల రవాణా, నిల్వ, విక్రయాలపై తరచూ ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు.పోలీస్ జాగిలాల పనితీరు ఎంత మెరుగ్గా ఉంటే నేరాల ఛేదన అంత వేగవంతంగా జరుగుతుందని, ప్రజలకు మరింత నాణ్యమైన పోలీసు సేవలు అందించడంలో అవి కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.అధికారులు జాగిలాల సంరక్షణ, శిక్షణ, ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.ఈ తనిఖీలో అదనపు ఎస్పీ ఎం.డి. రియాజ్ హుల్ హక్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ విజయ్ భాస్కర్, ఎస్‌బీ ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డి, శివ శంకర్ తదితర అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఎస్పీ డాగ్ కెన్నెల్ ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కాపాడాలని అన్నారు. మొక్కలు నాటడమే కాదు వాటిని పెరిగే వరకు బాధ్యతగా తీసుకోవాలని అన్నారు.

# పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి ప్రోత్సాహం

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్



హనుమకొండ ప్రతినిధి, జూలై 3 (జనంసాక్షి) : రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాలు, సబ్సిడీలు, మౌలిక వసతులు, అవకాశాలను ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలను విస్తరించడంతో పాటు ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. శుక్రవారం కాజీపేట మండలం మడికొండ ఇండస్ట్రియల్ పార్కులోని కాకతీయ టెక్స్టైల్, వివర్స్ వెల్ఫేర్ పొదుపు పరపతి పరస్పర సహాయక సంఘం, గ్రానైట్ పరిశ్రమలు, ఐటీ సెజ్‌ను జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ పరిశ్రమలను నిర్వహిస్తున్న పారిశ్రామికవేత్తలతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లో ఇంకా ఉత్పత్తి ప్రారంభించని యూనిట్లను త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఖాళీగా ఉన్న యూనిట్లను లీజు విధానంలో కొత్త ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కేటాయించి పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం అందించాలని సూచించారు. మడికొండ ఇండస్ట్రియల్ పార్కులోని గ్రానైట్ పరిశ్రమను జిల్లా కలెక్టర్ సందర్శించి ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఐటీ సెజ్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్ అక్కడ పనిచేస్తున్న యువత, ఉపాధి అవకాశాలు, నిర్వహణ విధానంపై వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ స్వామి నాయక్, కాజీపేట తహసీల్దార్ రాజు, పలువురు పారిశ్రామికవేత్తలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వైటీపీఎస్ టెండర్ రద్దు చేయాలి

- కేటీపీపీలో 11వ రోజు నల్ల బ్యాడ్జీలతో నిరసన



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): వైటిపిఎస్ లో బొగ్గు, బూడిద నిర్వహణ పనులను ప్రైవేటు సంస్థలకు అప్పగించే రూ.255 కోట్ల టెండర్ ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో ఉద్యోగులు శుక్రవారం 11వ రోజు కూడా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. కేటిపిపి ప్రధాన గేటు వద్ద జరిగిన నిరసనలో నాయకులు మాట్లాడుతూ ప్రైవేటీకరణ వల్ల ప్రభుత్వ విద్యుత్ సంస్థలు, ఉద్యోగుల భవిష్యత్తు, ప్లాంటు భద్రతకు నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. టెండరును వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జూలై 2న హైదరాబాద్ లో జరిగిన ఉమ్మడి కార్యాచరణ సమితి కేంద్ర సమావేశం నిర్ణయం మేరకు జూలై 3 నుంచి 6 వరకు రాష్ట్రవ్యాప్తంగా నల్ల బ్యాడ్జీ నిరసనలు, జూలై 7న 'చలో వైటిపిఎస్' కార్యక్రమం చేపడతామని తెలిపారు. వైటిపిఎస్ కు రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగ సంఘాల నేతలు తరలివస్తారని పిలుపునిచ్చారు. టెండరు రద్దు చేయకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో విద్యుత్ ఉద్యోగ సంఘాలు, అసోసియేషన్ల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు
- ముందస్తు చర్యలపై అధికారులతో సమీక్ష సమావేశం



ములుగు ప్రతినిధి, జులై 03(జనంసాక్షి) : జిల్లాలో కురిసే వర్షాలు, సంభవించే విపత్తు పరిస్థితుల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు వర్షాల పరిస్థితులు, ముందస్తు జాగ్రత్తలు, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై టెలి కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. భారీ వర్షాల సమయంలో లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు, వాగులు, వంకలు, చెరువుల పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక అప్రమత్తత అవసరమని తెలిపారు. ఎక్కడైనా వరద ముప్పు ఏర్పడే అవకాశం ఉంటే ముందుగానే చర్యలు చేపట్టి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు అధికారులు అందుబాటులో ఉండి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. వర్షాల ప్రభావిత ప్రాంతాల్లో అవసరమైన సహాయక చర్యలు, అత్యవసర సేవలు వెంటనే అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓ, ఎంపిఓ లు, సంబధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుద్ఘాతంతో ఇల్లు దగ్ధం




లక్ష్మణ చందా, జులై 3, (జనం సాక్షి) : నిర్మల్ జిల్లా, లక్ష్మణ్ చందా మండలం ధర్మారం గ్రామం లో నివసిస్తున్న కస్తూరి ముత్యం వైఫ్ ఆఫ్ కస్తూరి మేఘన,మేఘన భర్త జీవనోపాధి కోసం గల్ఫ్ కు వెళ్లడం వలన మేఘన ఒక అద్దె ఇంట్లో కిరాయి ఉంటుంది. దురదృష్టకరం ఏంటంటే ఎప్పుడు ఎలా వస్తాయో ఎవరికీ తెలియదు, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అద్దె ఇంట్లో ఉంటున్న మేఘన ఇద్దరు కుమారులతో జీవనం సాగిస్తున్నారు. ఉదయం పిల్లలను బడికి పంపించి ఆమె వ్యవసాయ కూలీ పనికి బయటకు వెళ్ళింది. అందజ ఉదయం 10 నుండి 11 గంటల మధ్య సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ద్వారా ఇంట్లో ఉన్న ప్రతి వస్తువు అన్ని కాలి బూడిద అయ్యాయి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేరు, అకస్మాత్తుగా విద్యుత్తు హై వోల్టేజ్, లో వోల్టేజ్ రావడం ద్వారా రిఫ్రిజిరేటర్ బ్లాస్ట్ అయి మంటలు చెలరేగి ఇల్లంతా వ్యాపించాయి. మంటలు పెద్దగా ఎగిసిపడటంతో ఇంట్లోను టీవీ, 20వేల రూపాయల నగదు,కుట్టు మిషన్, బట్టలు, ధాన్యం ఇతర గృహోపకరణాలు పూర్తిగా ఖాళీ బుడదయ్యాయి, చుట్టుపక్కల వారు గమనించి హుటాహుటిన స్పందించి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను పూర్తిగా ఆర్పివేశారు. అయితే ఈ ప్రమాదంలో దాదాపు రెండు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు కన్నీటి పర్యంతమవుతున్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ సంఘటన చోటుచేసుకుందని స్థానికులు తెలిపారు. కట్టు బట్టలు మిగలడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని, బాధితులు వేడుకుంటున్నారు.

# రెవెన్యూ గ్రామాల హద్దుల నిర్ధారణతో సమస్యల పరిష్కారం

- సర్వేయర్లు ప్రజల సహకారంతో సమస్యల పరిష్కారం
- రెవెన్యూ సదస్సులను అందిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



చెన్నూర్ జూలై 3 (జనం సాక్షి) : ప్రభుత్వ ఆదేశం ప్రకారం జిల్లాలో భూ సర్వే ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని, రెవెన్యూ గ్రామాల హద్దుల నిర్ధారణతో సమస్యల పరిష్కారానికి వెసులుబాటు కలుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని చెన్నూర్ మండలం కిష్టంపేట గ్రామంలో ఏర్పాటు చేసిన సమగ్ర భూ సర్వే అవగాహన సదస్సుకు మండల తహసిల్దార్ మల్లికార్జున్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మోహన్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన భూ సంబంధిత దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులను చూసి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో రికార్డులు, మోకా, పట్టాదారుల వివరాలు ఇతర అంశాలను పరిగణలోకి తీసుకొని ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మొదటగా గ్రామంలోని భూములకు సంబంధించి హద్దులు నిర్ధారించడం జరుగుతుందని, తద్వారా గ్రామానికి సంబంధించిన భూమి స్పష్టత వస్తుందని, ప్రభుత్వ భూములు సైతం నిర్ధారణ అవుతాయని తెలిపారు. పట్టా కలిగి ఉండి మోకాపై లేకపోవడం, మోకాపై ఉండి పట్టా కలిగి ఉండకపోవడం అంశాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రభుత్వం భూములను ఆక్రమించినట్లయితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. భూ సర్వే సమగ్రంగా నిర్వహించి మ్యాపింగ్ చేయడం జరుగుతుందని, ఈ క్రమంలో భూ సమస్యలు తలెత్తినట్లయితే న్యాయపరమైన చర్యలకు సులభతరమవుతుందని, మ్యాపింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ చర్యలలో భాగంగా నిబంధనల ప్రకారం సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయడం జరుగుతుందని, న్యాయపరంగా రావలసిన భూమి అందుతుందని తెలిపారు. అనంతరం కోటపల్లి మండల కేంద్రంలో కొనసాగుతున్న అమృత్ 2.0 పథకం పనులను మండల తహసిల్దార్ రాఘవేంద్ర, మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగేశ్వర్ రెడ్డి లతో కలిసి సందర్శించి పనులు త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో కొనసాగుతున్న అదనపు గదులు, భోజనశాల పనులను పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న మెనూ, విద్య బోధన తీరును పరిశీలించారు. మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతి రెవెన్యూ సదస్సులను అందిన దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, రెవెన్యూ రికార్డులతో సరి చూసి దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. వివిధ ధ్రువపత్రాల కొరకు కార్యాలయానికి వచ్చిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

# ఏఎన్ఎస్ ఆధ్వర్యంలో పోడు రైతులు పాలాభిషేకం

- రేవంత్ రెడ్డి, సీతక్క, కోదండ రెడ్డి లకు పాలాభిషేకం చేసిన పోడు రైతులు
- అడవికి అసలైన యజమానులు ఆదివాసీలే పేర్కొన్న నర్సింహా మూర్తి నాగరాజు..



నూగూర్ వెంకటాపురం, జూలై 3 (జనంసాక్షి) : మండల కేంద్రంలో జల్ జంగిల్ జమిన్ నినాదంతో ఆదివాసీలు శతబ్దాలుగా పోరాటాలు చేస్తే అడవిపైన ఆదివాసీలకు లభించాయని ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి, వాసం నాగరాజు లు తెలియజేశారు. అడవికి యజమానులు ఆదివాసీలే అని వారు పేర్కొన్నారు. యజమాని హక్కులు గుర్తించడం లో భారత ప్రభుత్వాలు వైఫల్యం చెందాయన్నారు. ఆదివాసీ నవనిర్మాణ సేన ఆధ్వర్యంలో పోడు భూములను భూ భారతి పోర్టల్ లో చేర్చాలని రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి ని కలిసి పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేసినట్టు వారు తెలిపారు. రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి ములుగు జిల్లా మంత్రి దనసరి సీతక్క ప్రత్యేక చొరవతో భూ భారతి పోర్టల్ లో పోడు భూములకు చోటు దక్కిందని నర్సింహా మూర్తి నాగరాజు హర్షం వ్యక్తం చేశారు. వెంకటాపురం వాజేడు మండలాల ఆదివాసీ పోడు రైతులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క, కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి చిత్ర పటాలకు శుక్రవారం పాలాభిషేకం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వర్ధిలాలి అని రైతులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సీతక్క, కోదండ రెడ్డి లకు రైతులు జేజేలు పలికారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చినప్పటికి పోడు భూములను డిజిటలైజేషన్(క్రమంబద్ధికరణ ) చేయలేదని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధి తో వ్యవహరించినట్టు తెలిపారు. కోదండ రెడ్డి ఆదివాసీల పట్ల అంకిత భావంతో ఉన్నారని అన్నారు. మంత్రి సీతక్క కోదండ రెడ్డి చొరవతో పాలెం వాగు ప్రాజెక్ట్ కాలువకు పది కిలోమీటర్లు వరకు రైతులకు త్రి పేస్ కరెంట్ లైన్ వేపించారని, ఆదివాసీ రైతులకు వ్యవసాయ బోర్లు వేపించినట్టు వివరించారు. పోడు భూములను భూ భారతి చేర్చక పోవడం వల్ల పట్టాలు ఉన్నప్పటికీ పోడు భూములు లాక్కోవడం, అక్రమ కేసులు పెట్టడం జరిగేది అనన్నారు. భూ భారతి పోర్టల్ లో పోడు భూములను చేర్చడం వల్ల పోడు భూముల పై సంపూర్ణ హక్కులు ఆదివాసులకు లభించాయన్నారు. ఐదో షెడ్యూల్ పరిపాలన కొనసాగించాలని, ఎల్ టి ఆర్, పెసా, అటవీహక్కుల గుర్తింపు చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నర్సింహా మూర్తి నాగరాజు కోరినారు. సాగులో ఉన్న పోడు, రెవిన్యూ భూములకు పట్టాలు మంజూరు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమం లో నాయకులు కుంజ మహేష్,మొడెం నాగరాజు,ఉప సర్పంచ్ కంతి శంకర్, పద్మ, కంతి విజయ్, పాయం బాబు,వాజేడు వెంకటాపురం పోడు రైతులు పాల్గొన్నారు..



# ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే రేవూరి

పరకాల, జులై 3 (జనం సాక్షి): పరకాల పట్టణ కేంద్రంలోని రాజుపేట లో నూతనంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించి, పనులు నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. విద్యారంగ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని,ఈ పాఠశాల ద్వారా స్థానిక విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలతో కూడిన విద్య అందుబాటులోకి వస్తుందని తెలిపారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా, సమయానికి పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు మేమే చేస్తామని అన్నారు.

# సీఎంఆర్ నిల్వ కేంద్రాలకు తరలించాలి

- అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్.జి



ములుగు, జూలై 3 (జనం సాక్షి): సిఎంఆర్ నిల్వ కేంద్రాలకు తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి సంబంధిత అధికారులను ఆదశించారు.శుక్రవారం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, ఎఫ్‌సీఐ జనరల్ మేనేజర్ నేత్ర ప్రకాష్, సంబంధిత అధికారులతో ధాన్యం నిల్వ కేటాయింపుపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని నిర్ణీత ప్రమాణాల ప్రకారం సిఎంఆర్ ను నిల్వ కేంద్రాలకు తరలించే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ధాన్యం నిల్వ, రవాణా, మిల్లింగ్ ప్రక్రియల్లో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారి ఫైజల్ హుస్సేన్, డిఎం కృష్ణవేణి, డిటి సియస్ విజయ్ కుమార్, రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్, రైస్ మిల్లర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైలు కింద పడి దంపతుల ఆత్మహత్య!

- ఘట్ కేసర్ లోని బీబీనగర్ రైల్వే ట్రాక్ వద్ద సంఘటన
- బతుకుదెరువు కోసం హైదరాబాద్ కు వెళ్లి విగత జీవులుగా స్వగ్రామానికి...
- పాపయ్యపేట గ్రామంలో అలుముకున్న విషాదఛాయలు



చెన్నారావుపేట, జులై 3 ( జనం సాక్షి): రైలు కిందపడి వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేట గ్రామానికి చెందిన దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే... పాపయ్యపేట గ్రామానికి చెందిన బుడిగె రవికుమార్(42) గత 16 సంవత్సరాల క్రితం హైదరాబాద్ కు వెళ్లి ఒక రైస్ మిల్లులో గుమస్తాగా పనిచేశాడు. అనంతరం గూడూరు మండలం నాయక్ పల్లి గ్రామానికి చెందిన శిరీష(38)ను వివాహం చేసుకున్నాడు. వీరికి సుశాంత్, విద్వాంష్ ఇద్దరు కుమారులు ఉన్నారు. సుశాంత్ ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్నాడు. విద్వాంష్ 6వ తరగతి చదువుతున్నాడు. వివాహం అయినప్పటినుండి హైదరాబాదులోని హయత్ నగర్ ప్రాంతంలోని కుంట్లూరులో నివాసం ఉంటున్నారు. రవికుమార్ దిల్ సుఖ్ నగర్ లోని చైతన్యపురిలో బియ్యం షాపును సొంతంగా పెట్టుకుని నడిపిస్తున్నాడు. గత ఆరు సంవత్సరాల క్రితం హయత్ నగర్ లోని కుంట్లూరులో సొంత ఇల్లును కూడా నిర్మించుకుని అక్కడే జీవనం సాగిస్తున్నారు. తన భార్య శిరీష ఇంట్లో టైలరింగ్ పనులు చేస్తుంది. గురువారం రాత్రి 9:30 గంటల ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై రవికుమార్, శిరీష దంపతులు ఘట్కేసర్ ప్రాంతంలోని బీబీనగర్ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్దకు వెళ్లి ద్విచక్ర వాహనాన్ని పక్కన పెట్టి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. దీంతో నడుస్తున్న రైలు వారిపై నుండి వెళ్లడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు గమనించి రైల్వే పోలీసులకు సమాచారం అందించడంతో శుక్రవారం మృతదేహాలను గాంధీ ఆసుపత్రికి తరలించారు. జీవనోపాధి కోసం హైదరాబాద్ కు వెళ్లి గురువారం రాత్రి రైలు కింద పడి దంపతులు ఆత్మహత్య చేసుకుని మృతి చెందడంతో ఇద్దరు కుమారులు సుశాంత్, విద్వాంష్ లు తల్లిదండ్రుల మృతదేహాలను చూసి రోధిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. అలాగే మృతుల కుటుంబ సభ్యులు తమ కుమారుడి, కూతురి మృతదేహాలను చూసి బోరున విలపించారు. రైల్వే పోలీసులు మృతదేహాలకు పోస్టు మార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృత దేహాలను అంబులెన్స్ లో పాపయ్యపేట గ్రామానికి తీసుకువచ్చారు. అలాగే కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. రవికుమార్, శిరీష దంపతులకు ఎలాంటి ఆర్థిక సమస్యలు, ఇబ్బందులు లేవని దంపతులు ఇద్దరూ తమ పిల్లలతో ఎంతో అన్యోన్యంగా కలిసిమెలిసి ఉండేవారని గ్రామస్తులు,బంధువులు తెలిపారు. ఇది ఇలా ఉండగా రవికుమార్ ఇటీవల రెడ్ మిక్స్ వాహనాన్ని కొనుగోలు చేశాడని ఆ వాహనం కొనుగోలుకు సంబంధించిన డబ్బుల విషయంలో వాహన యజమానికి రవికుమార్ కు గొడవలు జరుగుతున్నట్లు తెలిసింది. వాహన యజమాని భార్య గురువారం రవికుమార్ శిరీష దంపతుల ఇంటికి వచ్చి గొడవ పెట్టి వెళ్లగా మనస్థాపానికి గురైన దంపతులు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు, బంధువులు చర్చించుకుంటున్నారు. ఇద్దరు దంపతుల మృతికి గల కారణాలు ఏమై ఉంటాయని రైల్వే పోలీసులు, అక్కడి స్థానిక పోలీసులు విచారణ జరుపుతున్నారు.

# రాజకీయాలకు వేదికగా భద్రకాళి ఆలయం?

- ఛాలెంజ్‌లతో పవిత్ర క్షేత్రంలో ఉద్రిక్తత
- ఆలయానికి వచ్చిన భక్తుల ఆగ్రహం..!



వరంగల్ బ్యూరో, జూలై 03 (జనం సాక్షి) : అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు తీసుకుందామని వచ్చిన భక్తులు ఆందోళన చెందిన పరిస్థితి శుక్రవారం వరంగల్లోని చారిత్రక శ్రీ భద్రకాళి దేవాలయం వద్ద చోటు చేసుకుంది. రాజకీయ నాయకుల సవాళ్లు ప్రతి సవాళ్లకు వేదికగా మారిన పరిస్థితి కనిపించింది. దీంతో భక్తుల్లో ఇక్కడ ఏం జరుగుతుంది అనే అయోమయం నెలకొంది. ఇటీవల వరంగల్ నగరంలో రాజకీయ వేడి రోజురోజుకూ పెరుగుతుండగా, ఆ ప్రభావం ఇప్పుడు పవిత్రమైన భద్రకాళి అమ్మవారి ఆలయానికి చేరింది. ప్రజా సమస్యలు, రాజకీయ విమర్శలు ప్రెస్‌మీట్లు లేదా పార్టీ కార్యాలయాల్లో చర్చించాల్సింది పోయి, ఆలయాన్ని సవాళ్లు, ప్రతి సవాళ్లకు వేదికగా మార్చడంపై భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ఇటీవల మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి భద్రకాళి అమ్మవారి సాక్షిగా ఒకరికొకరు సవాళ్లు విసరడం చర్చనీయాంశంగా మారగా, తాజాగా కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కూడా) భూముల వేలం వ్యవహారం కూడా పవిత్రమైన శ్రీ భద్రకాళి ఆలయానికి చేరింది. మాజీ కూడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి అవినీతి ఆరోపణలపై భద్రకాళి ఆలయంలో తడిబట్టలతో ప్రమాణం చేస్తానని ప్రకటించగా, ప్రస్తుత కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి కూడా సవాల్‌ను స్వీకరించారు. ఈ పరిణామాలతో ఆలయ పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి, పోలీసులు భారీగా మోహరించి పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు.ఈ పరిణామాలపై భక్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "దేవాలయానికి వచ్చేది మనశ్శాంతి కోసం. రాజకీయ సవాళ్లు, పోలీసుల హడావుడి చూడటానికి కాదు. పవిత్రమైన ఆలయాన్ని రాజకీయ వేదికగా మార్చడం సరికాదు" అని వారు అభిప్రాయ పడుతున్నారు. కొందరు భక్తులు అయితే తమ ఆగ్రహాన్ని వెల్లడించారు. ముఖ్యంగా శుక్రవారం కావడంతో వందలాది మంది భక్తులు దర్శనానికి వచ్చిన సమయంలో రాజకీయ కార్యక్రమాలు, పోటా పోటీ నినాదాలు కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలిపారు."రాజకీయ ఆరోపణలు, సవాళ్లు ఉంటే ప్రెస్‌మీట్ ల్లోనో, పార్టీ కార్యాలయాల్లోనో చేసుకోవాలి. భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఆలయాలను రాజకీయాలకు వేదికగా మార్చడం మానుకోవాలి" అంటూ భక్తులు తీవ్రంగా స్పందించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ దిశగా ఆలోచించి ఆలయానికి వచ్చే భక్తులకు ప్రశాంతత మనశ్శాంతి కలిగేలా వ్యవహరించాలని భక్తులు కోరుతున్నారు.





# ఐటీ బూస్ట్

**హెల్త్ స్టాక్స్‌లోనూ కొనుగోళ్లు**
**మూడో రోజూ లాభాల్లోనే మార్కెట్లు**

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారాంతాన్ని లాభాలతో ముగించాయి. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి మిశ్రమ సంకేతాలు ఉన్నప్పటికీ.. ఐటీ, రియాల్టీ, ఫార్మా, హెల్త్‌కేర్ స్టాక్స్ సూచీలకు దన్నుగా నిలిచాయి. దీంతో సూచీలు వరుసగా మూడో రోజూ లాభపడ్డాయి. సెన్సెక్స్ ఉదయం 78,152.34 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,502.12) లాభాల్లో ప్రారంభమైంది. ఆరంభంలో 600 పాయింట్ల మేర లాభాల్లో కదలాడిన సెన్సెక్స్.. మధ్యాహ్నం తర్వాత కాస్త క్షీణించింది. చివరికి 261.79 పాయింట్ల లాభంతో 77,763.91 వద్ద ముగిసింది. నిఫ్టీ 95.15 పాయింట్ల లాభంతో 24,270.85 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.22గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్, సన్‌ఫార్మా, బజాజ్ ఫైనాన్స్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. యాక్సిస్ బ్యాంక్, ఎస్‌బీఐ, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎల్‌అండ్‌టీ, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 71 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4179 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**కొనసాగిన చమురోత్సాహం**

పశ్చిమాసియా ఉద్రిక్తతలు చల్లబడటంతో పాటు చమురు ధరలు దిగిరావడంతో దేశీయ సూచీలు వరుసగా రెండో రోజైన గురువారమూ లాభాల్లో ముగిశాయి. తక్కువ ధరల్లో లభిస్తున్న దిగ్గజ ఐటీ కంపెనీల షేర్ల కొనుగోలుకు మదుపుదార్లు ముందుకు రావడమూ ఉపకరించింది. ఇన్ఫోసిస్ 5.64%, టెక్



మహీంద్రా 4.32%, టీసీఎస్ 4.28%, హెచ్‌సీఎల్ 4.12%, విప్రో 2.35% మేర పెరిగాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 19 పైసలు తగ్గి 95.35 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు 0.03% నష్టంతో 71.55 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో సింగపూర్, హాంకాంగ్ మినహా మిగతావి నష్టాల్లో ముగిశాయి. ఐరోపా మార్కెట్లు లాభాల్లో ఆరంభమయ్యాయి. బీఎస్‌ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.3.32 లక్షల కోట్లు పెరిగి రూ.479.80 లక్షల కోట్ల (5.04 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. ఆగని జోరు..: ఉదయం బీఎస్‌ఈ సెన్సెక్స్ 77,083.14 పాయింట్ల వద్ద లాభాల్లో (క్రితం ముగింపు 76,922.64) ఆరంభమైంది. అదే ఒరవడి కొనసాగిస్తూ, ఒక దశలో 77,578.93 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరింది. చివరకు 579.48 పాయింట్ల లాభంతో 77,502.12 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 169.85 పాయింట్లు పెరిగి 24,175.70 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 24,058.80 వద్ద కనిష్ఠాన్ని; 24,194.55 వద్ద గరిష్ఠాన్ని ఈ సూచీ నమోదు చేసింది.

ఏడు డీలా..: సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 7 మినహా మిగతావి లాభాల్లో ముగిశాయి. ఐటీ షేర్లతో పాటు బజాజ్ ఫిన్‌సర్వ్ 3.25%, టైటన్ 1.94%, అదానీ పోర్ట్స్ 1.85% పెరిగాయి. ఎల్‌అండ్‌టీ 0.78%, మారుతీ సుజుకీ 0.43%, యాక్సిస్ బ్యాంక్ 0.33%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.32%, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ 0.26% తగ్గాయి.

పార్లే ప్రోడక్ట్స్ రూ.9,500 కోట్ల ఐపీఓ

పార్లే-జి, మెలోడి, మ్యాంగో బైట్ పేర్లతో బిస్కెట్లు, చాక్లెట్లు తయారు చేసి, విక్రయిస్తున్న సంస్థ పార్లే ప్రోడక్ట్స్ లిమిటెడ్ వచ్చే ఏడాది పబ్లిక్ ఇష్యూకు వచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఐపీఓ కోసం సంస్థ రూ.1,00,000 కోట్ల విలువ లక్ష్యాన్ని పెట్టుకుందని, తద్వారా సుమారు రూ.9,500 కోట్లను సమీకరించాలని అనుకుంటోందని సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ ఓ ఆంగ్ల వెబ్‌సైట్ కథనం తెలిపింది. తొలి పబ్లిక్ ఆఫర్ కోసం సంబంధిత ముసాయిదా పత్రాలను రహస్య పద్ధతిలో సమర్పించినట్లు కార్ల్స్‌బర్గ్ ఇండియా తెలిపింది. డెన్మార్క్‌కు చెందిన దిగ్గజ పానీయాల సంస్థ కార్ల్స్‌బర్గ్ గ్రూపునకు కార్ల్స్‌బర్గ్ ఇండియా అనుబంధ సంస్థ.

## అమెరికా, ఐరోపా టికెట్ల ధరలు తగ్గాయ్: ఎయిరిండియా

**న్యూఢిల్లీ:** విమాన ఇంధన (ఏటీఎఫ్) ధర బాగా పెరిగినప్పుడు అంతర్జాతీయ విమాన టికెట్లపై విధించిన ఇంధన సర్‌ఛార్జీని టాటా గ్రూప్ సంస్థ ఎయిరిండియా తాజాగా కొంతమేర తగ్గించింది. ముడిచమురు ధర పశ్చిమాసియా యుద్ధం ముందుస్థాయికి తగ్గడం ఇందుకు కారణం. ఫలితంగా అమెరికా, ఐరోపా, ఆస్ట్రేలియా, యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) దేశాలకు వెళ్లి, వచ్చే విమానాల్లో టికెట్ల ధరలు కొంతమేర తగ్గుతున్నాయి. అమెరికా-ఆస్ట్రేలియా విమానాల్లో టికెట్‌పై సర్‌ఛార్జీని 280 డాలర్ల నుంచి 200 డాలర్లకు, ఐరోపా-యూకే టికెట్‌పై 205 డాలర్ల నుంచి 125 డాలర్లకు ఎయిరిండియా జులై 1 నుంచే తగ్గించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.



## రివోల్ట్ ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్..



**సింగిల్ ఛార్జ్‌తో 160 కి.మీ**

ప్రముఖ విద్యుత్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ రివోల్ట్ ఆర్‌వీఎక్స్ పేరుతో కొత్త మోటార్ సైకిల్‌ను దేశీయ మార్కెట్‌లోకి విడుదల చేసింది. దీని ధరను రూ.1.30 లక్షలు (ఎక్స్‌షోరూమ్)గా నిర్ణయించింది. పీఎం ఇ-డ్రైవ్ సబ్సిడీ అనంతరం రూ.1.24 లక్షలకు రానుంది. యూత్‌ను ఆకట్టుకునేందుకు పెర్ఫార్మెన్స్‌పై దృష్టిసారించినట్లు కంపెనీ తెలిపింది. రివోల్ట్ ఆర్‌వీఎక్స్‌లో 3.24 కి.వా.బ్యాటరీ ఇచ్చారు. సింగిల్ ఛార్జ్‌తో 160 కిలోమీటర్లు ప్రయాణించొచ్చని కంపెనీ చెబుతోంది. ఫాస్ట్ ఛార్జర్‌తో కేవలం 80 నిమిషాల్లోనే 0-80 శాతం బ్యాటరీని ఛార్జ్ చేయొచ్చు. 3.9 సెకన్లలో 0-40 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుందని కంపెనీ క్లెయిమ్ చేస్తోంది. బూస్ట్ మోడ్‌లో గరిష్ఠంగా గంటకు 90 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుందని కంపెనీ పేర్కొంది. ఆర్‌వీఎక్స్‌లో మొత్తం మూడు రైడింగ్ మోడ్‌లు ఉంటాయి. ఎకో, నార్మల్, స్పోర్ట్ మోడ్ ఆప్షన్లు ఉంటాయి. క్విక్ యాక్సిలరేషన్ కోసం తాత్కాలికంగా బూస్ట్ మోడ్ పనిచేస్తుంది. బూస్ట్‌మోడ్ పరిస్థితులు లేకపోతే ఆటోమేటిక్‌గా స్పోర్ట్‌మోడ్‌కు మారిపోతుంది. ఇందులో వెనుకవైపు మోనోషాక్ సస్పెన్షన్ ఇచ్చారు. ముందూ వెనుక డిస్క్‌బ్రేక్ సదుపాయం ఉంది. 3.5 అంగుళాల ఐపీ67 రేటింగ్‌తో కూడిన డిస్‌ప్లే ఉంది. బ్లూటూత్‌తో స్మార్ట్‌ఫోన్‌కు కనెక్ట్ చేసుకోవచ్చు. జియో ఫెన్సింగ్, కాల్/మెసేజ్ అలర్టులు, హిల్ హోల్డ్ అసిస్ట్, రివర్స్ మోడల్, వాక్ అసిస్ట్ వంటి సదుపాయాలు ఉన్నాయి.

## సాఫ్ట్‌డ్రింక్స్ వ్యాపారంలోకి ఐటీసీ




**న్యూఢిల్లీ:** కార్బొనేటెడ్ సాఫ్ట్ డ్రింక్స్ విపణిలోకి ఐటీసీ అడుగుపెట్టింది. కోకనట్ కోలా పేరుతో షుగర్- ఫ్రీ కోలాను విడుదల చేసింది. కంపెనీకి చెందిన బి నేచురల్ పానీయాల విభాగంలో తీసుకొచ్చిన ఈ కోలాను, కొబ్బరి నీళ్లతో తయారు చేసినట్లు ఐటీసీ తెలిపింది. తొలుత క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఈ కోలాను విక్రయించనున్నట్లు పేర్కొంది. తర్వాత ప్రయోగాత్మక పద్ధతిలో దేశవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. ఇప్పటికే రిలయన్స్ ఇండస్ట్రీస్, కోక-కోలా, పెప్సికో లాంటి దేశీయ, అంతర్జాతీయ దిగ్గజాలు ఈ వ్యాపారంలో ఉన్న సంగతి తెలిసిందే.

## పబ్లిక్ ఇష్యూకు రత్నదీప్ సూపర్‌మార్కెట్స్

**హైదరాబాద్:** హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఆహార, నిత్యావసరాల రిటెయిల్ సంస్థ రత్నదీప్ రిటెయిల్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. రూ.400 కోట్లు సమీకరించే లక్ష్యంతో తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు అనుమతి కోరుతూ ముసాయిదా పత్రాలను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి సమర్పించింది. ఐపీఓలో తాజా షేర్ల జారీతో పాటు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా ప్రమోటర్లు సందీప్ అగర్వాల్, మనీశ్ భార్తియా, మితేశ్ భార్తియా, యాస్ అగర్వాల్, కవితా అగర్వాల్ తమ వాటా షేర్లలో కొంతమేర (1.49 కోట్ల షేర్లు) విక్రయించనున్నారు. ఐపీఓకు ముందే (ప్రి- ఐపీఓ) రూ.70 కోట్ల విలువైన షేర్లను కంపెనీ జారీ చేసే అవకాశం ఉంది. ఇందులో షేర్లకు పూర్తి స్థాయిలో స్పందన లభిస్తే... ఐపీఓలో తాజా షేర్ల పరిమాణం తగ్గుతుంది.

నిధుల వినియోగం: సమీకరించే నిధుల్లో రూ.260 కోట్లను రత్నదీప్, నేషనల్ మార్ట్ పేరుపై కొత్త విక్రయ కేంద్రాలు తెరిచేందుకు; రూ.40 కోట్లను రుణాల చెల్లింపునకు, మిగిలిన మొత్తాన్ని సాధారణ కార్పొరేట్ అవసరాలకు ఉపయోగించనుంది.

కార్యకలాపాలు.. ఆదాయాలు: 2026 మార్చి 31 నాటికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల్లో రత్నదీప్‌కు మొత్తం 190 విక్రయ కేంద్రాలున్నాయి. రత్నదీప్ (సూపర్ మార్కెట్లు), రత్నదీప్ సెలెక్ట్ (ప్రీమియం ఫుడ్ స్టోర్లు), నేషనల్ మార్ట్ (హైపర్ మార్కెట్), స్టైల్ మార్ట్ (అందుబాటు ధరల్లో దుస్తుల కోసం) పేర్లతో వీటిని నిర్వహిస్తోంది. 2025-26లో రూ.2,223 కోట్ల ఆదాయంపై రూ.36 కోట్ల లాభం ఆర్జించినట్లు రత్నదీప్ రిటెయిల్ తెలిపింది.

పోటీ సంస్థలు: రత్నదీప్ పోటీ సంస్థలైన అవెన్యూ సూపర్‌మార్ట్స్ విశాల్ మెగా మార్ట్, స్పెన్సర్ రిటెయిల్, ట్రెంట్ ఇప్పటికే స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదయ్యాయి.

లీడ్ మేనేజర్లు: రత్నదీప్ రిటెయిల్ ఐపీఓకు మోతీలాల్ ఓస్వాల్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వయిజర్స్, యాక్సిస్ కేపిటల్, డీఏఎం కేపిటల్ అడ్వయిజర్స్ లీడ్ మేనేజర్లుగా వ్యవహరిస్తున్నాయి.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 1,45,800 (22 క్యారెట్లు) | ₹ 1,59,060 (24 క్యారెట్లు) |
|---|---|


### వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్

₹ 2,95,000

# దక్షిణాదికి మరింత వేగంగా డేటా సరఫరా

**ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చేకూరనున్న ప్రయోజనం**

- సింగపూర్‌తో అనుసంధానానికి సముద్రగర్భ కేబుల్
- ఏర్పాటు చేయనున్న లైట్‌స్టార్మ్ కంపెనీ




**న్యూఢిల్లీ:** దేశంలో కృత్రిమ మేధ, క్లౌడ్ కంప్యూటింగ్ అవసరాలు శరవేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, భారతదేశ తూర్పు తీరాన్ని ఆగ్నేయాసియాతో అనుసంధానించేందుకు భారీ సముద్ర గర్భ కేబుల్ వ్యవస్థ సిద్ధమవుతోంది. సింగపూర్‌కు చెందిన లైట్‌స్టార్మ్ సంస్థ నేతృత్వంలో మైక్రోసాఫ్ట్, సింగ్‌టెల్, టాటా కమ్యూనికేషన్స్ వంటి దిగ్గజ సంస్థలతో కూడిన కన్సార్షియం ఈ 'ఐ-2సీ' ప్రాజెక్టును చేపట్టింది. సుమారు 3,600 కిలోమీటర్ల పొడవున్న ఈ కేబుల్ వ్యవస్థ ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నం, తమిళనాడులోని దక్షిణ చెన్నైలను నేరుగా సింగపూర్, మలేషియాలతో కలుపుతుంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న కేబుల్ వ్యవస్థలు పాతవై పోవడం, ఏఐ శిక్షణ, హై-పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ వంటి పనులకు భారీ డేటా వేగం అవసరం కావడంతో ఈ సరికొత్త వ్యవస్థను రూపొందించినట్లు లైట్‌స్టార్మ్ సీఈఓ అమజిత్ గుప్తా వెల్లడించారు. ఈ కేబుల్ ద్వారా సింగపూర్-హైదరాబాద్ మధ్య అత్యంత తక్కువ బదిలీ జాప్యంతో డేటా కనెక్టివిటీ లభిస్తుందని వెల్లడించారు. ముంబయి నుంచి సింగపూర్‌కూ ప్రస్తుత వేగం కంటే 10-15% మెరుగైన వేగం లభిస్తుందని పేర్కొన్నారు. సాధారణంగా అంతర్జాతీయ సముద్ర గర్భ కేబుళ్లన్నీ ముంబయి వంటి పశ్చిమ తీర నగరాల్లో ల్యాండ్ అవుతుంటాయి. ఎర్ర సముద్రం, హర్మూజ్ జలసంధిలో నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల వల్ల డేటా వ్యవస్థలపైనా ఆందోళన నెలకొంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని, ప్రత్యామ్నాయ మార్గం కోసం తూర్పు తీరంలోని మచిలీపట్నంను ప్రధాన ల్యాండింగ్ ప్రాంతంగా ఎంచుకున్నారు. ఈ పథకంలో భాగంగా మచిలీపట్నం నుంచి హైదరాబాద్‌కు, అక్కడి నుంచి ముంబయికి కొత్త భూగర్భ ఫైబర్ మార్గాలను ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్‌లో తన డేటా సెంటర్ కార్యకలాపాలను విస్తరిస్తున్న మైక్రోసాఫ్ట్ సంస్థ, ఈ కేబుల్ వ్యవస్థను ప్రధానంగా ఉపయోగించుకోనుంది. మైక్రోసాఫ్ట్‌తో పాటు ఇతర హైపర్ స్కేలర్లు, పెద్ద సంస్థలు ఇప్పటికే కొత్త వ్యవస్థ సేవలను పొందేందుకు ఒప్పందాలు చేసుకున్నాయి. లైట్‌స్టార్మ్‌కు చెందిన 30,000 కిలోమీటర్ల భూగర్భ నెట్‌వర్క్ దేశవ్యాప్తంగా ఉన్న 80కి పైగా డేటా సెంటర్లతో అనుసంధానమై ఉంది. 2029 నాలుగో త్రైమాసికం నాటికి కొత్త కేబుల్ సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని, వచ్చే ఏడాది ఐపీఓ ప్రణాళికల్లో ఉన్న లైట్‌స్టార్మ్ వెల్లడించింది.

## స్వాధీనం చేసుకున్న విమానం వేలం

**దేశంలో తొలిసారిగా ఈడీ సంచలన నిర్ణయం**

హైదరాబాద్,జూలై3(జనంసాక్షి): దేశంలోనే తొలిసారిగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈడీ స్వాధీనం చేసుకున్న ఓ విమానాన్ని ఈ-వేలం ద్వారా విక్రయించింది. హైదరాబాద్ జోనల్ ఈడీ స్వాధీనం చేసుకున్న హాకర్ 800 విమానాన్ని విక్రయించేందుకు ఈ నెల 1న ఎంఎస్‌టీసీ ద్వారా ఆక్షన్ నిర్వహించగా.. రూ.3 కోట్లకు అమ్ముడుపోవడం విశేషం. హాకర్ 800 విమానం అనేది అంతకుముందు ఫాల్కన్ పోంజీ కేసు ప్రధాన నిందితుడు అమర్‌దీప్ కుమార్‌కు చెందినది. అయితే అమర్‌దీప్ నకిలీ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ పేరుతో రూ.792 కోట్ల మోసానికి పాల్పడినట్లు ఈడీ తేల్చింది. దర్యాప్తులో భాగంగా ఈ విమానాన్ని గత మార్చి 7న ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత.. చట్టపరమైన ప్రక్రియ ద్వారా, పీఎంఎల్‌ఏ అడ్జుడికేటింగ్ అథారిటీ అనుమతితో దీనిని ఈ-వేలంలో రూ.3 కోట్లకు విక్రయించారు. ఈ సొమ్మును బాధిత పెట్టుబడిదారులకు తిరిగి చెల్లించనున్నారు. కాగా.. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులు అరెస్ట్ అవ్వగా, దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఈడీ తెలిపింది. అయితే.. ఈడీ స్వాధీనం చేసుకున్న విమానాన్ని పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో విక్రయించడం దేశంలో ఇదే తొలిసారి కావడం విశేషం. ఆస్తుల విక్రయ ప్రక్రియలో పారదర్శకత, పోటీ వాతావరణం కల్పించడం సహా ప్రభుత్వ ఆదాయాన్ని మరింత పెంచే దిశగా ఈ విధానం ఉపయుక్తమవుతుందని అధికారులు భావిస్తున్నారు.



## మూడేళ్లలో పూర్తిస్థాయి ఎంఎఫ్ ఉత్పత్తులు

- గిఫ్ట్ సిటీ ద్వారా మరిన్ని ఎస్ఐఎఫ్‌లు, ఈటీఎఫ్‌లు
- జియో బ్లాక్‌రాక్ సీఐఓ రిషి కోహ్లి

**కోల్‌కతా:** స్పెషలైజ్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (ఎస్ఐఎఫ్) విభాగంలోకి ప్రవేశించిన తర్వాత, వచ్చే మూడేళ్లలో పూర్తిస్థాయి మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) ఉత్పత్తులు తీసుకురావాలని జియో బ్లాక్‌రాక్ భావిస్తోంది. గిఫ్ట్ సిటీ ద్వారా మరిన్ని ఎస్ఐఎఫ్‌లు, ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్‌లు), ఆఫ్‌షోర్ ఇన్వెస్ట్‌మెంట్ ఉత్పత్తుల్లోకీ విస్తరించడానికి సిద్ధమవుతున్నట్లు జియో బ్లాక్‌రాక్ ఏఎంసీ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ (సీఐఓ) రిషి కోహ్లి వెల్లడించారు. తమ తొలి ప్రిజం హైబ్రిడ్ లాంగ్-షార్ట్ ఫండ్‌ను ప్రవేశపెట్టిన తర్వాత, వచ్చే ఏడాదిలో ఈక్విటీ లాంగ్-షార్ట్ విభాగంలో కనీసం మరో ఎస్ఐఎఫ్‌ని ప్రారంభించాలని కంపెనీ యోచిస్తున్నట్లు తెలిపారు. ప్రిజం ఎస్ఐఎఫ్ అనేది మల్టీ-స్ట్రాటజీ హైబ్రిడ్ పథకం. ఫండ్ స్థాయి రిస్క్‌ను 2 శాతానికి పరిమితం చేస్తూనే, 9-11% వార్షిక రాబడి అందించేలా రూపొందించినట్లు కంపెనీ తెలిపింది. ఎస్ఐఎఫ్‌ల కోసం రూ.10 లక్షల కనీస పెట్టుబడి పరిమితి ఉన్నందున, ఈ ఉత్పత్తిని సంప్రదాయ మ్యూచువల్ ఫండ్‌లు, పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీసెస్ (పీఎంఎస్) మధ్యగా ఉండే 'మిస్సింగ్ మిడిల్'గా ఆయన అభివర్ణించారు. జియో బ్లాక్‌రాక్ ప్రస్తుతం రూ.18,000 కోట్ల విలువైన ఆస్తులను నిర్వహిస్తోంది. ఇందులో రూ.12,500 కోట్లు డెట్ - ఆదాయ పథకాల రూపంలో ఉండగా, రూ.5,500 కోట్లు ఈక్విటీ పథకాల్లో ఉన్నాయి. ఈ ఏఎంసీ వద్ద 14 పథకాలు ఉన్నాయి. కాగా ఎస్ఐఎఫ్ దీని 15వ ఉత్పత్తి. ఈ నెల 13న ఎన్ఎఫ్ఓ ముగియనుంది. స్పెషలైజ్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ పరిశ్రమ సుమారు రూ.14,000 కోట్ల ఆస్తుల స్థాయికి చేరుకుందని, ప్రతి నెలా రూ.500 కోట్లకు పైగా విస్తరిస్తోందని కోహ్లి వెల్లడించారు. జియో బ్లాక్‌రాక్ ఏఎంసీ ముకేశ్ అంబానీ ఆధ్వర్యంలోని జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, అంతర్జాతీయ అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థ బ్లాక్‌రాక్ మధ్య కుదిరిన ఉమ్మడి భాగస్వామ్య సంస్థ. త్వరలో ఈటీఎఫ్‌నూ ప్రవేశపెట్టాలని భావిస్తోంది. గిఫ్ట్ సిటీ కోసం 10 అవుట్‌బౌండ్ ఉత్పత్తులను ఎంపిక చేసింది.

## మిగులు పండ్లు, గుజ్జుతో ఇథనాల్ ఉత్పత్తి

తెలంగాణ ఆంధ్రప్రదేశ్, రాష్ట్రాల్లో పండ్ల మిగులును వినియోగించుకుని, ఇథనాల్ తయారీ కోసం సాంకేతిక, వాణిజ్య సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు సీఎస్ఐఆర్-ఎన్ఐఐఎస్‌టీ, హైదరాబాద్‌కు చెందిన బయోటెక్ స్టార్టప్ 3కజిన్‌ల్యాబ్స్ ఒప్పందం కుదుర్చుకున్నాయి. తిరువనంతపురంలో సీఎస్ఐఆర్ డైరెక్టర్ డాక్టర్ సి.ఆనందరామకృష్ణన్, 3సీఎల్ ఎండీ పి.శ్రీనివాస్ ఈ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. పండ్ల గుజ్జు, రసాల నుంచి ఇథనాల్ ఉత్పత్తి చేసే ప్రక్రియను వాణిజ్యపరంగా విస్తరించేందుకు 150-200 లీటర్ల సామర్థ్యంతో పైలెట్ ప్రాజెక్టు నిర్వహించనున్నారు. వృథా అయ్యే పండ్లకు విలువ చేకూర్చడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం కల్పించడమే కాకుండా, కేంద్ర ప్రభుత్వ ఇథనాల్ కలిపిన పెట్రోల్ కార్యక్రమానికి ఇది దోహదం చేస్తుందని అధికారులు పేర్కొన్నారు.




## మారుతీ సుజుకీ నూతన ప్లాంటు ప్రారంభం

**వర్చువల్‌గా పాల్గొన్న భారత్, జపాన్ ప్రధానులు**

**న్యూఢిల్లీ::** మారుతీ సుజుకీ ఇండియా హరియాణాలోని ఖర్కోడాలో ఏర్పాటు చేసిన నాలుగో తయారీ కేంద్రాన్ని మన దేశ ప్రధాని నరేంద్ర మోదీ, జపాన్ ప్రధాని సనాయే తకాయిచి ప్రారంభించారు. దిల్లీలో జరిగిన భారత్-జపాన్ సంయుక్త ఆర్థిక వేదిక నుంచి ఇద్దరు నేతలు ఈ ప్లాంటును దృశ్యమాధ్యమ పద్ధతిలో (వర్చువల్‌గా) ప్రారంభించారు. సభనుద్దేశించి సుజుకీ మోటార్ కార్పొరేషన్ డైరెక్టర్, అధ్యక్షుడు తోషిహిరో సుజుకీ మాట్లాడుతూ కంపెనీ నిర్మించిన అత్యంత అధునాతన కార్ల తయారీ కేంద్రం ఇది అని పేర్కొన్నారు. ప్రస్తుతం ఏడాదికి 5 లక్షల వాహనాల తయారీ సామర్థ్యంతో నిర్మించగా, క్రమంగా 10 లక్షల వాహనాలకు పెంచడం ద్వారా ఈ ప్లాంటు ప్రపంచంలోనే అతిపెద్ద కార్ల తయారీ కేంద్రాల్లో ఒకటిగా నిలవనుందని.. భారత్-జపాన్ భాగస్వామ్యం-మేకిన్ ఇండియా చొరవకు నిదర్శనమని తెలిపారు.

## ఆధార్ యాప్‌లో ఉచితంగా ఇ-మెయిల్ అప్‌డేట్..

**దిల్లీ:** ఆధార్ యాప్‌లో ఉచిత ఇ-మెయిల్ అప్‌డేట్ సదుపాయాన్ని భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆధార్ కేంద్రానికి వెళ్లకుండానే ఈ సదుపాయాన్ని పౌరులు వినియోగించుకోవచ్చు. జులై 1 నుంచి ఆరు నెలల పాటు ఈ సదుపాయం అందుబాటులో ఉంటుందని ఉడాయ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొంది. కొత్తగా ఇ-మెయిల్ యాడ్ చేయాలనుకునేవారు లేదా మార్చుకోవాలనుకునేవారు ఆధార్ యాప్‌లో ఉచితంగా లభిస్తున్న ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని ఉడాయ్ కోరింది. ఈ సేవలు అందుబాటులోకి వచ్చిన రెండ్రోజుల్లోనే సుమారు రెండున్నర లక్షల మంది తమ ఇ-మెయిల్ ఐడీని అప్‌డేట్ చేసుకున్నారని తెలిపింది. ఆధార్‌తో ఇ-మెయిల్‌ను అప్‌డేట్ చేసుకోవడం ద్వారా ఆధార్ అథంటికేషన్ రిక్వెస్టులు వచ్చినప్పుడు రియల్‌టైమ్ అలర్టులు పొందొచ్చని పేర్కొంది. మరోవైపు, ఆధార్ మొబైల్ యాప్ లాంచ్ అయిన ఐదు నెలల్లోనే దీన్ని 3.1 కోట్ల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. కొత్త మొబైల్ యాప్ ద్వారా ఇప్పటివరకు 40 లక్షల మంది తమ మొబైల్ నంబర్‌ను అప్‌డేట్ చేసుకున్నారని, సుమారు 10 లక్షల మంది అడ్రస్‌ను అప్‌డేట్ చేసుకున్నారని ఉడాయ్ తెలిపింది.



**ఇ-మెయిల్ ఎలా అప్‌డేట్ చేయాలి?**

లేటెస్ట్ ఆధార్ యాప్‌లో లాగిన్ అవ్వండి. సర్వీసెస్ విభాగంలోకి వెళ్లి ఇ-మెయిల్ ఐడీ ఆప్షన్ ఎంచుకోండి. మీ ఇ-మెయిల్ ఐడీని ఎంటర్ చేయండి. ఆపై మీ మెయిల్‌కు వచ్చే ఓటీపీని ఎంటర్ చేయండి. ఫేస్ అథంటికేషన్ పూర్తి చేయడంతో అప్‌డేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. భవిష్యత్ అవసరాల కోసం ఎక్‌నాలెడ్జ్‌మెంట్ స్లిప్ డౌన్‌లోడ్ చేసి పెట్టుకోండి.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
4 జూలై 2026



# చిన్నారి కిడ్నాప్ కేసులో అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్

## సైబరాబాద్ పోలీసుల చొరవతో తల్లి ఒడికి చేరిన నెలవయసు బాలిక

- కోల్కతా నుంచి వచ్చిన ముఠా సభ్యులు పట్టుబడ్డారు
- 30 రోజుల్లోనే దర్యాప్తు పూర్తి.. ముఠా నేర చరిత్ర విశ్లేషణ
- పోలీసులు మరిన్ని కేసులపై దర్యాప్తు

**శేరిలింగంపల్లి, జూలై 3 (జనం సాక్షి):** చిన్నపిల్లలను లక్ష్యంగా చేసుకొని కిడ్నాప్‌లకు పాల్పడుతూ సొమ్ము చేసుకుంటున్న అంతర్రాష్ట్ర ముఠాను సైబరాబాద్ పోలీసులు అపులోకి తీసుకొని గుట్టును రట్టు చేశారు. ఈ కేసులో నెలవయసు బాలికను కూడా సురక్షితంగా తల్లి ఒడికి అప్పగించారు.
సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. వికారాబాద్ జిల్లా శివరాం నగర్ కాలనీకి చెందిన మహమ్మద్ జుబేర్, రాజీవ్ గృహకల్ప ప్రాంతానికి చెందిన మహమ్మద్ ఇర్ఫాన్ ఆటో నడుపుకుంటూ శేరిలింగంపల్లి ప్రాంతంలో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో వీరికి కోల్కతా ప్రాంతానికి చెందిన సాధిక్ మక్సూద్, నిమ్మి జాన్ అలీ అలియాస్ సీమా అలీ, రెహనుమా అలీలతో కలిసి ఒక ముఠాగా ఏర్పడి చిన్న పిల్లలను కిడ్నాప్ చేయడం అలవాటుగా మార్చుకున్నారు. దీంతో కేసు నమోదు చేసుకున్న చందానగర్ పోలీసులు రామచంద్రాపురం డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సి.హెచ్. వై. శ్రీనివాస్ నేతృత్వంలో చందానగర్ ఇన్‌స్పెక్టర్ ఎస్. విజయ్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సీసీ ఫుటేజీలు, ఇతర సాంకేతిక ఆధారాల ద్వారా కుమ్మర దర్యాప్తును కొనసాగించి మూడు రోజుల వ్యవధిలో ఐదుగురు అంతర్రాష్ట్ర ముఠాను అదుపులోకి తీసుకొని నెలవయసు బాలికను స్వాధీనపరచుకోవడంతో పాటు ఆమె తల్లికి అప్పగించడం జరిగింది. పోలీసులు ప్రత్యేక దర్యాప్తును ముమ్మరం చేసి ఈ ముఠా నేర చరిత్రను విశ్లేషించడంతోపాటు ఇంతకుముందు మరేమైనా నేరాలకు పాల్పడ్డారా అన్న అంశాలపై సైతం దర్యాప్తును వేగవంతం చేస్తున్నట్లు సైబరాబాద్ సీపీ తెలియజేశారు.

# 15న ఇందిరాపార్క్ వద్ద ఉద్యోగాల భర్తీ కోసం సీపీఐ(ఎం) మహాధర్నా

## రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**ముషీరాబాద్ జులై 03 (జనం సాక్షి):**
కేంద్ర ప్రభుత్వ పరిధిలోని 60 లక్షల, తెలంగాణ ప్రభుత్వ పరిధిలోని 2 లక్షల ఖాళీ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న హైదరాబాద్ లోని ఇందిరాపార్క్ వద్ద సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తెలిపారు. నిరుద్యోగులంతా పెద్ద ఎత్తున పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ లోని ఎంబీ భవన్‌లో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య, టి.జ్యోతి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డిలతో కలిసి ఆయన మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి వంటి హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాయని విమర్శించారు. నిరుద్యోగుల పోరాటాలకు సీపీఐ(ఎం) పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. అలాగే పేదలకు ఇండ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 6న వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్.వీరయ్య మాట్లాడుతూ... ప్రజల మౌలిక సమస్యలను పట్టించుకోకుండా ప్రజల దృష్టిని మరల్చేందుకు రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్,




కాంగ్రెస్ నేతలు రాజకీయ డ్రామా ఆడుతున్నారని విమర్శించారు. రాజకీయ డ్రామాలకు అడ్డుకట్ట వేయాలనీ, అప్పులపై శ్వేతపత్రం విడుదల చేసి అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేసేది ఎర్రజెండా పార్టీలేనన్నారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడం వల్ల పేదలు తీవ్రంగా నష్టపోయారని విమర్శించారు. మతం, దేవుడి పేరుతో ఓట్లు సాధించి ప్రజా సమస్యలను గాలికొదిలేయడం బీజేపీకి అలవాటుగా మారిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ఈ నెల 15న జరిగే మహాధర్నాను నిరుద్యోగులు విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఓటరు జాబితా ప్రత్యేక సవరణలో బీఎల్‌ఓలు సమన్వయంతో పనిచేయాలి

### ఆర్డీఓ పార్ధసింహ రెడ్డి

**చేవెళ్ల, (జనంసాక్షి) :** చేవెళ్ల-53 అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని బీఎల్‌ఓలు సమర్థవంతంగా నిర్వహించాలని ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్ఓ) రెవెన్యూ డివిజనల్ అధికారి పార్ధ సింహ రెడ్డి సూచించారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయడంతో పాటు వీలైనంత వరకు అదే సమయంలో వాటిని సేకరించి డిజిటలైజేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. ఫారం-6 ద్వారా 25 సంవత్సరాలు పైబడిన వారి కొత్త ఓటరు దరఖాస్తులను గత నమోదు వివరాలు ధ్రువీకరి ంచిన తర్వాతే స్వీకరించాలని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్‌ఓలు సమన్వయంతో పనిచేసి ఓటరు జాబితా ఖచ్చితత్వాన్ని మెరుగుపరచాలని, ప్రజలు కూడా ఈ ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఆర్డీఓ విజ్ఞప్తి చేశారు.

## ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి:ఎంఈవో హరిలాల్

**బొంరాస్ పేట :** ప్రతి ఉపాధ్యాయుడు పాఠశాల సమయానికి చేరుకుని సమయపాలన పాటించాలని మండల విద్యాధికారి హరిలాల్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. గత సంవత్సరము కంటే ప్రస్తుత సంవత్సరం విద్యార్థుల అడ్మిషన్ల సంఖ్య పెంచేందుకు ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన, ఆన్లైన్ నమోదు, ఎఫ్ఆర్ఎస్ తదితర అంశాలపై సూచనలు చేశారు.

# ఓటర్ల వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలి

- ఎన్యుమరేషన్‌లో పొరపాట్లు లేకుండా చర్యలు
- బీఎల్‌ఓలు యాప్‌లో రెండుసార్లు సరిచూసి ఎంట్రీ
- ప్రజలు సహకరించి సరైన వివరాలు అందించాలి
- మరణించినవారు, నివాస మార్పులు సక్రమంగా నవీకరించాలి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జూలై 2 (జనం సాక్షి):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా ఓటర్ల నుంచి ఎన్యుమరేషన్ ఫారాల ద్వారా సేకరించిన వివరాలను బీఎల్‌ఓ యాప్‌లో స్పష్టంగా, ఖచ్చితంగా నమోదు చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎల్‌బి నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు వార్డుల్లో కొనసాగుతున్న ఇంటింటి ఎన్యుమరేషన్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, ఎల్‌బి నగర్ జోనల్ అధికారి వికాస్ మహతో తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన ఎన్నికల షెడ్యూల్ ప్రకా రం జిల్లాలో జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటి ఎన్యుమరేషన్ కార్యక్రమం కొనసాగుతోందని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తెలిపారు.
ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలను అందజేయడంతోపాటు ఆ వివరాలను వెంటనే బీఎల్‌ఓ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం ఓటర్లు పూర్తి చేసిన ఫారాలను సేకరించి, అందులో పొందుపరిచిన వివరాలను యాప్‌లో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా నమోదు చేయాలని ఆదేశించారు. ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు, నకిలీ నమోదులు లేదా అనర్హుల పేర్లు లేకుండా అత్యంత పారదర్శకంగా, విశ్వసనీయంగా ఓటరు జాబితాను రూపొందించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.
ఎన్నికల ప్రక్రియలో ఓటరు జాబితా అత్యంత కీలకమైన ఆధార పత్రంగా ఉంటుందని పేర్కొన్న కలెక్టర్, ప్రతి నమోదు నిబంధనలకు అనుగుణంగా ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మరణించిన ఓటర్ల పేర్లను సంబంధిత ఆధారాలతో తొలగించడం, ఒకే వ్యక్తికి రెండు లేదా అంతకంటే ఎక్కువ ఈపీఐసీ కార్డులు ఉన్నట్లయితే వాటిని గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవడం, నివాసం మారిన వారి వివరాలను సక్రమంగా నవీకరించడం వంటి అంశాలను అత్యంత బాధ్యతతో నిర్వహించాలని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాలను నింపే సమయంలో ఓటర్లు సరైన వివరాలను అందించాలని, అవసరమైన పత్రాలను జతచేయాలని, అధికారులు కోరిన సమాచారాన్ని పూర్తిగా అందించడం ద్వారా ఖచ్చితమైన ఓటరు జాబితా తయారీలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. బీఎల్‌ఓ యాప్‌లో నమోదయ్యే ప్రతి వివరాన్ని ఒకటికి రెండుసార్లు పరిశీలించి నమోదు చేయాలని, సాంకేతికపరమైన పొరపాట్లు, డేటా ఎంట్రీలో తప్పిదాలు, వివరాల లోపాలు చోటు చేసుకోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ను ప్రతి అధికారి, బీఎల్‌ఓ కచ్చితంగా పాటిస్తూ నిర్ణీత గడువులోపు ఎన్యుమరేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ఎన్నికల అధికారులు, ఎల్‌బి నగర్ మున్సిపల్ అధికారులు, బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) పాల్గొన్నారు.

# చదువు పేరుతో చిన్నారిపై దాడి!

## నారాయణ పాఠశాలపై తల్లిదండ్రుల ఆగ్రహం

- ఒకటో తరగతి విద్యార్థి ముఖంపై గాయాలు..
- ఉపాధ్యాయురాలిపై పోలీసులకు ఫిర్యాదు
- ఫీజుల దోపిడీతో పాటు విద్యార్థులపై దౌర్జన్యమా?




**నల్లగొండ ప్రతినిధి, జూలై 3 (జనం సాక్షి):**
నల్లగొండ జిల్లా కేంద్రంలోని నారాయణ కార్పొరేట్ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న ఆరేళ్ల చిన్నారిపై ఉపాధ్యాయురాలు దాడి చేశారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఈ ఘటనలో బాలుడి ముఖంపై గాయాల ముద్రలు ఏర్పడ్డాయని తల్లిదండ్రులు ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.
బాధితుడు సట్టు అనిల్ కుమార్ రెండో కుమారుడు శ్రీయన్ష్. ప్రస్తుతం అతడు ఒకటో తరగతి చదువుతున్నాడు. ఇప్పటికే ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న తమ కుమారుడిని ఉపాధ్యాయురాలు ముఖంపై బలంగా కొట్టారని, దీంతో గాయాల ముద్రలు ఏర్పడ్డాయని తల్లిదండ్రులు తెలిపారు. ఇది మొదటిసారి కాదని, ఇదే పాఠశాలలో చదువుతున్న తమ పెద్ద కుమారుడు సాత్విక్‌పై కూడా గతంలో ఓ ఉపాధ్యాయుడు చేయి చేసుకున్నారని వారు ఆరోపించారు. అప్పట్లో యాజమాన్యాన్ని ప్రశ్నించినా సరైన చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. తాజాగా మరో కుమారుడిపై కూడా దాడి జరగడంతో కుటుంబ సభ్యులతో కలిసి పాఠశాలకు వెళ్లి యాజమాన్యాన్ని నిలదీశారు. పిల్లవాడు చదువులో వెనుకబడితే తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలే తప్ప, శారీరకంగా దాడి చేసే హక్కు ఎవరికీ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**పోలీసులకు ఫిర్యాదు**
చిన్నారిపై దాడి చేసిన ఉపాధ్యాయురాలితో పాటు బాధ్యత వహించాల్సిన పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు నల్లగొండ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

**విద్యాశాఖ స్పందించాలన్న డిమాండ్**
కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లతో పాటు విద్యార్థులపై దౌర్జన్యాల ఆరోపణలు పెరుగుతున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జిల్లా విద్యాశాఖ అధికారులు వెంటనే విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# అనస్తీషియాలజీ కేవలం ఆపరేషన్లకే కాదు.. అత్యవసర వైద్యంలోనూ కీలకం

- రాష్ట్ర స్థాయి మహాసదస్సు, వర్క్‌షాప్‌లు
- 250 మంది పీజీ వైద్యులు పాల్గొన్నారు
- ఆధునిక సాంకేతికతపై ప్రత్యేక శిక్షణ
- క్రిటికల్ కేర్, పెయిన్ మేనేజ్‌మెంట్‌పై చర్చ



**కరీంనగర్ బ్యూరో, జూలై 3 (జనం సాక్షి):** అనస్తీషియాలజీ అనేది కేవలం ఆపరేషన్ థియేటర్‌కే పరిమితం కాదని, అత్యవసర వైద్యం, క్రిటికల్ కేర్, పెయిన్ మేనేజ్‌మెంట్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ తదితర విభాగాల్లో అనస్తీషియాలజిస్టుల పాత్ర అత్యంత కీలకమని రాష్ట్ర అనస్తీషియాలజిస్టుల సంఘం అధ్యక్షుడు డా. దేవులపల్లి ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం కరీంనగర్‌లోని ఐఎంఏ హాల్‌లో రాష్ట్ర స్థాయి అనస్తీషియాలజిస్టుల మహాసదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సదస్సు ఉత్సాహంగా ప్రారంభమైంది. 'విజిలెన్స్ - ఇన్నోవేషన్ - పేషెంట్ సెంటర్డ్ ఎవిడెన్స్ బేస్డ్ ప్రాక్టీస్' ప్రధానాంశంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ డా. ఎనమల్ల నరేష్ తెలిపారు. సాంప్రదాయ ఉపన్యాసాలకు భిన్నంగా నగరంలోని రెనే, సన్‌రైజ్, ప్రతిమ, చల్మెడ ఆస్పత్రుల్లో ఏకకాలంలో ఐదు ప్రత్యేక వర్క్‌షాప్‌లు ఏర్పాటు చేశారు. మెకానికల్ వెంటిలేషన్, క్రిటికల్ కేర్, హీమోడైనమిక్ మానిటరింగ్, అల్ట్రాసౌండ్ గైడెడ్ రీజినల్ నర్వ్ బ్లాక్స్‌తో పాటు కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం పై జాతీయ, రాష్ట్ర స్థాయి నిపుణులు వైద్యులకు ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చారు. ఈ వర్క్‌షాప్‌లలో వివిధ మెడికల్ కళాశాలల నుంచి సుమారు 250 మంది పీజీ వైద్యులు పాల్గొన్నారు. సదస్సుకు స్పాట్ రిజిస్ట్రేషన్లతో కలిపి సుమారు వెయ్యి మంది ప్రతినిధులు హాజరవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మహాసదస్సుకు ముఖ్య అతిథిగా కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీ డా. కె. రమేష్ రెడ్డి, గౌరవ అతిథులుగా ఎమ్మెల్యే కాంపల్లి సత్యనారాయణ, ప్రతిమ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ డైరెక్టర్ డా. బోయినపల్లి హరిణి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం. తకీయుద్దీన్ ఖాన్ హాజరవుతారు. ఈ కార్యక్రమంలో ఐఎస్ఏ తెలంగాణ కార్యదర్శి డా. బి. వెంకటేశ్వర రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డా. కె. మహేశ్వర్ రెడ్డి, ట్రెజరర్ డా. టి. ఓంప్రసాద్, కేఎస్ఏ-కేఎన్ఆర్ అధ్యక్షుడు డా. బి. వినయ్ కుమార్, సైంటిఫిక్ కమిటీ చైర్మన్ డా. నిఖిల్ ముద్గల్కర్, కార్యదర్శి డా. పి. వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఏఐఎస్ జిపిఎఫ్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు

## ఏఐఎస్ జిపిఎఫ్ సమావేశాల ఆహ్వాన సంఘం

**ముషీరాబాద్, జూలై 03 (జనం సాక్షి):**
ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ జిపిఎఫ్) జాతీయ కౌన్సిల్ సమావేశాలు ఈ నెల 6, 7 తేదీల్లో హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనున్నట్లు, రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి పెన్షనర్లు పెద్ద సంఖ్యలో హాజరై బహిరంగ సభను విజయవంతం చేయాలని సమావేశాల ఆహ్వాన సంఘం అధ్యక్షులు డా. లింగ అరుణ, కన్వీనర్ డా. బి. స్వరాజ్ కుమార్, కోశాధికారి ఎస్.వై. కొండలరావు లు పెన్షనర్లకు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఈ సమావేశాలకు తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టాప్రా) ఆతిథ్యం ఇవ్వనుందనీ, దేశంలోని 15 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో దేశవ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్ర కార్యాచరణ రూపొందించనున్నారనీ, ముఖ్యంగా వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య పథకాలపై సమీక్ష నిర్వహించి, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఒక సమగ్ర ఆరోగ్య పథకం ఎలా ఉండాలనే అంశంపై తీర్మానాలు చేయనున్నారన్నారు. అలాగే సీపీఎస్‌కు బదులుగా పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడం, కమ్యూటేషన్ రికవరీ కాలాన్ని 15 సంవత్సరాల నుంచి 11 సంవత్సరాలకు తగ్గించడం, పదవీ విరమణ అనంతరం పెన్షనర్లకు గౌరవప్రదమైన జీవనం కల్పించే చర్యలపై చర్చించనున్నట్లు వెలిబుచ్చారు. సమావేశాల ముగింపు సందర్భంగా ఈ నెల 7న మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ సభలో ఏఐఎస్ జీపీఎఫ్ జాతీయ అధ్యక్షులు సురేంద్ర చౌదరి, ప్రధాన కార్యదర్శి వజీర్ సింగ్, కోశాధికారి అరుణ ఘోష్, ఏ. శ్రీకుమార్‌తో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రజాసంఘాల నాయకులు ఎం. జగదీశ్వర్, ఇ. శ్రీనివాసరావు, ఎండి. ముజీబ్, చావా రవి, ఎంఎస్ రెడ్డి తదితరులు పాల్గొని పెన్షనర్లను ఉద్దేశించి ప్రసంగించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో టాప్ర అధ్యక్షులు పి. నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి. కృష్ణమూర్తి, జి. అశోక్, రామచంద్రుడు, ఎం. కృష్ణారావు, ఎస్. రమేష్, జి. నర్సింగరావు, సి. కమల కుమారి, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

# బ్రిక్స్ దేశాల కార్మిక సంఘాల సహకారం మరింత బలోపేతం కావాలి

## 12వ వేతన కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలి : బండారు దత్తాత్రేయ

- సింగరేణికి రూ.56 వేల కోట్ల బకాయిలు తక్షణం విడుదల
- కార్పొరేట్ మెడికల్ బోర్డును యథావిధిగా కొనసాగించాలి
- కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం బీఎంఎస్ కృషి




**గోదావరిఖని, జూలై 3 (జనం సాక్షి):** బ్రిక్స్ దేశాల మధ్య కార్మిక సంఘాల సహకారం మరింత బలోపేతం కావాలని, ప్రపంచ కార్మిక రంగంలో వస్తున్న మార్పులను ఎదుర్కొనేందుకు అంతర్జాతీయ స్థాయిలో సమన్వయం అవసరమని హర్యానా మాజీ గవర్నర్, కేంద్ర మాజీ కార్మిక, ఉపాధి శాఖ మంత్రి బండారు దత్తాత్రేయ అన్నారు.
రామగుండం ఏరియా-1లోని ఏరియా వర్క్‌షాప్‌లో సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) ఆధ్వర్యంలో 12వ వేతన ఒప్పందం (జేబీసీసీఐ-12) కమిటీ ఏర్పాటులో జరుగుతున్న జాప్యానికి నిరసనగా కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన నిర్వహించారు. అనంతరం యాజమాన్యానికి డిమాండ్లతో కూడిన మెమోరాండం సమర్పించారు. బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి సత్తయ్య మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా బొగ్గు గని కార్మికులు ఎదురుచూస్తున్న 12వ వేతన కమిటీ ఏర్పాటులో జాప్యం కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి కలిగిస్తోందని అన్నారు. కోల్ ఇండియా, సింగరేణి యాజమాన్యాలు ఎలాంటి ఆలస్యం లేకుండా కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలు పంపి వెంటనే కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణికి ట్రాన్స్‌కో, జెన్‌కోలు చెల్లించాల్సిన రూ.56 వేల కోట్ల బకాయిలను తక్షణం విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ బకాయిలు చెల్లించకపోవడం వల్ల సంస్థ ఆర్థిక పరిస్థితి దెబ్బతింటోందని విమర్శించారు. కార్మికుల వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే కార్పొరేట్ మెడికల్ బోర్డు సమావేశాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఏరియా ఉపాధ్యక్షుడు కర్రావుల మహేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పిట్ కార్యదర్శి తుమ్మ గట్టయ్య, నాయకులు దిశెట్టి అంజయ్య, కొప్పుల సత్యనారాయణ, కటకం సురేష్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో కార్మికులు హాజరై 12వ వేతన కమిటీ వెంటనే ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు.

# అన్నదాతకు భరోసా.. ఖాతాల్లోకి కాసులు

- ఖమ్మం జిల్లాలో జోరుగా పెట్టుబడి సాయం పంపిణీ
- జిల్లాలో 3.17 లక్షల మంది రైతులకు లబ్ధి
- బ్యాంకు ఖాతాల్లో రూ. 306.34 కోట్లు జమ



**ఖమ్మం, (జనంసాక్షి) :** ఖమ్మం జిల్లావ్యాప్తంగా వానాకాలం పంట పెట్టుబడి కోసం ఎదురుచూస్తున్న అన్నదాతలకు ప్రభుత్వం పెద్ద ఊరటనిచ్చింది. ఐదు ఎకరాల లోపు భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతుల ఖాతాల్లోకి 'రైతు భరోసా' నిధులు నేరుగా వచ్చి చేరుతున్నాయి. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధిలో అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లోకి డబ్బులు జమ అవుతుండడంతో సాగు పనుల్లో వేగం పెరగనుంది. జిల్లావ్యాప్తంగా మొత్తం 3 లక్షల 17 వేల 219 మంది రైతులకు గాను రూ. 306.34 కోట్ల భారీ మొత్తాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. సకాలంలో పెట్టుబడి చేతికి అందడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**మధిరలోనే అత్యధికం.. ఇల్లందులో అత్యల్పం**
జిల్లాలో నియోజకవర్గాల వారీగా నిధుల పంపిణీ జోరుగా సాగింది. మధిర నియోజకవర్గంలో అత్యధికంగా 83,580 మంది రైతులకు రూ. 79.09 కోట్లు అందాయి. సత్తుపల్లిలో 79,338 మంది రైతులకు రూ. 74.87 కోట్లు, పాలేరులో 74,981 మంది రైతులకు రూ. 68.68 కోట్లు చొప్పున వారి ఖాతాల్లో జమ అయ్యాయి. అలాగే వైరా నియోజకవర్గంలో 60,842 మంది రైతులకు రూ. 65.10 కోట్లు, ఖమ్మం నియోజకవర్గంలో 17,272 మంది రైతులకు రూ. 17.58 కోట్లు వచ్చాయి. ఇల్లందు నియోజకవర్గం పరిధిలోకి వచ్చే జిల్లా రైతుల్లో 1,199 మందికి రూ. 1.02 కోట్లు చొప్పున పెట్టుబడి సాయం అందింది.

**రైతుల ఖాతాల్లోకి నేరుగా డబ్బులు**
**ధనసరి పుల్లయ్య, జిల్లా వ్యవసాయ అధికారి**




జిల్లాలో ఐదు ఎకరాల లోపు ఉన్న రైతులందరికీ వానాకాలం రైతు భరోసా డబ్బులు అందుతున్నాయి. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 3.17 లక్షల మందికి పైగా రైతుల ఖాతాల్లో రూ. 306.34 కోట్లు వేయడం జరిగింది. సాంకేతిక సమస్యల వల్ల ఎవరికైనా డబ్బులు పడకపోతే, కంగారు పడకుండా ఆధార్, బ్యాంకు పాస్ పుస్తకాలతో స్థానిక వ్యవసాయ అధికారులను కలవాలి. అర్హులైన ప్రతి ఒక్కరికీ సాయం అందుతుంది.

# ఫుడ్ సేఫ్టీ నిబంధనలు కట్టుదిట్టంగా అమలు

- పెద్దపల్లి జిల్లాలో హోటళ్లు, రెస్టారెంట్లపై కఠిన చర్యలు
- అపరిశుభ్రతకు తాత్కాలిక మూసివేతలు
- నిబంధనలు ఉల్లంఘించేవారికి ఎలాంటి ఉపేక్ష లేదు
- ప్రజారోగ్యం కాపాడటమే లక్ష్యం

**గోదావరిఖని, జూలై 2 (జనం సాక్షి):** జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లలో ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందేలా ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష స్పష్టం చేశారు.
ఆహార పదార్థాల నిల్వ, తయారీ, పరిశుభ్రత, వడ్డింపు వంటి అన్ని అంశాల్లో ఫుడ్ సేఫ్టీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. హోటళ్లు, రెస్టారెంట్లలో పనిచేసే సిబ్బందికి ఆహార భద్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని, వినియోగదారుల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న హోటళ్లు, రెస్టారెంట్లను తాత్కాలికంగా మూసివేసి, అవసరమైన లోపాలను సరిదిద్దిన అనంతరం మాత్రమే తిరిగి నిర్వహణకు అనుమతులు ఇస్తున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజారోగ్య పరిరక్షణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించారు.
మే 29న మంథని మార్కెట్ ప్రాంతంలోని శ్రీ సాయి ఫ్యామిలీ రెస్టారెంట్ అండ్ మెస్, జూన్ 13న గోదావరిఖనిలోని డెస్టినేషన్ రెస్టారెంట్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో అపరిశుభ్రత, నిబంధనల ఉల్లంఘనలను గుర్తించి ఆయా రెస్టారెంట్లను తాత్కాలికంగా మూసివేశారు. తదనంతరం ఆయా సంస్థల నిర్వాహకులు పరిశుభ్రత, ఆహార భద్రత ప్రమాణాలకు అనుగుణంగా అవసరమైన మార్పులు చేపట్టడంతో, ఫుడ్ సేఫ్టీ అధికారుల పునఃపరిశీలన అనంతరం శ్రీ సాయి ఫ్యామిలీ రెస్టారెంట్ అండ్ మెస్‌కు జూన్ 4న, డెస్టినేషన్ రెస్టారెంట్‌కు జూన్ 30న తిరిగి కార్యకలాపాలు ప్రారంభించేందుకు అనుమతులు జారీ చేశారు.
జిల్లాలోని ఇతర హోటళ్లు, రెస్టారెంట్లలో కూడా ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, ఎక్కడైనా అపరిశుభ్రత లేదా నిబంధనల ఉల్లంఘన గుర్తించిన వెంటనే సంబంధిత సంస్థలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. హోటల్, రెస్టారెంట్ నిర్వాహకులు ఫుడ్ సేఫ్టీ నిబంధనలను తూచా తప్పకుండా పాటించి ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.




# కొండను కొల్లగొడుతున్న మట్టి మాఫియా

## నర్సిగాపూర్‌లో పగలు, రాత్రి అక్రమ మట్టి రవాణా

- నర్సింగాపూర్‌లో పగలు రాత్రి అక్రమ మట్టి రవాణా
- అధికారులు చూసి చూడనట్లు.. ప్రజాప్రతినిధుల అండ
- ప్రకృతి సంపద నాశనం.. రోడ్లు గుంతల అమాయం
- అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్
- మండిపడుతున్న ప్రజలు



జగిత్యాల జిల్లా క్రైమ్, జూలై 2 (జనం సాక్షి): జగిత్యాల జిల్లా నరసింగాపూర్ గ్రామంలో ఇటిక బట్టీల సమీపంలో ఉన్న గుట్టను పలువురు ప్రజాప్రతినిధుల అండదండలతో అక్రమంగా తవ్వి మట్టి, మొరం రవాణా యథేచ్ఛగా సాగుతోంది. 2.10 ప్రోక్లైన్ మిషన్లతో గుట్టను త్రవ్వి టిప్పర్ల ద్వారా రోజూ వేల టన్నుల మట్టిని తరలిస్తున్నారు. ఈ అక్రమ దందాకు సంబంధిత అధికారులు కనీసం స్పందించడం లేదని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో నరసింగాపూర్ ఇటిక బట్టీ సమీపంలో సాంకేతిక ఇబ్బందులు తలెత్తడంతో సీనియర్ నాయకులు జీవన్ రెడ్డి ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ పక్కనే ఉన్న గుట్టను అభివృద్ధి పనుల పేరిట వేల సంఖ్యలో టిప్పర్ల ద్వారా అక్రమంగా తవ్వి మట్టిని రవాణా చేస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పేరిట అనుమతి లేకుండా పగలు రాత్రి తేడా లేకుండా ఈ దందా కొనసాగుతోంది. అధిక లోడుతో టిప్పర్లు వెళ్లడం వల్ల ప్రభుత్వ ఆదాయంతో నిర్మించిన రోడ్లు గుంతల అమాయంగా మారి ఇనుప చువ్వలు బయటపడుతున్నాయి. ఎస్సారెస్పీ కాకతీయ కాలువను ఆనుకొని ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద లారీలను నిలిపివేయడం వల్ల ప్రమాదాలు పొంచి ఉన్నాయి. గుట్టపై ఉన్న టేకు, వేప, తదితర చెట్లను నరికివేసి ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. మూగ జీవాలు, పక్షులు, సరిస్పృపాల మనుగడ కష్టంగా మారిందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలువురు ఓవర్ స్పీడ్‌తో వెళ్తున్న టిప్పర్ల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. గతంలో పలు ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించడం లేదని, రాజకీయ నాయకుల అండదండలతో ఈ దందా కొనసాగుతోందని ఆరోపిస్తున్నారు. అక్రమ మట్టి రవాణా చేస్తున్న వారిపై విజిలెన్స్, ఇంటెలిజెన్స్ బృందాలు పర్యవేక్షణ చేసి సంబంధిత మిషన్లను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

## నిరుద్యోగ యువత స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలి

- టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీనుబాబు
- సమైర ఎనర్జీ సొల్యూషన్స్ ను ప్రారంభించిన శ్రీనుబాబు



మంథని, జూలై 2 (జనం సాక్షి): నిరుద్యోగ యువత స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలని టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీనుబాబు అన్నారు. మంథని పట్టణంలో సూరయ్యపల్లి గ్రామానికి చెందిన నిరుద్యోగి ఆర్ల వినీత్ నెలకొల్పిన సమైర ఎనర్జీ సొల్యూషన్స్ ను టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి పై దృష్టి సారించాలని అన్నారు. నిరుద్యోగ యువతీ యువకుల కోసం ప్రభుత్వం రాయితీపై రుణాలు అందిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆర్ల వినీత్ ను శ్రీనుబాబు అభినందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ సహేందర్ రెడ్డి, ప్రముఖ న్యాయవాది చంద్రుపట్ల రమణ కుమార్ రెడ్డి, విద్యుత్ నియంత్రణ మండలి సభ్యులు శశి భూషణ్ కాచే, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, సూరయ్య పల్లి సర్పంచ్ ఆర్ల నాగరాజు, నాయకులు సిగ్గెం రాజేష్, అజీమ్ ఖాన్, పెరవీణ లింగయ్య యాదవ్, నూకల కమల్, ఎరుకల ప్రవీణ్, సాదుల శ్రీకాంత్, ఎరుకల రమేష్ బాబు, ఆరెల్లి కిరణ్ గౌడ్, జంజర్ల రాజు, ఆర్ల వెంకన్న, చెరుకుతోట రమేష్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలలో ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేసి ప్రతి ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

**టిపిసిసి సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి చామల రఘుపతి రెడ్డి**

మోమిన్ పేట జూలై 03 ( జనం సాక్షి) గ్రామంలో ఎస్ఐఆర్ కార్యక్రమంలో జరుగుతున్న ప్రక్రియలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకొని భారత పౌరునిగా నిలవాలని టీపిసిసి సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి చామల రఘుపతి రెడ్డి పేర్కొన్నారు శుక్రవారం మండలంలోని బూరుగుపల్లి, బాల్ రెడ్డిగూడెం, గ్రామాలలో ఎస్ఐ ఆర్ దరఖాస్తులను పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో ఓటు హక్కు ప్రతి ఒక్క పౌరులకు అవసరమని అట్టి ఓటు హక్కును కాపాడుకోవడానికి యువతి యువకులు స్థానిక బిఎల్ఓలకు సహకారం అందించి తమ ఓటు హక్కును భద్రపరచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమం లో మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు కోసిగి సురేందర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండిసి రాజుద్దీన్, బూరుగుపల్లి గ్రామ సర్పంచ్ పట్లోళ్ల వరప్రసాద్ రెడ్డి, బాల్ రెడ్డి గూడెం గ్రామ సర్పంచ్ అనంతరెడ్డి, ఆయా గ్రామాల వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

## సింగరేణి విశ్రాంత ఉద్యోగుల కోల్‌మైన్స్ పెన్షన్‌లో జాప్యం

- నోడల్ బ్యాంక్ ఎస్బిఐ ధన్‌బాద్ తక్షణమే చర్యలు తీసుకోవాలి
- సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్

గోదావరిఖని, జనంసాక్షి : సింగరేణి సంస్థలో దశాబ్దాల పాటు సేవలందించిన వేలాది మంది విశ్రాంత ఉద్యోగులకు గత కొన్ని నెలలుగా కోల్ మైన్స్ పెన్షన్ సకాలంలో జమ కాకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ ఒక ప్రకటనలో తెలిపారు. కోల్ మైన్స్ పెన్షన్ స్కీమ్ ప్రకారం ప్రతి నెల 1వ తేదీన నోడల్ బ్యాంకుగా వ్యవహరిస్తున్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ధన్‌బాద్, ఝార్ఖండ్ నుండి దేశవ్యాప్తంగా ఉన్న బొగ్గు గని పెన్షనర్ల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు పెన్షన్ జమ కావాల్సి ఉందని ,కానీ గత కొన్ని నెలలుగా నిర్ణీత తేదీన పెన్షన్ జమ కాకపోవడంతో సింగరేణితో పాటు దేశంలోని వేలాది మంది బొగ్గు గని పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. పెన్షన్ ఒక్కటే జీవనాధారంగా ఉన్న వృద్ధులు మందులు, వైద్య చికిత్సలకు డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నారని, కుటుంబ నిర్వహణ, విద్యుత్ బిల్లులు, బ్యాంకు రుణాల చెల్లింపులు ఆలస్యం అవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రతి నెలా పెన్షన్ ఆలస్యం వల్ల ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆయన పేర్కొన్నారు. కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్, నోడల్ బ్యాంక్ ఎస్.బి.ఐ ధన్‌బాద్, బొగ్గు మంత్రిత్వ శాఖ సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.

ప్రతి నెల 1వ తేదీనే దేశవ్యాప్తంగా ఉన్న పెన్షనర్ల ఖాతాల్లో పెన్షన్ జమ అయ్యేలా శాశ్వత చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గత కొన్ని నెలలుగా పెన్షన్ చెల్లింపులు ఎందుకు ఆలస్యం అవుతున్నాయో అధికారికంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు.

భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా సమర్థవంతమై న వ్యవస్థ ను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పెన్షనర్ల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత అధికారులు మానవతా దృక్పథంతో స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన ఒక ప్రకటన లో డిమాండ్ చేశారు.

## ఇందిరా మహిళా శక్తితో ఆర్థిక ప్రగతి

- ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లతో ఎస్ హెచ్ జీ మహిళల ఉపాధికి మార్గం
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



రాజన్న సిరిసిల్ల బ్యూరో, జూలై 03(జనం సాక్షి); ఇందిరా మహిళా శక్తి యూనిట్లు మహిళా సంఘాల ఆర్థిక ప్రగతికి దోహదపడుతున్నాయని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కింద తంగళ్ళపల్లి మండల కేంద్రంలో స్వయం సహాయక సంఘాల (ఎస్ హెచ్ జీ) మహిళలు వెంకటసాయి కోల్డ్ ప్రెస్ ఆయిల్ ఉ ఫ్లోర్ మిల్ యూనిట్, కోవిదా మిల్క్ పాయింట్ ఏర్పాటు చేసుకోగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం ప్రారంభించారు. వాటి పని తీరు, ఉపాధి, ఆదాయం తదితర వివరాలను మహిళలను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇందిరా మహిళా శక్తి కింద రెండు యూనిట్లు ప్రారంభించామని తెలిపారు. ఒక యూనిట్లో కోల్డ్ ప్రెస్సింగ్ ఆయిల్, పిండి గిర్ని, ఇతర దాదాపు ఆరు యంత్రాలు ఏర్పాటు చేశారని తెలిపారు. దాదాపు రూ. 11 లక్షల 50 వేలతో యూనిట్ ప్రారంభించారని వివరించారు. దీనికి పీ ఎం ఎఫ్ ఎం ఈ కింద రూ. 3 లక్షల 50 వేల సబ్సిడీ అందుతుందని వెల్లడించారు. అలాగే మరో మహిళ డైరీ యూనిట్‌ను ఏర్పాటు చేసుకున్నారని, దీనికి మహిళా సంఘాల నుంచి దాదాపు రూ. 5 లక్షల రుణం ఇప్పించామని తెలిపారు. ఇక్కడ ఇతర డైరీ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. జిల్లాలో ఇలాంటి మరిన్ని యూనిట్లు ఏర్పాటు చేసేందుకు మహిళలు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. యూనిట్లు ఏర్పాటు చేయడంతో ఉపాధితోపాటు మహిళా సాధికారతకు దోహదం చేస్తుందని వివరించారు. ఈనెల రెండవ తేదీన జరిగిన బ్యాంకర్ల సమావేశంలో ఇదే విషయంపై చర్చించి, మహిళా సంఘాలకు రుణాలు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. జిల్లాలోని గ్రామీణ మహిళా, పురుష అభ్యర్థులకు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ సిరిసిల్ల జిల్లా కేంద్రంలో (ఆర్ సేఠీ) ఆధ్వర్యంలో అందుబాటులో ఉందని వెల్లడించారు. శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలని, ఆర్థికంగా రాణించేందుకు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ మల్లికార్జున రావు, ఏఎంసీ వైస్ చైర్మెన్ నర్సింగం, ఇంచార్జి తహసీల్దార్ మురళి, ఇంచార్జి ఎంపీడీఓ రమేష్, ఎంపీఓ మీర్జా, సర్పంచ్ లక్ష్మీరాజం, తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ఎన్పిడీసీఎల్ కృషి చేస్తుంది

**సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి**



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూలై 3 (జనంసాక్షి) : జిల్లాలోని విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఎన్పీడీసీఎల్ కృషి చేస్తుందని సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. గురువారం వేములవాడ అర్బన్ మండలంలోని చింతల్టానలో ఏర్పాటు చేసిన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేములవాడ రూరల్ మండలంలోని వట్టెంల సబ్ స్టేషన్లో 3.15 కెవి ఉన్న కెపాసిటీని 5 కెవి కి పెంచడం జరిగిందన్నారు. వేములవాడ రాజన్న ఆలయం నుండి తిప్పాపూర్ బ్రిడ్జి వరకు చేపడుతున్న రహదారి వెడల్పుల భాగంగా ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చడానికి రూ1.45 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. దీంతో పనులు త్వరగా పూర్తి చేయడానికి వీలు పడుతుందన్నారు. జిల్లాలో 19 చోట్ల నాణ్యమైన విద్యుత్తు కెపాసిటీ పెంచడానికి చర్యలు తీసుకోగా, ఇప్పటికే 14 చోట్ల పూర్తయ్యాన్నారు. మిగతా చోట్ల త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. 34 చోట్ల కెపాసిటీ పెంచేందుకు ప్రతిపాదనలు పంపినట్లు అయన తెలిపారు. జిల్లావ్యాప్తంగా లూస్ లైన్ లో మిడ్ పోల్స్, తొలగించి కొత్త స్తంభాలు వేసేందుకు కూడా అనుమతులు మంజూరయ్యాన్నారు. అవసరం ఉన్నచోట కొత్త సబ్ స్టేషన్లు, అటవీ ప్రాంతంలో విద్యుత్ సమస్యలపై తీసుకోవాల్సిన చర్యలు, ఇతర అంశాలపై సిబ్బందితో చర్చించి నట్లు అయన తెలిపారు. ఆయన వెంట ఎస్ఇ వేణుమాధవ్, డీఈలు చంద్రమౌళి, వెంకటరమణ, భాస్కర్, ఏడీలు అనిల్, గంగాధర్, అరవింద్, జిల్లాలోని ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధి.. సంక్షేమమే మా ఎజెండా

**మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు**



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూలై 3 (జనంసాక్షి) : వేములవాడ పట్టణ అభివృద్ధి, సంక్షేమమే మా ఎజెండా అని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు. శుక్రవారం రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి 18వ వార్డులో ఆయన భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేములవాడ మున్సిపల్ పరిధిలో మొదటి విడతలో 500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా 80 శాతం నిర్మాణాలు పూర్తయి గృహప్రవేశాలు జరిగాయన్నారు. రెండో విడతలో కూడా మరో 500 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అనుమతులు రావడం జరిగిందన్నారు. ప్రజా ప్రభుత్వంలో గుడిసెలో నివసిస్తున్న వారికి మొదటి ప్రాధాన్యతగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అవుతున్నాయని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు వస్తాయన్నారు. ఇంటి జాగాలు లేని వారికి కూడా ఇల్లు నిర్మాణం కోసం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అధికారులతో కలిసి జాగలు పరిశీలిస్తున్నారని, వారికి కూడా ఇళ్ల నిర్మాణాలు త్వరలో చేపడుతామన్నారు. ఆయన వెంట కౌన్సిలర్లు కొండ శేఖర్, తోట రాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, కాంగ్రెస్ నాయకులు కూరగాయల కొమురయ్య, ఇప్పప్పుల అజయ్, రామతీర్థం హరీష్, అన్నారం శ్రీనివాసు, శ్రీనివాస్, రాము, బాబున్ పాల్గొన్నారు.

## రైజింగ్ రామగుండానికి మీ సేవలు అవసరం

**- రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**

గోదావరిఖని, జనంసాక్షి : మోటివేషన్‌లో ట్రైనింగ్ పూర్తి చేసి గోదావరిఖనికి వచ్చిన సందర్భంగా దేవి లక్ష్మి నరసయ్య, న్యాయవాది వరలక్ష్మిని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాగూర్ అభినందించారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ట్రైనర్లను అభినందించారు. వారి సేవా భావం, నిబద్ధత, కృషిని ప్రశంసించారు. మీలాంటి శిక్షకులు నవభారత నిర్మాణానికి, యువత సన్మార్గంలో నడవడానికి సూచనలు, సలహాలు, అవగాహన కార్యక్రమాలు కల్పించాలని ఆయన సూచించారు. రైజింగ్ రామగుండంకు మీలాంటి వాళ్లు అవసరమని, భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ ఆకాంక్షించారు.



## ప్లాస్టిక్ భూతాన్ని పారదోలుదాం

**కళాశాల ప్రిన్సిపల్ జై కిషన్ ఓజా**

గోదావరిఖని, జనంసాక్షి : ప్లాస్టిక్ భూతాన్ని పారదోలుదాం పర్యావరణాన్ని కాపాడుదాం అని కళాశాల ఎకో క్లబ్, ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ సంయుక్తంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జై కిషన్ ఓఝా పిలుపు నిచ్చారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్, హైదరాబాద్ వారు తెలంగాణ రాష్ట్రంలో ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలతో జూన్ నెల మూడవ తేదీన చేసుకున్న ఒప్పంద ప్రకారం - ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించుకోవడాన్ని ప్రోత్సహిస్తుందని పిలుపు నిచ్చారు. ఈ మిషన్ లో భాగంగా శుక్రవారం మన కళాశాలలో తొలి అడుగు పడిందన్నారు. పేపర్ ప్లేట్స్, ప్లాస్టిక్ ప్లేట్స్ అండ్ గ్లాసులు, వాటర్ బాటిల్స్ కి బదులుగా స్టీల్ ప్లేట్స్, స్టీల్ గ్లాసులు, స్టీల్ వాటర్ బాటిల్స్ ఉపయోగిస్తూ పర్యావరణ పరిరక్షణ కోసం పాటు పడతామని అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్సిసి క్యాడెట్స్, కళాశాల ఎకో క్లబ్ మెంబెర్స్ అందరూ కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఆచార్య జై కిషన్ ఓఝా స్టీల్ ప్లేట్స్, వాటర్ బాటిల్స్, గ్లాసులు స్వచ్ఛందంగా కొనుగోలు చేసి ఎకో క్లబ్ తరుపున వాటిని వితరణ చేశారు.

## భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం. కేజీబీవీ పాఠశాలలో ఖాళీలు

గన్నేరువరం, జూలై 03 (జనంసాక్షి): గన్నేరువరం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నందు విద్య సంవత్సరం 2026-2027 కు గాను ఫిజికల్ సైన్స్ లో బోధించుటకు ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయడానికి ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతూ కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కే. మధులత ప్రకటన జారీ చేశారు. దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: 04-07-2026 నుండి దరఖాస్తు చివరి తేదీ 06-07-2026 వరకు దరఖాస్తు స్వీకరణ సమయం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ఉంటుందని తెలిపారు. సంబంధిత డిగ్రీ అండ్ బీఈడీ తోపాటు టీఈటీ అర్హత కలిగి ఉండాలి. సందేహాలను నివృత్తి కోసం, సమాచారం కోసం కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కే. మధులత మొబైల్ నెంబర్: 8522080903 వారిని సంప్రదించవలసిందిగా మండల విద్యాధికారి కే. రామయ్య తెలిపారు.

## వీబీజీ రామ్ జీ స్కీమ్‌పై కాంగ్రెస్‌కు అక్కసు

- కరీంనగర్‌కు మరిన్ని నిధులు తెస్తా.. అభివృద్ధి చేస్తా : బండి సంజయ్
- బీజేపీ ఎదుగుతోందనే భయంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ మ్యాచ్ ఫిక్సింగ్
- సింగరేణి బొగ్గు మాయం విచారణకు రాష్ట్ర ప్రభుత్వం దమ్ము లేదా?
- డంపింగ్ యార్డ్ సమస్యలు తొలగిస్తాం



కరీంనగర్ బ్యూరో, జూలై 3 (జనం సాక్షి): వీబీజీ రామ్ జీ పథకం ద్వారా పేదలకు ఎంతగానో మేలు జరుగుతోందని, గ్రామాల్లో ఆస్తుల సృష్టి జరగబోతోందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఈ పథకాన్ని అమలు చేస్తే కేంద్రానికి మంచి పేరు వస్తుందని అక్కసుతోనే సుప్రీం కోర్టును ఆశ్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం దుర్మార్గమన్నారు. కరీంనగర్‌లోని 37వ డివిజన్‌లో రూ.77 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ, యూసీఎఫ్ నిధులపై మంత్రి పొన్నం చేసిన వ్యాఖ్యలు ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనమన్నారు. దేశవ్యాప్తంగా 17 ప్రాజెక్టులకు మాత్రమే యూసీఎఫ్ ఫండ్ ఇస్తే, కరీంనగర్ ఉందనే విషయం మర్చిపోతే ఎలా అని ప్రశ్నించారు.

సింగరేణి బొగ్గు మాయం విషయంలో తక్షణమే విచారణ జరపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లేఖ రాసినా ఎందుకు విచారణ జరపడం లేదని, రాష్ట్ర ప్రభుత్వానికి దమ్ము లేదా అని ప్రశ్నించారు. రాష్ట్రానికి చేతగాకపోతే కేంద్రాన్ని కోరితే విచారణ జరిపి దోషులను శిక్షించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ కేపీపీ చంద్రతో కలిసి 7వ డివిజన్‌లో ఓపెన్ జిమ్‌ను ప్రారంభించిన బండి సంజయ్ కుమార్, రాబోయే రోజుల్లో కరీంనగర్‌కు మరిన్ని నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. రూ.50 కోట్ల యూడీఎఫ్ నిధులతో రోడ్ల నిర్మాణం, రూ.840 కోట్ల యూసీఎఫ్ నిధులతో కరీంనగర్‌ను సుందరంగా తీర్చిదిద్దే పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు.

## అప్పులపై వాస్తవాలు చెబితే కేటీఆర్, హరీశ్‌కు అక్కసు

- 8 లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాళా తీయించారు : టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్
- టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌కు కరీంనగర్‌లో ఘన స్వాగతం



కరీంనగర్ బ్యూరో, జూలై 3 (జనంసాక్షి) : ఒక వివాహ వేడుకకు హాజరయ్యేందుకు కరీంనగర్ విచ్చేసిన టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కు చొప్పదండి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం వి-పార్క్ హోటల్ వద్ద ఘన స్వాగతం పలికారు. అనంతరం పీసీసీ అధ్యక్షులు కాంగ్రెస్ నేతలతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... రాష్ట్రంలో నేడు జరుగుతున్న తతంగాన్ని ప్రజలు చూస్తున్నారని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల విషయంలో ఉన్న వాస్తవాలు చెప్పినందుకు హరీష్ రావు, కేటీఆర్ అక్కసు వెళ్ళగకుతున్నారని తెలిపారు. 2023 కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నెలకు 60 వేల కోట్ల రూపాయలు గత ప్రభుత్వం చేసిన అప్పులకు వాయిదా పద్ధతిలో వడ్డీలు కడుతున్నామని, వాళ్ళు చేసినా అప్పు ఎనిమిది లక్షల కోట్ల పై ఉన్నవని తెలిపారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన బిఆర్ఎస్ కు మరొకసారి అధికారం ఇస్తే రాష్ట్రాన్ని కుదవ బెడతారని ప్రజలు బిఆర్ఎస్ ను గద్దె దింపినారని తెలిపారు. పదేళ్ల కాలంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ప్రభుత్వ ఉద్యోగాలతో ప్రజలకు ఎన్నో ఆశలు చూపించి మోసం చేస్తే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలు కన్న కళలను నెరవేరుస్తుందని, ప్రతి నియోజకవర్గంలో మూడు వేలకు పైగా ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తుందని, ఇప్పటివరకు దాదాపు 70 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను కల్పించడం జరిగిందని టీపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ తెలిపారు. బిఆర్ఎస్ హయాంలో నాలుగైదు వేల రూపాయలు కరెంటు బిల్లులు చెల్లిస్తే, మా ప్రభుత్వం 200 యూనిట్ల వరకు పేదలకు, మధ్యతరగతి ప్రజలకు ఉచిత విద్యుత్ అందిస్తుందని, పదివేల రుణమాఫీ మీరు చేయకపోతే మేము ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేయడం జరిగిందని, కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో లక్ష ఇరవై వేల కోట్ల రూపాయలను గోదావరి పాలు చేశారన్నారు. కరీంనగర్ జిల్లా సిరిసిల్లలో మీ కనుసన్నలలో నడిచిన ఇసుక మాఫియా, నేరెళ్ల బాధితులను సంసారానికి పనికిరాని విధంగా కొట్టిన తీరు నాకు తెలుసు, అడ్డుపడిన యువకులను పోలీసులతో కొట్టించిన సంఘటనలు తెలుసు, బిఆర్ఎస్ చేసిన ప్రతి నిర్వాకం ప్రజల మనసుల్లో ఉందని, ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపు ఆరు లక్షల కోట్ల విదేశీ పెట్టుబడిని తీసుకురావడం జరిగిందన్నారు.

11 సంవత్సరాల పైగా కేంద్రం ప్రభుత్వం అధికారంలో ఉన్న బిజెపి సామాన్యునికి ఏమి ఒరగ బెట్టిందని, రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని అధికారంలోకి వచ్చి ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారని పేర్కొన్నారు. ఈ రాష్ట్రంలో జరిగిన సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో మెజారిటీ ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు నిలిచినారని, రేపు జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాల్లో గెలుపు జెండా ఎగురవేసి మరొకసారి అధికారం చేపడతామని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మున్నూరు కాపు కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, కరీంనగర్ కార్పొరేషన్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఊట్కూరు నరేందర్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు ఆరేపల్లి మోహన్, హుజురాబాద్ నియోజకవర్గం ఒడితల ప్రణవ్, రాజన్న సిరిసిల్ల డిసిసి అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్లు ఆకుల నరసయ్య, మహేష్, వరాల నర్సింగం, ఆకుల ఉదయ్, కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేంద్ర నిధుల కేటాయింపులో పన్నుల వసూళ్లే పనితీరుకు కొలమానం కాకూడదు

- ఆదివాసీ, గిరిజన, మారుమూల, వెనుకబడిన జీపీలకు ప్రత్యేక వెసులుబాటు కల్పించాలి
- స్థానిక అవసరాల కోసం అన్‌టైడ్ గ్రాంట్లను కొనసాగించాలి
- 16వ ఆర్థిక సంఘం జాతీయ వర్క్‌షాప్‌లో తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తి



**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** 16వ ఆర్థిక సంఘం ప్రతిపాదించిన పనితీరు ఆధారిత గ్రాంట్లు, ఓన్ సోర్స్ రెవిన్యూ వంటి నిబంధనల్లో ఆదివాసి, గిరిజన, షెడ్యూల్డ్ ప్రాంతాలు, వెనుకబడిన గ్రామ పంచాయతీలకు ప్రత్యేక వెసులుబాటు కల్పించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క కోరారు. గ్రామ పంచాయతీల పనితీరును కేవలం పన్నుల వసూళ్లతోనే అంచనా వేయకుండా, ప్రజలకు అందిస్తున్న సేవలు, పారిశుధ్యం, పారదర్శకత, డిజిటల్ పాలన, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. 16వ ఆర్థిక సంఘం గ్రామీణ స్థానిక సంస్థల సిఫార్సులపై కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ వర్క్‌షాప్‌లో మంత్రి సీతక్క తెలంగాణ ప్రభుత్వ అభిప్రాయాలను వివరించారు. స్పెషల్ సీఎస్ దానకిషోర్ తో పాటు ఇతర రాష్ట్రాల మంత్రులు, అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ...జీపీలకు పనితీరు ఆధారిత గ్రాంట్లను తెలంగాణ ప్రభుత్వం స్వాగతిస్తోందని, అయితే ఆదాయ సామర్థ్యం తక్కువగా ఉన్న ఆదివాసీ, గిరిజన, మారుమూల ప్రాంతాల గ్రామ పంచాయతీలపై అదనపు పన్నుల భారం మోపే విధంగా నిబంధనలు ఉండకూడదన్నారు. అభివృద్ధిని ప్రజల ఆర్థిక స్థితితో ముడిపెట్టడం సమంజసం కాదని పేర్కొన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో అనేక గ్రామ పంచాయతీల జనాభా చాలా తక్కువగా ఉండటంతో వాటి సొంత ఆదాయ వనరులు కూడా పరిమితంగానే ఉంటాయని తెలిపారు. అలాంటి ప్రాంతాలకు ప్రత్యేక సడలింపులు ఇవ్వాలని, ఆదివాసీ, గిరిజన, షెడ్యూల్డ్ కులాల జనాభా అధికంగా ఉన్న గ్రామ పంచాయతీలు, మండల స్థాయి స్థానిక సంస్థలకు కూడా పనితీరు గ్రాంట్ల అర్హతలో వెసులుబాటు కల్పించాలని కోరారు. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల కారణంగా ఎన్నికలు జరగని 62 గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి నిధులు నిలిపివేయడం వల్ల అక్కడి ప్రజలకు అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. కోర్టు ఆదేశాల వల్ల ఎన్నికలు ఆలస్యమైన ప్రత్యేక పరిస్థితుల్లో నిధులు కొనసాగించేలా నిబంధనలు ఉండాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి గ్రామ అవసరం భిన్నంగా ఉంటుందని, అందువల్ల స్థానిక అవసరాలకు అనుగుణంగా గ్రామ సభలు నిర్ణయాలు తీసుకునేలా అన్‌టైడ్ బేసిక్ గ్రాంట్లను తగిన స్థాయిలో కొనసాగించాలని మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు. డిజిటల్ గవర్నెన్స్, ఈ-గ్రామ్ స్వరాజ్, పీఎఫ్ఎంఎస్ వంటి వ్యవస్థలను తెలంగాణ ప్రభుత్వం స్వాగతిస్తోందని... వాటి అమలుకు అవసరమైన శిక్షణ, సిబ్బంది, ఇంటర్నెట్ కనెక్టివిటీ, సాంకేతిక మౌలిక వసతులను మారుమూల గ్రామాల్లో కేంద్రం బలోపేతం చేయాలని కోరారు. షెడ్యూల్డ్ ప్రాంతాలు, వెనుకబడిన జిల్లాలు, భౌగోళికంగా క్లిష్టమైన ప్రాంతాల్లో ప్రజా సేవలను అందచేసేందుకు అధిక వ్యయం అవుతున్నందున నిధుల కేటాయింపులో అలాంటి ప్రాంతాలకు ప్రత్యేక వెయిటేజ్ ఇవ్వాలని కోరారు. బలమైన గ్రామ పంచాయతీలు, బలమైన రాష్ట్రాలు కలిసి బలమైన భారత నిర్మాణానికి పునాది వేస్తాయని మంత్రి సీతక్క అన్నారు. బలమైన గ్రామ పంచాయతీలు, బలమైన రాష్ట్రాలు కలిసి బలమైన భారత నిర్మాణానికి పునాది వేస్తాయని మంత్రి సీతక్క అన్నారు. గ్రామీణ స్థానిక సంస్థలను మరింత బలోపేతం చేయాలంటే రాష్ట్రాలకు తగిన ఆర్థిక సామర్థ్యం ఉండాలని, సహకార సమాఖ్య స్ఫూర్తితో రాష్ట్రాలను బలోపేతం చేస్తూనే పంచాయతీలను మరింత శక్తివంతం చేసే విధంగా 16వ ఆర్థిక సంఘం సిఫార్సులు ఉండాలని మంత్రి సీతక్క సూచించారు

## అభివృద్ధిలో కోదాడ నియోజకవర్గాన్ని అగ్రగామిగా ఉంచుతాం



**కోదాడ (జనంసాక్షి) :** కోదాడ నియోజకవర్గం నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురంలో రూ. 20 కోట్లతో బరాఖత్ గూడెం నుండి కృష్ణనగర్, నడిగూడెం, మందడి నరసింహాలగూడెం కలుపుతు కాగితరామచంద్రాపురం వరకు 9.5 కి. మీ దీ రోడ్డు కు కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిరెడ్డితో కలసి రాష్ట్ర నీటిపారుదల, ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ కోదాడ నియోజకవర్గం లోని అన్ని గ్రామాలను కలుపుతూ తారు రోడ్లు వేయించడం జరుగుతుందని, కోదాడ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టడం జరిగినదని కోదాడలో 26 కోట్లతో 100 పడకల హాస్పిటల్ నిర్మాణం చేస్తున్నామని, కోదాడ గవర్నమెంట్ హాస్పిటల్ లో పేద ప్రజల కొరకు 2.5 కోట్లతో సిటీ స్కాన్ మిషన్, అలాగే కిడ్నీ రోగుల కొరకు డయాలసిస్ సెంటర్ ను అందుబాటులో తీసుకొచ్చామని, చిలుకూరులో 250 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూలు, 50 కోట్లతో జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటు చేస్తున్నామని, రాబోవు రోజులలో కోదాడ నియోజకవర్గాన్ని అగ్రగామి నియోజకవర్గముగా నిలబెడతానని, కొత్తగా వేసిన తారు రోడ్లపై వ్యవసాయ పనులు నిమిత్తం ట్రాక్టర్లకు బిగించిన ఫుల్ వీల్స్, ఆఫ్ వీల్స్ తిప్పరాదని ఇలా తిప్పడం వలన రోడ్లు తొందరగా పాడైపోతాయని కావున గ్రామ ప్రజలు రోడ్లను కలకాలం ఉండే విధంగా చూసుకోవాలని అన్నారు. అలాగే ఈ సంవత్సరం ఎలీనో ప్రభావంతో వర్షాలు తక్కువగా పడతాయని వాతావరణ శాస్త్రవేత్తలు సూచించినందున, రైతులు వాస్తవ పరిస్థితులను తెలుసుకొని వ్యవసాయ శాఖ వారు సూచించిన సూచనలు పాటించి నీరు తక్కువ అవసరం అగు ఆరుతడి పంటలు పండించాలని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ, ఆర్ అండ్ బి ఎస్సీ సీతారామయ్య, జిల్లా గ్రంధాలయ చైర్మన్ వంగవీటి రామారావు, తాసిల్దార్ సర్పంచ్ చక్రం ఉమ, ఏఐసిసి మెంబర్ సర్వోత్తమ్ రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కుకీ దొంగలించాడంటూ.. ఉద్యోగి తొలగింపు

- అమెరికాలో ఫోర్డ్ కంపెనీ ఘరానా నిర్ణయం
- తప్పని తేలడంతో ఉద్యోగంలో తిరిగి ఆహ్వానం
- నమ్మకం లేనిచోట పనిచేయలేనన్న ఉద్యోగి

**వాషింగ్టన్, జూలై3 (జనంసాక్షి) :** చాక్లెట్ కుకీ దొంగలించాడనే ఆరోపణలపై ప్రముఖ వాహన తయారీ సంస్థ ఫోర్డ్ రూ.1.9 కోట్ల జీతం తీసుకునే ఓ ఉద్యోగిని తొలగించింది. ఈ ఘటన అమెరికాలో వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. కెంటకీలోని లూయిస్‌విల్లేలో ఉన్న ఫోర్డ్ ట్రక్ ఫ్యాక్టరీలో.. 60ఏళ్ల కర్ట్ క్రోమ్ 11 ఏళ్లుగా పని చేస్తున్నాడు. ఎంతో విధేయతగా సగటున వారానికి 60 గంటలు పనిచేసేవాడినని.. అయినప్పటికీ తప్పుడు ఆరోపణలతో తనను ఉద్యోగం నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశాడు. తాను కంపెనీలో రూ. 1.9 కోట్లు సంపాదిస్తున్నానని.. గతేడాది ఆఫీస్ క్యాంటీన్‌లో సుమారు రూ. 1.14 లక్షలు ఖర్చు చేశానని తెలిపాడు. ఇటీవల కంపెనీలో ఉన్న సమయంలో షుగర్ లెవల్స్ పడిపోతున్నట్లు అనిపించడంతో ఓ చాక్లెట్ కుకీ కుకీని కొనుగోలు చేశానని పేర్కొన్నాడు. కొద్ది రోజుల అనంతరం సూపర్‌వైజర్ తనను పిలిచి ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు చెప్పాడని.. కారణమేంటని అడగ్గా కుకీని దొంగలించినందుకు జాబ్ నుంచి తీసేస్తున్నట్లు పేర్కొన్నాడని వెల్లడించాడు. తాను కుకీని దొంగలించలేదని.. దానిని కొనుగోలు చేసినట్లు తన వద్ద బిల్లు ఉందని చెప్పినప్పటికీ బలవంతంగా ఫ్యాక్టరీ ప్రాంగణం నుంచి బయటకు పంపేశారని ఆరోపించాడు. ఆ బిల్లు స్క్రీన్‌షాట్ పంపించిన అనంతరం తాను నిర్దోషిగా తేలడంతో ఉద్యోగానికి తిరిగి రావాలని యూనియన్ ప్రతినిధి పిలిచారని బాధితుడు వెల్లడించాడు. కానీ తనను అవమానించిన చోట పని చేయకూడదని నిర్ణయించుకున్నట్లు అతడు వెల్లడించాడు. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ఉద్యోగి పట్ల ఫోర్డ్ అధికారుల తీరును నెటిజన్లు విమర్శిస్తున్నారు.

## విదేశీ పేరున్నంత మాత్రాన హిందువు కాదంటే ఎలా?

- మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పు



**చెన్నై, జూలై3 (జనంసాక్షి) :** మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. విదేశీ పేరు, పౌరసత్వం ఉన్నంత మాత్రాన హిందూ గుర్తింపును నిరాకరించలేమని తేల్చి చెప్పింది. హిందూ మతాన్ని స్వీకరించడానికి ఎలాంటి సర్టిఫికెట్లు, ప్రత్యేక వేడుకలు అవసరం లేదని మద్రాస్ హైకోర్టు అభిప్రాయపడింది. ఈ మేరకు తమిళనాడు దేవాదాయ శాఖ ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేస్తూ, అమెరికా పౌరురాలు లారా ఫ్రాన్సెస్ అయ్యంగార్‌ను హిందూ భక్తురాలిగానే పరిగణించాలని ఆదేశించింది. లారా ఫ్రాన్సెస్‌ను 'అమెరికన్ క్రైస్తవ మహిళ'గా పేర్కొంటూ తమిళనాడు దేవాదాయ శాఖ ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు కొట్టివేసింది. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. విదేశీయులు అనగానే క్రైస్తవులని అంచనా వేయడం తప్పు అని తెలిపింది. మనఃస్ఫూర్తిగా మతాన్ని ఆచరిస్తూ, హిందూ జీవన విధానాన్ని పాటిస్తే వారు హిందువులే అవుతారని స్పష్టం చేసింది. ఈ మేరకు తంజావూరు ఆలయంలో హిందూ మహిళలకు ఉండే అన్ని పూజా, దర్శన హక్కులు అమెరికన్ మహిళకు కూడా వర్తిస్తాయని తేల్చి చెప్పింది. ఆగమ శాస్త్రాలు, ఆలయ నిబంధనలకు లోబడి విదేశీ హిందూ భక్తురాలికి సమాన హక్కులు కల్పించాలని మద్రాస్ హైకోర్టు హుకుం జారీ చేసింది.

## విజన్ లేని నేత రేవంత్ రెడ్డి

- దారుణ పరిస్థితుల్లో తెలంగాణ : గండ్ర



**జయశంకర్ భూపాలపల్లి, జూలై 3(జనంసాక్షి) :** రాష్ట్రం ఓ విజన్ లేని నాయకుడి చేతిలో అల్లాడిపోతుందని, సీఎం రేవంత్ రెడ్డి అసత్యపు ప్రచారాలతో పబ్బం గడుపుతున్నాడన్నారని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో గండ్ర మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక జిల్లా ప్రధాన దవాఖాన పరిస్థితి ప్రశ్నార్ధకంగా మారిందన్నారు. పోస్టుమార్టం కోసం వచ్చిన శవాల మాంసాలను కుక్కలు పీక్కుతినే దీనస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మర్చిపోయి ప్రతి పక్షాలను తిట్టడమే లక్ష్యంగా పని చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ముందు చూపుతో రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేస్తే విజన్ లేని రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్ర ప్రజలు ఇబ్బందిపడుతున్నారన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు, పాల్గొన్నారు.

## ఫర్టిలిటీ వైద్యసేవలను విస్తరించాలి

- వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రంలోని ప్రభుత్వ హాస్పిటళ్లలో సంతాన సాఫల్య (ఫర్టిలిటీ) వైద్య సేవలను విస్తరించాలని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ గైనకాలజిస్టులతో ప్రత్యేక ఫర్టిలిటీ ఓపీ క్లినిక్‌లు నిర్వహించాలని సూచించారు. మరోవైపు, ప్రైవేట్ ఫర్టిలిటీ సెంటర్లలో నిబంధనల అమలుపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రతి నెల తప్పనిసరిగా తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘిస్తున్న సెంటర్లపై, అనైతిక చర్యలకు పాల్పడే సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ప్రభుత్వ హాస్పిటల్స్‌లో సంతాన సాఫల్య (ఫర్టిలిటీ) వైద్య సేవల విస్తరణ, ప్రైవేట్ ఫర్టిలిటీ సెంటర్ల నియంత్రణపై ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి శుక్రవారం, సెక్రటేరియట్‌లో సమీక్ష చేశారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్, డాక్టర్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, డాక్టర్ సంగీత సత్యనారాయణ, అసిస్టెంట్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ అండ్ సరోగసి స్టేట్ సూపర్‌వైజరీ బోర్డు సభ్యులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గాంధీ, పెట్లబుర్జులో హాస్పిటళ్లలో 2024లో ప్రారంభించిన ఐవీఎఫ్ సెంటర్ల పనితీరుపై మంత్రి ఆరా తీశారు. ఈ రెండు సెంటర్లు సత్ఫలితాలు ఇస్తున్నాయని అధికారులు మంత్రికి వివరించారు. రెండు సెంటర్లలో కలిపి ఇప్పటివరకూ సుమారు 37,300 మంది పేషెంట్లకు ఫర్టిలిటీ వైద్య సేవలు అందించామని తెలిపారు. ఈ సెంటర్లలో ఐవీఎఫ్ చేయించుకున్న 23 మందికి ప్రెగ్నెన్సీ కన్ఫామ్ అయిందని అధికారులు వెల్లడించారు. మొత్తం 510 మంది పేషెంట్లకు ఐయూఐ చేశామని, మరో 490 జంటలకు ఐవీఎఫ్ చికిత్స కొనసాగుతోందన్నారు. జిల్లాల్లోనూ ఫర్టిలిటీ వైద్య సేవలు విస్తరించడంపై అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ హాస్పిటళ్లలో ఎంతో అనుభవం, నైపుణ్యం కలిగిన గైనకాలజిస్టులు పనిచేస్తున్నారని మంత్రి గుర్తు చేశారు. వారి అనుభవం, నైపుణ్యం అవసరమైన పేషెంట్లకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. గైనకాలజిస్టులను మెటర్నల్ సర్వీసులకే పరిమితం చేయకుండా, వారి ఆసక్తిని బట్టి వారంలో కనీసం ఒకరోజు ఫర్టిలిటి ఓపీ క్లినిక్ నిర్వహించాలని మంత్రి అధికారులకు సూచించారు. ఇన్‌ఫర్టిలిటీ సమస్యలకు కారణాలపై యువతకు అవగాహన కల్పించే కార్యక్రమాలు కూడా చేపట్టాలని మంత్రి సూచించారు. గాంధీ, పెట్లబుర్జు తరహాలోనే జిల్లాల్లోనూ దశలవారీగా ఐవీఎఫ్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్టు మంత్రి వెల్లడించారు. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఉన్న ఫర్టిలిటీ సెంటర్ల వివరాలు, ఆయా సెంటర్ల కార్యకలాపాలు, అధికారులు చేపట్టిన తనిఖీల వివరాలను హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, డాక్టర్ సంగీత సత్యనారాయణ మంత్రికి వివరించారు. రాష్ట్రంలో మొత్తం 464 ఫర్టిలిటీ సెంటర్లు ఉన్నాయని, ఇందులో 60 సెంటర్లకు నోటిసులు ఇచ్చామని వెల్లడించారు. తీవ్ర ఉల్లంఘనలకు పాల్పడిన 2 సెంటర్ల లైసెన్స్‌లను పర్మినెంట్‌గా రద్దు చేశామని, మరో 9 సెంటర్ల లైసెన్స్‌లను సస్పెండ్ చేశామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రైవేట్ ఫర్టిలిటీ సెంటర్లలో పారదర్శకత, ప్రమాణాల అమలుపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సృష్టి ఫర్టిలిటీ సెంటర్‌లో జరిగినటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినంగా వ్యవహరించాలని సూచించారు. నెలకు కనీసం ఒక్కసారైన ప్రతి ఫర్టిలిటీ సెంటర్‌లో తనిఖీలు చేయాలని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమించినా, అనైతిక చర్యలకు పాల్పడినా, పేషెంట్లను అడ్డగోలుగా దోపిడీకి గురి చేసినా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పేషెంట్లకు ఇస్తున్న మెడిసిన్, ఇంజక్షన్లు, వాటి తయారీ కంపెనీలు, ఎంఆర్పీ తదితర అంశాలను కూడా క్షుణ్ణంగా పరిశీలించాలని మంత్రి సూచించారు. ప్రైవేటు సెంటర్ల నుంచి ప్రతి రిపోర్టులను తీసుకోవాలని, పోర్టల్‌లో వివరాలు అప్‌లోడ్ చేయని సెంటర్లపై చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

## ఆ నిర్ణయం సరైంది కాదు

- పాలమూరు అధ్యయన వేదిక

**హైదరాబాద్ (జనంసాక్షి) :** క్యాబినెట్ సమావేశంలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు ఇతర సిబ్బందికి కూడా మధ్యాహ్న భోజనం పెడతామని నిర్ణయం తీసుకున్నారని, ఇది విజ్ఞతతో తీసుకున్న నిర్ణయం కాదని పాలమూరు అధ్యయన వేదిక అభిప్రాయపడింది. ఈ మేరకు కన్వీనర్ వీ. రాఘవాచారి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులకు వివిధ స్థాయిల పాఠశాలలలో వివిధ రకాల ప్రమాణాలు పాటిస్తున్నారని, పిల్లలకు పెట్టే భోజనంలో వివక్ష చూపుతున్న ప్రభుత్వం ఉపాధ్యాయులకు భోజనం పెడతామని ప్రకటించడం ఉపాధ్యాయులను అవమానానికి గురి చేయడం మాత్రమేనని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ తప్పుడు నిర్ణయం వెంటనే ఉపసంహరించుకోవాలని, గత ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల రిటైర్మెంట్ వయసు పెంచింది. 58 సంవత్సరాల వయసు దాటిన వారు ఆరోగ్య సంబంధిత సమస్యలు ఎదుర్కొంటున్నారని, పని వత్తిడికి గురవుతున్నారు. వారి వారి ఆరోగ్య పరిస్థితి వల్ల క్యారియర్ తెచ్చుకుని మాత్రమే వైద్యుల సూచనల మేరకు ఆహారం తీసుకునే పరిస్థితిలో ఉన్నారని తెలిపారు. స్థానిక వంట వారిని కాదని ఇతర సంస్థలు వండిన వంటలు నాణ్యత ప్రమాణాలు లేకుండా పిల్లలకు పెడుతున్నారని, ఈ పరిస్థితిని పూర్తిగా సమీక్ష చేసి తొలుత విద్యార్థులకు అందరికీ ఒకే ప్రమాణాలు ఉండే ఉత్తమ భోజనం అందించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సంఘాలు ఈ ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పిల్లలకు మంచి భోజనం కోసం పోరాటం చేయాలని కోరారు.

## సవాళ్లు విసరడం..పారిపోవడం అలవాటే

- రేవంత్, మంత్రుల తీరే ఇందుకు నిదర్శనం
- మాజీమంత్రి వేముల ప్రశాతంత్ రెడ్డి విమర్శలు



**హైదరాబాద్, జూలై 3 (జనంసాక్షి) :** ప్రతిపక్ష పార్టీలకు సవాల్ విసరడం, పారిపోవడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య అని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. మంత్రులు కూడా అదేతరహాలో ఉన్నారని మండిపడ్డారు. ఇందుకు తాజాగా మంత్రులు వ్యయహరించిన తీరే నిదర్శనమని అన్నారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులకు సవాల్ విసిరి తోక ముడిచిన కాంగ్రెస్ మంత్రుల డొల్లతనం బయట పడిందని , మంత్రులు పోలీసులను అడ్డంపెట్టుకొని పారిపోయారని ఆరోపించారు. గతంలో సవాల్ చేసిన రేవంత్ రెడ్డి ప్రెస్‌క్లబ్‌ను కల్లు కాంపౌండ్‌తో పోల్చి పారిపోగా , కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పి మూడు నెలల్లోనే మల్కాజిగిరి ఎంపీగా పోటీ చేశారని ఎద్దేవా చేశారు. ఉద్యమం జరిగినప్పుడు గుర్తుకు రాని గన్‌పార్క్ కాంగ్రెస్ మంత్రులకు ఇప్పుడు గుర్తొచ్చిందా ? అంటు ప్రశ్నించారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై మంత్రులు అహంకారంతో మాట్లాడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వద్ద సమాధానం లేనప్పుడే ప్రతిపక్ష నాయకులను అరెస్టులు చేస్తారని మండిపడ్డారు. ఏదేని సమస్యపై రేవంత్ రెడ్డి డిఫెన్స్ లో పడగానే బండి సంజయ్ తెరపైకి వస్తాడని, బండి సంజయ్ డిఫెన్స్ లో పడగానే ముఖ్యమంత్రి తెరపైకి వస్తాడని విమర్శించారు. అమృత్ టెండర్ లో ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డి కుంభకోణంపై కేంద్రానికి లేఖ రాస్తే చర్యలు ఎందుకు తీసుకోలేదని వేముల ప్రశ్నించారు. బొగ్గు కుంభకోణం జరిగిందని కేంద్రానికి లేఖ రాస్తే ఇంతవరకు చర్యలే లేవని అన్నారు. కేటీఆర్ హరీష్ రావు సెగకు మంత్రులు ఒక్కొక్కరు బయటకు వస్తున్నారని, ఇక ముందు ఇలాంటివి చాలా జరుగుతాయని స్పష్టం చేశారు.

## రైతుభరోసా నిధుల విడుదల

- నాలుగు రోజుల్లో రూ.6,590.37 కోట్ల జమ

**హైదరాబాద్, జూలై3 (జనంసాక్షి) :** రైతు భరోసా పథకం అమలులో తెలంగాణ ప్రభుత్వం వేగం పెంచింది. కేవలం నాలుగు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో రూ.6,590.37 కోట్ల రైతు భరోసా నిధులను జమ చేసి రికార్డు సృష్టించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. నేడు నాలుగో విడతలో 4 నుంచి 5 ఎకరాల భూమి ఉన్న రైతులకు రూ.1,188 కోట్ల రైతు భరోసా నిధులను విడుదల చేసింది. ఈ విడతలో 4.41 లక్షల మంది రైతులు లబ్ది పొందినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఇప్పటివరకు మొత్తం 65.76 లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా సాయం జమ చేసినట్లు అధికారులు వెల్లడించారు. మిగిలిన అర్హులైన రైతులకు కూడా దశలవారీగా నిధులు విడుదల చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రైతులకు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకుందని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతు భరోసా నిధులు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నామని మంత్రి తెలిపారు.

## తెలంగాణ ఉద్యమకారులతో విస్తృత సంప్రదింపులు

- 6న భేటీకి ఓయూ జెఎసి విద్యార్థి నాయకులకు ఆహ్వానం

**హైదరాబాద్, జూలై3 (జనంసాక్షి) :** తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారి సంక్షేమానికి చేపట్టాల్సిన చర్యలపై ప్రభుత్వానికి సిఫార్సులు చేయడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ ఈ నెల 6వ తేదీ నుంచి ఉద్యమకారులతో విస్తృత స్థాయి సంప్రదింపుల కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. 6న జరిగే తొలి సమావేశంలో తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థి జేఏసీ నాయకులతో కమిటీ సమావేశం కానుంది. ఈ సమావేశానికి ఆనాడు ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన విద్యార్థి నాయకుడిగా మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాం. మీరు పాల్గొని, ఉద్యమకారుల సంక్షేమం కొరకు తీసుకోవాల్సిన విధానాలపై మీ సూచనలను ఇవ్వగలరని విజ్ఞప్తి చేస్తున్నట్లు కె. కేశవరావు,పొన్నం ప్రభాకర్, ఎమ్. కోదండరామ్,అద్దంకి దయాకర్, రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డిలు ఒక ప్రకటనలో కోరారు. సచివాలయం ఎదురుగా ఉన్న అమరవీరుల స్మారకంలో ఉదయం 10 గంటలకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370



# మంత్రి కొండా సురేఖతో పీసీసీఎఫ్ వినయ్ కుమార్ భేటీ

- అటవీ సంపద పరిరక్షణ, పచ్చదనంపై కార్యాచరణను అమలు చేయాలని నూతన పిసిసిఎఫ్ కు దిశానిర్దేశం
- మాజీ పిసిసిఎఫ్ సువర్ణను చీరతో సత్కరించిన మంత్రి

**హైదరాబాద్, జూలై3 (జనంసాక్షి) :** రాష్ట్ర అటవీదళాల నూతన ప్రధాన సంరక్షణాధికారి (పిసిసిఎఫ్)గా బాధ్యతలు స్వీకరించిన వినయ్ కుమార్ శుక్రవారం అటవీ శాఖ మంత్రివర్యులు శ్రీమతి కొండా సురేఖను జూబ్లిహిల్స్ లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ వారికి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అటవీ సంపద పరిరక్షణ, అటవీ విస్తీర్ణం పెంపు, జీవ వైవిధ్య సంరక్షణ, సామాజిక అటవీ కార్యక్రమాలు, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంపొందించడం, ప్రభుత్వ లక్ష్యాలు, అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, తదితర అంశాలపై వీరిరువురు సమగ్రంగా చర్చించారు. అటవీ సంపదను భవిష్యత్ తరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్య సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ విధానాలను సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి సురేఖ పిసిసిఎఫ్ కు సూచించారు. అటవీ శాఖ కార్యక్రమాల అమలులో సాంకేతికత వినియోగం, అటవీ రక్షణ చర్యల బలోపేతం, పచ్చదనం పెంపుదల, అటవీ అభివృద్ధికి సంబంధించిన కార్యాచరణను మరింత వేగవంతం చేయాలని మంత్రి వినయ్ కుమార్ కు దిశానిర్దేశర చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశిరచిన లక్ష్యాల సాధనకు అటవీ శాఖ పూర్తి నిబద్ధతతో పనిచేస్తుందని పీసీసీఎఫ్ వినయ్ కుమార్ ఈ సందర్భంగా మంత్రికి హామీ ఇచ్చారు. అడవుల సంరక్షణకు అహర్నిశలు కృషి చేస్తూ, అటవీ సంపదను కాపాడుతున్న అటవీ అధికారులు, సిబ్బందికి ప్రతి ఏటా అవార్డులు, నగదు ప్రోత్సహకాలు అందించేలా చర్యలు చేపట్టినందుకు గాను పిసిసిఎఫ్ వినయ్ కుమార్ మంత్రి సురేఖ గారికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ అటవీ రంగంలో ఈ చర్య మైలురాయిగా నిలుస్తుందని, అటవీ సిబ్బంది సేవలకు ప్రభుత్వం ఇస్తున్న గౌరవానికి ఇది నిదర్శనమని ఆయన అన్నారు. పదవీ విరమణ తర్వాత తనను మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ పిసిసిఎఫ్ సువర్ణను మంత్రి కొండా సురేఖ చీరతో సత్కరించి, అభినందించారు. అటవీ శాఖకు ఆమె అందించిన విశిష్ట సేవలను కొనియాడారు. పదవీవిరమానంతర జీవితం సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు.

# 15న ఉద్యోగాల భర్తీ కోసం మహాధర్నా

- కేంద్ర ప్రభుత్వం 60 లక్షల, తెలంగాణలో 2 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలి
- 6న ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం వామపక్షాల ఆధ్వర్యంలో మహాధర్నా




**హైదరాబాద్ (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వం పరిధిలోని 60 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని 2 లక్షల ఉద్యోగాల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న నిరుద్యోగుల పక్షాన తమ పార్టీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించనున్నట్టు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రకటించారు. శు క్రవారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య, టి.జ్యోతి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డితో కలిసి ఆయన మీడియా సమావేశంలో పాల్గొన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన 12 ఏండ్ల కాలంలో నిరుద్యోగులకు ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదనీ, ఏటా 2 కోట్ల హామీని గద్దెనెక్కడానికి వాడుకుని బుట్టదాఖలు చేసిందని విమర్శించారు. ఒక్క రైల్వే శాఖలోనే పది లక్ష?ల ఉద్యోగాల ఖాళీలున్నాయని ఎత్తిచూపారు. గుడిసెలు వేసుకున్న పేదలకు 120 గజాల స్థలమివ్వాలనీ, పేదలకు ఇండ్ల స్థలమిచ్చి ఇందిరమ్మ ఇండ్లు కట్టించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 6న వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జరిగే మహాధర్నాకు పేదలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎస్.వీరయ్య మాట్లాడుతూ...ప్రజల మౌలిక సమస్యలను పట్టించుకోకుండా ప్రజల దృష్టిని మరల్చేందుకు రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు రాజకీయ డ్రామా ఆడుతున్నారని విమర్శించారు. రాజకీయ డ్రామాలకు అడ్డుకట్ట వేయాలనీ, అప్పులపై శ్వేతపత్రం విడుదల చేసి అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేసేది ఎర్రజెండా పార్టీలేనన్నారు.

# నెలరోజుల పసికందు కిడ్నాప్ ఛేదన

- 72 గంట్లలోనే కిడ్నాపర్ల అరెస్ట..పాప సేఫ్
- వివరాలు వెల్లడించిన సపి రమేశ్ రెడ్డి

**హైదరాబాద్, జూలై3 (జనంసాక్షి) :** నెలరోజుల పసికందు కిడ్నాప్ కేసును సైబరాబాద్ చందానగర్ పోలీసులు 72గంటల్లో ఛేదించారు. ఈ సందర్భంగా శు క్రవారం సైబరాబాద్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపి రమేష్ రెడ్డి కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. గత నెల 30వ తేదీ అర్ధరాత్రి అనంతరం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో లింగంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో నిద్రిస్తున్న మహిళ వద్ద నుంచి నెల రోజుల వయస్సు గల ఆడశిశువును కిడ్నాప్ చేసిన ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి..ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా తప్పిపోయిన, కిడ్నాప్‌కు గురైన చిన్నారులను గుర్తించి వారి కుటుంబాలకు అప్పగించే క్రమంలో ఈ కేసును అత్యంత ప్రాధాన్యంగా తీసుకొని కేవలం 72 గంటల్లోనే కేసును ఛేదించి పాపను సురక్షితంగా రక్షించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన సాధిక మక్సూద్ అనే మహిళకు సంతానం లేకపోవడంతో పాపను అక్రమంగా తెప్పించుకునేందుకు కుట్ర పన్నినట్లు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. 'ఆమె బ్యూటీ పార్లర్‌లో పనిచేస్తున్న నిమ్మి జహాన్, రహనుమా అలీల సహాయం కోరింది. లింగంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో రోడ్డుపై నిద్రిస్తున్న కర్ణాటక కు చెందిన కుటుంబం వద్ద నుంచి పసికందును ఎత్తుకెళ్లి ఆటోలో ఎత్తుకెళ్లారు. ఈ శిశువును తీసుకురావడానికి కిడ్నాపర్లకు సాధిక మక్సూద్ రూ.1.50 లక్షలు చెల్లించినట్లు విచారణలో తేలింది. అనంతరం పాపతో కలిసి కోల్‌కతాకు వెళ్లేందుకు రైల్వే టికెట్లు కూడా బుక్ చేసుకున్నప్పటికీ, వేగంగా స్పందించి వారిని అదుపులోకి తీసుకుని పాపను రక్షించాం' అని తెలిపారు. ఈ కేసులో ఏ1 మొహమ్మద్ జుబెర్, ఏ2 మొహమ్మద్ ఇర్ఫాన్, ఏ3 సాధిక మక్సూద్, ఏ4 నిమ్మి జహాన్, ఏ5 రహనుమా అలీలను అరెస్ట్ చేసామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ క్రైమ్స్ శ్రీనివాస్, ఆర్ సి పురం ఏసీబీ పై శ్రీనివాస్ రావు, చందానగర్ సిఐ విజయ్ కుమార్, అమీన్పూర్ డిఐ భాస్కర్ తో పాటు పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు

- మీడియా, కమ్యూనికేషన్ నోడల్ అధికారులతో భేటీ
- తెలంగాణ సమాచార, పౌరసంబంధాల శాఖ అధికారుల హాజరు



**న్యూఢిల్లీ, జూలై 3 (జనంసాక్షి) :** భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహించిన ఒకరోజు మీడియా / కమ్యూనికేషన్ నోడల్ అధికారుల జాతీయ సదస్సులో తెలంగాణ రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖకు చెందిన జిల్లా పౌర సంబంధాల అధికారులు, మీడియా నోడల్ అధికారులు, సోషల్ మీడియా నోడల్ అధికారులు పాల్గొన్నారు. దేశంలోని 15 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన సుమారు 240 మంది జిల్లా పౌర సంబంధాల అధికారులు హాజరైన ఈ సదస్సులో ఎన్నికల నిర్వహణలో కమ్యూనికేషన్ పాత్ర, మీడియా నిర్వహణ, ఎన్నికల చట్టాలు, డిజిటల్ సాంకేతికత వినియోగం, తప్పుడు ప్రచారాల నియంత్రణ, సోషల్ మీడియా సవాళ్లు, ఎన్నికల సమాచారాన్ని ప్రజలకు వేగంగా చేరవేసే విధానాలపై ఎన్నికల సంఘం అధికారులు సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ మాట్లాడుతూ, స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక, పారదర్శక ఎన్నికల నిర్వహణలో మీడియా, ప్రజా సంబంధాల అధికారుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ఎన్నికల సంఘం విడుదల చేసే అధికారిక సమాచారాన్ని ప్రజలకు వేగంగా చేరవేయడంతో పాటు తప్పుడు ప్రచారం, అపోహలు, దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాల్సిన బాధ్యత కమ్యూనికేషన్ అధికారులపై ఉందని పేర్కొన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ సర్ ప్రక్రియ ప్రాధాన్యాన్ని వివరిస్తూ, పౌరసత్వ చట్టం-1955 నిబంధనలకు అనుగుణంగా అర్హులైన భారతీయ పౌరుల పేర్లు మాత్రమే ఓటరు జాబితాలో ఉండేలా ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అపోహలు తొలగించి వాస్తవాలను చేరవేయడంలో మీడియా, ప్రజా సంబంధాల అధికారుల పాత్ర అత్యంత ముఖ్యమని చెప్పారు. సదస్సులో ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, ఫారం-17సీ, ఆర్టికల్-324 కింద ఎన్నికల సంఘానికి ఉన్న అధికారాలు, ఎన్నికల ప్రచార నిబంధనలు, పెయిడ్ న్యూస్ నియంత్రణ, సోషల్ మీడియా, కృత్రిమ మేధ వల్ల ఎదురవుతున్న సవాళ్లు, వాటిని ఎదుర్కొనే వ్యూహాలపై ఎన్నికల సంఘం సీనియర్ అధికారులు ప్రత్యేక ప్రజెంటేషన్లు ఇచ్చారు. అలాగే, ఎన్నికల సంఘం రూపొందించిన సమగ్ర డిజిటల్ వేదిక ద్వారా ఓటరు నమోదు, ఓటరు వివరాల సవరణ, పోలింగ్ కేంద్రాల సమాచారం, అభ్యర్థుల అఫిడవిట్లు, ఎన్నికల ఫలితాలు తదితర సేవలను ఒకే వేదికపై ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిన విధానాన్ని వివరించారు. ప్రతి స్మార్ట్‌ఫోన్ వినియోగదారుడు వినియోగించేలా విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. సదస్సులో ఎన్నికల కమ్యూనికేషన్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించే విధానాలు, మీడియాతో సమన్వయం, సోషల్ మీడియా వినియోగం, ప్రజల్లో ఎన్నికలపై అవగాహన పెంపు, తప్పుడు ప్రచారాన్ని వేగంగా ఖండించే వ్యూహాలపై విస్తృతంగా చర్చించి పలు సూచనలు చేశారు. తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారుల కార్యాలయం నుంచి అదనపు ప్రధాన ఎన్నికల అధికారి ఎన్. శంకర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రసన్నరాజ్, తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ సంయుక్త సంచాలకులు యు. వెంకటేశ్వరరావు, తెలంగాణ రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనరేట్ పౌర సంబంధాల అధికారులు ఎం. కిరణ్మయి, ఏ. వనజతో పాటు మీనాక్షి, ఇందిర, అనిల్, విశ్వేశ్ తదితర జిల్లా ప్రజా సంబంధాల అధికారులు పాల్గొన్నారు.

# భారీగా వచ్చిన వైద్య శాఖ సిబ్బంది

- సీఎం ప్రజావాణి అమలు తీరును పరిశీలించిన నూతన స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్
- సీఎం ప్రజావాణిలో 301 దరఖాస్తులు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన 235వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 301 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 170, రెవెన్యూ శాఖకు సంబంధించి 27, సాంఘిక సంక్షేమ శాఖకు 17, ప్రవాసి ప్రజావాణికి 02 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 85 దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్ దరఖాస్తులను స్వీకరించి ఎండార్స్ మెంట్ చేసి సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. వైద్య ఆరోగ్య శాఖలో విధులు నిర్వహిస్తున్న ఆయాలు, ఏ.ఎన్.ఎం.లు, అంగన్ వాడి సిబ్బంది పెద్ద ఎత్తున సీఎం ప్రజావాణికి తరలివచ్చి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. పీ.ఎఫ్. అమలు చేయాలని, వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు దరఖాస్తు చేశారు. ప్రీ ప్రైమరీ పిల్లలను అంగన్ వాడిలోనే కొనసాగించాలని వారు కోరారు. కాగా నూతనంగా పోస్టింగ్ అయిన స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్ ను చిన్నారెడ్డి దగ్గర ఉండి ప్రతి శాఖ డెస్క్ కు తీసుకుని వెళ్లి అధికారులను పరిచయం చేసి ప్రజావాణి అమలు జరుగుతున్న తీరును వివరించారు. ఈ కార్యక్రమంలో ఏ.సీ.పీ. ఉమేందర్, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రభుత్వ ఎన్నారై సమన్వయ మండలి వైస్ చైర్మన్ మంద భీం రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

# తీన్మార్ మల్లన్న ఆశయాల కోసం చక్రం తిప్పిన టీఆర్పీ

- కరీంనగర్ నుంచి భువనగిరి సభకు సైకిల్ యాత్ర శ్రీకారం
- పిడిశెట్టి రాజు సైకిల్ యాత్రను ప్రారంభించిన రాష్ట్ర కార్యదర్శి....



**కరీంనగర్ (జనంసాక్షి) :** బహుజన రాజ్యాధికార సాధన కోసం తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో కరీంనగర్ నుంచి భువనగిరి వరకు సైకిల్ యాత్రకు శ్రీకారం చుట్టిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా పార్టీ నాయకులతో కలిసి జెండా ఊపి యాత్రను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా భువనగిరిలో జూలై 5న నిర్వహించనున్న "రాజ్యాధికార సమరభేరి - విజయభేరి సభ" ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అఖిల్ పాషా మాట్లాడుతూ, తీన్మార్ మల్లన్న ఆశయమైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు రాజకీయ రాజ్యాధికారం సాధించడమే తెలంగాణ రాజ్యాధికార పార్టీ లక్ష్యమని స్పష్టం చేశారు. దశాబ్దాలుగా కష్టపడేది బీసీలు అయినా, అధికారాన్ని అనుభవిస్తున్నది మాత్రం కొద్దిమంది అగ్రవర్గాలేనని విమర్శించారు. రాజకీయ అధికారమే సామాజిక, ఆర్థిక, విద్యా అభివృద్ధికి మూలమని పేర్కొంటూ, ఇకపై బీసీలను ఓటు బ్యాంకులుగా మాత్రమే ఉపయోగించుకునే రాజకీయాలకు ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. పిడికెడు మంది చేతుల్లో బందీగా ఉన్న అధికారాన్ని ప్రజల చేతుల్లోకి తీసుకురావడమే సమరభేరి లక్ష్యమని తెలిపారు. జూలై 5న భువనగిరిలో జరిగే విజయభేరీ సభకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, యువత, విద్యార్థులు, మహిళలు, కార్మికులు, రైతులు వేలాదిగా తరలివచ్చి మన ఐక్యతను చాటాలని, తెలంగాణ రాజకీయ చరిత్రలో కొత్త అధ్యాయానికి నాంది పలకాలన్నారు. ఇప్పటికే ఈ విజయభేరీ సభతో అగ్రవర్ణాల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని, సభ విజయంతో అగ్రవర్ణాల దుకాణాలు మూతపడుతాయని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు జింక లావణ్య, జిల్లా అధ్యక్షురాలు గంగిపెల్లి అరుణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, చొప్పదండి నియోజకవర్గ ఇంచార్జ్ కొప్పుల వెంకటేష్, జిల్లా నాయకులు మహబూబ్ అలీ, కొత్తపల్లి మండల అధ్యక్షుడు ఓర్సు రాజు, నాయకులు దారంగుల గణేష్, కోరే గంగ, రవితేజ, సూతరి సాధనందం, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# లాడ్జిగదిలో యువతి అనుమానాస్పద మృతి

- యువతితో కలిసి వచ్చిన ఫారూఖ్ అనే వ్యక్తి అరెస్ట్
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు




**హైదరాబాద్, జూలై3 (జనంసాక్షి) :** నగరంలోని లంగర్‌హౌస్ పరిధిలో ఓ యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కలకలం రేపింది. మృతురాలిని రేణుక(26)గా పోలీసులు గుర్తించారు. హోటల్ గ్రాండ్ లాడ్జ్‌లో సదరు యువతి ఫ్యాన్‌కు ఉరివేసుకున్న స్థితిలో కనిపించినట్లు తెలిపారు. ఫారూఖ్ అనే వ్యక్తితో కలిసి రేణుక హోటల్‌లో గది బుక్ చేసుకుంది. అనంతరం ఫారూఖ్ బయటకు వెళ్లి తిరిగి వచ్చేసరికి రేణుక ఫ్యాన్‌కు ఉరివేసుకున్న స్థితిలో కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. అయితే.. ఇది ఆత్మహత్య కాదని, తమ కుమార్తెను హత్య చేశారని యువతి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న లంగర్‌హౌస్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఫారూఖ్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. యువతిది హత్యా, ఆత్మహత్యా అనే దానిపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన లంగర్‌హౌస్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. లంగర్‌హౌస్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎండీ లైన్స్ వద్ద ఉన్న లాడ్జిలో రేణుక (26) అనే యువతి అనుమానాస్పద స్థితిలో మృతి ఘటన చోటు చేసుకుంది. అల్వాల్‌కు చెందిన రేణుకకు గోల్కొండ ప్రాంతానికి చెందిన ఫారుక్ (34)తో పరిచయం ఉంది. ఈ క్రమంలో ఇద్దరూ నిన్న రాత్రి హోటల్‌లో గదిని (రూమ్ నం.1611) బుక్ చేసుకున్నారు. తాను కొద్దిసేపు బయటకు వెళ్లి తిరిగి వచ్చేసరికి రేణుక ఉరివేసుకుని కనిపించిందని ఫారుక్ పోలీసులకు తెలిపాడు. అయితే, రేణుక కుటుంబ సభ్యులు ఇది ఆత్మహత్య కాదు.. హత్యేనని ఆరోపిస్తూ ఫారుక్‌పై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక, ఫోరెన్సిక్ ఆధారాల ఆధారంగా పూర్తి వివరాలు వెల్లడి కానున్నాయని పోలీసులు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**మహబూబాబాద్, జూలై3 (జనంసాక్షి) :** మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని టీక్యా తండా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. తొర్రూర్ నుంచి హైదరాబాద్ వెళ్లే ప్రధాన రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఈ ఘటన జరిగింది. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడు కొరిపెల్లి గ్రామానికి చెందిన ఎర్ర శ్రీనుగా గుర్తించారు.

## కర్ణాటకలో పాల్కూరికి సోమనాధునికి నివాళి



**పాలకుర్తి, జూలై 03(జనంసాక్షి)** తెలుగులో ద్విపద కావ్యాల ద్వారా దివ్యమైన రచనలు చేసిన మహకవి పాల్కూరికి సోమనాధుడని పాలకుర్తికి చెందిన సాహితీవేత్త డాక్టర్ శంకరమంచి శ్యాం ప్రసాద్ అన్నారు. శుక్రవారం కర్ణాటక రాష్ట్రంలోని రల్య క్షేత్రంలో నెలకొని ఉన్న పాల్కూరికి సోమనాధుని సమాధిని సందర్శించి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రాంతి పురుషుడైన బసవేశ్వరుని భావాలను తెలుగు వారు విస్తృతంగా ప్రచారం చేసిన సోమనాధుడు తన అవసాన కాలంలో ప్రఖ్యాతి చెందిన శివశరణి చెన్నమ్మ దర్శనం కోసం కల్య క్షేత్రానికి వెళ్లి అక్కడే శివసాయుజ్యం పొందాడని తెలిపారు. దాంతో భక్తులు ఆయనకు అక్కడే సమాధి నిర్మించారని తెలిపారు. బెంగళూరుకు 50 కిలోమీటర్ల దూరంలోని మాగడి కాల్య గ్రామంలో ఉన్న కొండపై కల్లేశ్వర స్వామి దేవాలయం శివ భక్తురాలు చెన్నమ్మ నివసించిన గుహ ఆమె సమాధి అలాగే పాల్కూరికి సోమనాధుని సమాధి ఉన్నాయి. అయితే ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ఆ మహకవి సమాది చెట్టు గడ్డి, గాసం పెరిగి అనాదరంగా ఉందని పాలకవర్గాలు ఇప్పటికైన కళ్లు తెరిచి దానిని పరిరక్షించాల్సిన అవసరం ఉందని అన్నారు.

## రైలు నుండి కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

- బాసర-ఫకీరాబాద్ మధ్య ఘటన
- గుర్తింపు కోసం పోలీసుల విజ్ఞప్తి

**బాసర, 03 జూలై(జనం సాక్షి) :** బాసర-ఫకీరాబాద్ రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి రైలు నుండి కిందపడి మృతి చెందిన ఘటన శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. బాసర రైల్వే స్టేషన్ మేనేజర్ ఇచ్చిన సమాచారం ప్రకారం, తేదీ 03.07.2026 రోజు ఉదయం 7.30 గంటలకు ముందు ఖవీ నెం. 433/33-35 వద్ద, బాసర-ఫకీరాబాద్ మధ్య గుర్తు తెలియని రైలులో ప్రయాణిస్తున్న సుమారు 50 ఏళ్ల పురుషుడు ప్రమాదవశాత్తూ రైలు నుండి కిందపడ్డాడు. కిందపడిన దెబ్బలకు అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలంలో మృతుడిని గుర్తించేందుకు ఎలాంటి గుర్తింపు ఆధారాలు లభించలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎండీ మెహబూబ్, ఆర్‌పిఎ ఎస్ఐ విచారణ జరుపుతున్నారు. మృతుడి వివరాలు తెలిసినవారు, ఫోటో చూసి గుర్తించినవారు నిజామాబాద్ రైల్వే ఎస్సై శ్రీ సాయి రెడ్డి నీ ఫోన్ నెం. 8712658591లో సంప్రదించాలని రైల్వే పోలీసులు కోరారు.